

తెలుగు దినపత్రిక

సాక్షర

చదువు..సమీక్షించు

RNI NO.APTEL/2011/42149



ఆదిలాబాద్ | సంపుటి : 16 సంచిక : 279 గురువారం, నవంబర్ 12, 2026 ఎడిటర్: ఎ. లింగన్న | పేజీలు : 8 రూ. 2.00



పరివర్తన రాజనీతి పార్టీ పేరుతో..

పేజీ 4




హైదరాబాదులో 'భారత్ సమ్మిట్'

పేజీ 3



ప్రజాస్వామ్య పరిరక్షణే భారత్ సమ్మిట్ ప్రధాన లక్ష్యం

పేజీ 3



ఆస్తి హక్కులపై సుప్రీంకోర్టు కీలక తీర్పు..

పేజీ 4


ఒకే సమయంలో రెండు రాష్ట్రాల సమ్మిట్‌లు

(హైదరాబాద్, సాక్షర): తెలుగు రాష్ట్రాల మధ్య పారిశ్రామిక , పెట్టుబడుల సాధనలో సరికొత్త పోటీ వాతావరణం నెలకొంది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రభుత్వాలు దాదాపు ఒకే సమయంలో మెగా పెట్టుబడుల సదస్సులు నిర్వహిస్తున్నాయి. తెలంగాణలోని రేవంత్ రెడ్డి సర్కారు హైదరాబాద్ వేదికగా నవంబర్ 12 నుంచి 14 వరకు మూడు రోజుల పాటు భారత్ సమ్మిట్ నిర్వహిస్తుండగా.. అటు ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం నవంబర్ 12, 13 తేదీల్లో విశాఖపట్నం వేదికగా ప్రతిష్టాత్మక 31వ సీఐఐ భాగస్వామ్య సదస్సు ను నిర్వహిస్తోంది. రెండు రాష్ట్రాల సదస్సుల పేర్లు, వేదికలు వేరైనా.. వాటి అంతిమ లక్ష్యం మాత్రం ప్రపంచ పారిశ్రామిక దిగ్గజాలను ఆకర్షించి, వేల కోట్ల రూపాయల పెట్టుబడులను ఒడిసిపట్టడమే.ఒకే సమయంలో రెండు భారీ సమ్మిట్‌లు జరగనుండటంతో సహజంగానే కార్పొరేట్ వర్గాల్లో, మీడియాలో పోలికలు మొదలయ్యాయి. ఏ సమ్మిట్‌కు ఎలాంటి గ్లోబల్ దిగ్గజాలు హాజరవుతున్నారు? ఏ రాష్ట్రానికి ఎన్ని లక్షల కోట్ల విలువైన అవగాహన ఒప్పందాలు కుదురుతున్నాయి? అన్న

విషయాలపై అంచనాలు సాగుతున్నాయి. మిగతా 2 లో



అంతరిక్షంలో చైనా అద్భుతం..



(బీజింగ్, సాక్షర): అంతరిక్ష పరిశోధనల్లో చైనా మరో చారిత్రాత్మక మైలురాయిని అధిగమించింది. తమ తియాంగాంగ్ అంతరిక్ష కేంద్రంలో పనిచేస్తున్న చైనా శాస్త్రవేత్తలు, ఇప్పటివరకు ప్రపంచంలో ఎవరూ సాధించని అత్యంత శీతల ఉష్ణోగ్రతను సృష్టించి రికార్డు నెలకొల్పారు. ఈ ప్రయోగంలో 9. పూర్తిగా 3 లో

కృష్ణా జలాల పంపిణీలో వాటా



(హైదరాబాద్, సాక్షర): కృష్ణా జలాల పంపిణీలో తెలంగాణకు రావాల్సిన న్యాయమైన వాటాను సాధించేందుకు సుప్రీంకోర్టులో సమర్థంగా వాదనలు వినిపించాలని ముఖ్యమంత్రి ఎ. పూర్తిగా 4 లో

ఫ్యూచర్ సిటీ మాస్టర్ ప్లాన్ సిద్ధం



(హైదరాబాద్, సాక్షర): హైదరాబాద్ శివార్లలో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తలపెట్టిన 'ఫ్యూచర్ సిటీ' మాస్టర్ ప్లాన్ సిద్ధమైంది. సింగపూర్‌కు చెందిన ప్రఖ్యాత సంస్థ 'డీపీ ఆర్కిటెక్ట్స్' అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా ఈ ప్రణాళికను రూపొందించింది. మొత్తం 1.80 లక్షల ఎకరాల విస్తీర్ణంలో రూపుదిద్దుకోనున్న ఈ నగరం మాస్టర్ ప్లాన్‌ను త్వరలో జరిగే తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌లో ఆవిష్కరించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. 9 లో

ఎవరికి ఏ పదవి? కాంగ్రెస్‌లో ఉత్కంఠ!



(హైదరాబాద్, సాక్షర): తెలంగాణలో అధికార పగ్గాలు చేపట్టి డిసెంబర్ 7 నాటికి మూడేళ్లు పూర్తి చేసుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి కార్పొరేషన్లు, కమిషన్లు, గవర్నర్ కోటా ఎమ్మెల్సీ పదవుల భర్తీ ఒక కత్తిమీద సాములా మారింది. అధికారం చేపట్టిన కొత్తలో పదవులు ఆశించి నిరాశ చెందిన ద్వితీయ శ్రేణి నాయకత్వం, పార్టీ కోసం ఏళ్ల తరబడి పనిచేసిన కేడర్ నుంచి ఒత్తిడి తీవ్రమవుతున్న వేళ.. నిర్ణయాలు మాత్రం నిరవధికంగా వాయిదా పడుతున్నాయి. ఒకవైపు పార్టీ సంస్థాగత బలోపేతం, మరోవైపు భవిష్యత్ ఎన్నికల ముఖచిత్రం.. 9 లో

దేశాన్నే ఆకట్టుకుంటున్న సదర్..



(హైదరాబాద్, సాక్షర): నారాయణగూడ సర్కిల్ లో యాదవ సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సదర్ వేడుకలకు మాజీమంత్రి, బిఆర్ఎస్ పార్టీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తలసాని శ్రీనివాస్ యాదవ్ హాజరయ్యారు. తలసాని మాట్లాడుతూ దీపావళి పర్వదినం తర్వాత సదర్ ను ఘనంగా నిర్వహించుకోవడం ఆనవాయితీగా వస్తుంది. నీతి నిజాయితీ లకు పేరుగాంచిన యాదవులు 364 రోజుల పాటు తమ పాడి వృత్తి లో ఉంటూ సంవత్సరంలో ఒకరోజు సదర్ జరుపుకుంటారు. 2 లో

'సర్' పేరుతో మోదీ సర్కార్ ఓట్లను తొలగిస్తోంది:సీఎం రేవంత్‌రెడ్డి



(హైదరాబాద్, సాక్షర): ప్రధానమంత్రి నరేంద్రమోదీ సర్కారుపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మైనారిటీలకు 4% రిజర్వేషన్ తొలగించాలంటున్న బీజేపీ నేతలు.. గుజరాత్‌లో ఎందుకు తొలగించడం లేదు? అని ప్రశ్నించారు. పూర్తిగా 3 లో

గాంధీ కుటుంబంలో మరణాలు యాదృచ్ఛికం కాదు



బీజేపీ ఎంపీ, ప్రముఖ నటి కంగనా రనౌత్.. కాంగ్రెస్ అగ్ర నాయకురాలు సోనియా గాంధీపై సంచలన ఆరోపణలతో విరుచుకుపడ్డారు. సోనియా గాంధీ రాక తర్వాతే గాంధీ కుటుంబంలో వారసులంతా ఒక్కొక్కరిగా మరణించారని, ఇవన్నీ కేవలం యాదృచ్ఛిక సంఘటనలు కావని ఆమె అనుమానం వ్యక్తం చేశారు. సోనియా గాంధీని 'అంతుచిక్కని విదేశీ వ్యక్తి' (మిస్టీరియస్ ఫారినర్) అని సంబోధిస్తూ మంగళవారం తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో తీవ్ర వ్యాఖ్యలు చేశారు. పూర్తిగా 2 లో

కాంగ్రెస్‌కు పరీక్షగా ఉద్యోగుల అసంతృప్తి!



(హైదరాబాద్, సాక్షర): తెలంగాణలో రెండో వేతన సవరణ సంఘంనివేదిక అమలు ఆలస్యం అధికార కాంగ్రెస్ పార్టీకి రాజకీయంగా మరో సవాల్‌గా మారుతోంది. ఇప్పటికే పీఆర్సీ కోసం ఎదురుచూస్తున్న ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు.. ప్రభుత్వ తీరుపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రభావం రాబోయే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలపై పడే అవకాశాలున్నాయనే చర్చ రాజకీయ వర్గాల్లో మొదలైంది. తెలంగాణలో రెండో పీఆర్సీ ప్రక్రియ ప్రారంభమై మూడేళ్లు దాటుతున్నా.. ఇప్పటివరకు నివేదికపై స్పష్టత రాకపోవడం ఉద్యోగుల్లో ఆందోళనకు కారణమవుతోంది. 2023 అక్టోబర్‌లో రెండో పీఆర్సీని ఏర్పాటు చేయగా.. ఆరు నెలల్లో సిఫార్సులు అందించాల్సి ఉంది. అయితే గడువు దాటినా నివేదిక పెండింగ్‌లోనే ఉండటంతో ఉద్యోగ సంఘాలు పలుమార్లు ప్రభుత్వాన్ని ప్రశ్నించాయి.ఈ ఏడాది మే 2న ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో సమావేశమైన సీఎం రేవంత్ రెడ్డి.. పీఆర్సీ నివేదికను త్వరగా అందించాలని అధికారుల కమిటీని ఆదేశించినట్లు ప్రకటించారు. నివేదిక ఆధారంగా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు. పూర్తిగా 9 లో


త్వరలో మూసీ రివర్ ఫ్రంట్ పనులు ప్రారంభం ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి



(హైదరాబాద్, సాక్షర): మూసీ రివర్ ఫ్రంట్ పనులు త్వరలోనే ప్రారంభం కాబోతున్నాయని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి వెల్లడించారు. మూసీ రివర్ ఫ్రంట్ పరిసరాల్లో నైట్ ఎకానమీని అభివృద్ధి చేయడం ద్వారా స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని చెప్పారు. పూర్తిగా 9 లో

సంపాదకీయం

విశ్వాసం, గౌరవమే వివాహ వ్యవస్థకు మూలం



ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో సంచలనం సృష్టించి ఉప ముఖ్యమంత్రి అయిన పవన్ కళ్యాణ్, ఇప్పుడు తన మూడవ భార్యకు విడాకులు ఇచ్చి దూరంగా ఉంటున్నారు. దీంతో రెండు తెలుగు రాష్ట్రాల్లో పవన్ కళ్యాణ్ విడాకుల గురించే మాట్లాడుకుంటున్నారు. సోషల్ మీడియా, టీవీ చానళ్లు, వెబ& సైట్లు ఒకటేంటి అన్నీ చోట్ల ఏపీ డిప్యూటీ సీఎం ముచ్చటగా మూడో పెళ్లిని కూడా రద్దు చేసుకోవడం ఏంటని ఆశ్చర్యపోతున్నారు.2026 నవంబర్ 9 రాత్రి పవన్ కళ్యాణ్, అనా లెజ్‌నెవా విడిపోతున్నట్టు ప్రకటించారు. అభిమానులకు ఈ ప్రకటన షాకిచ్చింది. సనాతన ధర్మం గురించి మాట్లాడే పవన్ కళ్యాణ్ ఇలాంటి నిర్ణయం ఎందుకు తీసుకున్నారంటూ సోషల్ మీడియాలో చర్చ జరుగుతోంది. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ తన ప్రసంగాల్లో సనాతన ధర్మ పరిరక్షణ గురించి ప్రస్తావిస్తుంటారు. అయితే సనాతన ధర్మం గురించి మాట్లాడే వ్యక్తులు తమ వ్యక్తిగత జీవితంలో ధర్మవిలువలు పాటిస్తున్నారా? పవన్ కళ్యాణ్ మమూడు పెళ్లిళ్లు.. మూడో భార్యతో విడాకుల వ్యవహారంతో మరోసారి చర్చనీయాంశమైంది.1997లో నందినిని వివాహం చేసుకున్న పవన్ కళ్యాణ్ 2008లో విడాకులు తీసుకున్నారునటి రేణుదేశాయ్ లో సహజీవనం చేసి 2009లో పెళ్లిచేసుకున్నారు..వీరికి ఇద్దరు పిల్లలు.. 2012లో విడిపోయారు.రష్యాకు చెందిన అనా లెజ్‌నెవాని 2013లో వివాహం చేసుకున్నారు..వీరికి ఇద్దరు పిల్లలున్నారు..లేటెస్ట్ గా పరస్పర అంగీకారంతో విడిపోతున్నట్టు ప్రకటించారుతమ వైవాహిక బంధం ముగిసినప్పటికీ పిల్లల బాధ్యతలు కలసి నిర్వహిస్తామని తెలిపారు. సనాతన ధర్మం అంటే శాశ్వతమైన ధర్మం లేదా ఎప్పటికీ నిలిచే జీవన విలువలు అని అర్థం. ఇది కేవలం మతపరమైన నినాదం కాదు.. సత్యం, ధర్మం, అహింస, దయ, కరుణ, ఇంద్రియ నిగ్రహం, పరులకు హాని చేయకపోవడం లాంటి విలువలకు సనాతన ధర్మంలో ప్రాధాన్యత ఉంది. ధర్మం అంటే కేవలం పూజ చేయడం, దేవాలయాలు సందర్శించడం, ఆచారాలు పాటించడం మాత్రమే కాదు.. మనిషి తన బాధ్యతలు నిజాయితీగా నిర్వహించడం, ఇతరుల హక్కులు గౌరవించడం, కుటుంబాన్ని బాధ్యతతో నడిపించడం కూడా ధర్మంలో భాగమే. హిందూ సంప్రదాయంలో వివాహాన్ని పవిత్రమైన సంస్కారంగా భావిస్తారు. ప్రాణి భూమ్మీద పడినప్పటి నుంచి మరణించే వరకూ ముఖ్యమైన 16 సంస్కారాలు అనుసరిస్తారు. వాటిలో వివాహం కూడా ఒకటి. అగ్నిసాక్షిగా పెళ్లి చేసుకుని ఆఖరిక్షణం వరకూ ఆమెతోనే కలసి బతకాలన్నది శాస్త్రవచనం. పవన్ కళ్యాణ్ మొదటి భార్య నందిని. వారిద్దరూ ప్రేమించుకుని పెళ్లి చేసుకున్నారు. అయితే, పవన్, నందినిల మధ్య ప్రేమ ఎక్కువ కాలం నిలవలేదు. నందిని కూడా విశాఖపట్నంలోని ఒక సంపన్న కుటుంబానికి చెందినది. మొదటి భార్యకు విడాకులు ఇవ్వకుండానే రెండో పెళ్లి చేసుకున్నాడని ఆమె ఆరోపించింది. విశాఖపట్నం కుటుంబ న్యాయస్థానానికి వాంగ్మూలం ఇచ్చిన పవన్ కళ్యాణ్, తాను రేణు దేశాయ్‌ను వివాహం చేసుకోలేదని చెప్పారు. ఆ తర్వాత, పవన్ కళ్యాణ్ విడాకుల కోసం దరఖాస్తు చేసుకోగా, 2008లో నందినికి రూ. 5 కోట్ల భరణం చెల్లించి విడాకులు పొందారు.తన మొదటి భార్యతో విడిపోయి, 2012లో, ఈ జంట విడాకులు తీసుకుని విడిపోయారు.అయితే పవన్ కళ్యాణ్ నుండి రేణు దేశాయ్ కోట్ల రూపాయల భరణం అందుకోలేదని సమాచారం. దానికి బదులుగా, పవన్ కళ్యాణ్ ప్రతి నెలా వారి ఇద్దరు పిల్లల పోషణ ఖర్చులను చెల్లిస్తున్నట్లు తెలుస్తోంది. రేణు దేశాయ్ తన పేరు మీద కొన్ని ఆస్తులను రిజిస్టర్ చేయించుకున్నట్లు కూడా సినీ వర్గాల్లో ఇన్ సైడ్ టాక్.తన రెండవ భార్య రేణు దేశాయ్‌తో విడాకులు తీసుకునే ముందు, పవన్ కళ్యాణ్ 2010లో ఃటీన్ మార్ఃఃసినిమా షూటింగ్ కోసం రష్యా వెళ్లారు. అక్కడ ఆయన మోడల్ అన్నా లెజ్నోవాను కలిశారు. 2012లో రేణు దేశాయ్‌కు విడాకులు ఇచ్చిన పవన్ కళ్యాణ్, 2013 ప్రత్యేక వివాహ చట్టం కింద అన్నా లేజనోవాను వివాహం చేసుకున్నారు. ఇప్పుడు ఆయన మూడవ వివాహం కూడా విడాకుల బాట పట్టింది. అన్నాతో పవన్ కళ్యాణ్ 13 ఏళ్ల వైవాహిక జీవితానికి తెరదించారు.కొందరు మాత్రం పవన్ కళ్యాణ్ విడాకులు తీసుకోవడానికి ఓ బలైమన కారణం ఉందంటూ పోస్ట్‌లు పెడుతున్నారు. అందులో మరీ ముఖ్యంగా తన రాజకీయపాలన కోసమే ఈ పని చేసినట్లు పలువురు అభిప్రాయపడుతున్నారు. ప్రజలకు సేవ చేయాలన్న ఒకే ఒక్క కారణంతో తన కుటుంబానికి దూరంగా ఉండాలనుకున్నాడని.. అందుకోసమే విడాకులు తీసుకున్నాడని పెద్ద ఎత్తున పోస్ట్‌లు పెడుతున్నారు. నిజంగానే ఈ కారణంతోనే విడాకులు తీసుకున్నాడా? లేదంటే ఇద్దరి మధ్య విభేదాలు ఉన్నాయా? అనేది క్లారిటీ లేదు.ఇందులో నిజమెంతుందో పక్కన పెడితే ఈ టైమ్‌లో పవన్ కళ్యాణ్ విడాకులు తీసుకోవడం తన పొలిటికల్ కెరీర్‌కు మరో మచ్చలా మిగిలిపోతుందా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. అయితే చాలా మంది మాత్రం అది వాళ్ల పర్సనల్ లైఫ్.. విడాకులు తీసుకుంటారో, కలిసుంటారో అన్నది వాళ్ల ఛాయిస్. వాళ్ల డెసిషన్‌కు రెస్పెక్ట్ ఇవ్వాలి కానీ... ఇంకా బురద జల్లే ప్రయత్నాలు చేయడం సరికాదు అంటూ పోస్ట్‌లు పెడుతున్నారు.భార్యాభర్తలు పరస్పర విశ్వాసం, గౌరవం, బాధ్యతతో జీవించాలని వివిధ ధర్మశాస్త్రాలు, సంప్రదాయాలు బోధిస్తాయి. వివాహం విఫలం అయితే జీవితాంతం బాధను భరించాలనే నియమమం సనాతన ధర్మంలో ఉందని చెప్పలేం. పెళ్లి, విడాకులు, పునర్వివాహాల విషయంలో హిందూ సంప్రదాయాల్లో భిన్నమైన అభిప్రాయాలు, ఆచారాలు ఉన్నాయి. ఆధునిక భారతీయ చట్టం కూడా విడాకులు, పునర్వివాహాలకు అవకాశం కల్పిస్తోంది. ఓ వ్యక్తి ఎన్ని వివాహాలు చేసుకున్నారనే సంఖ్య ఆధారంగా మాత్రమే వారి ధార్మికతను నిర్ణయించడం సరైన పద్ధతి కాదు. అదే సమయంలో ప్రతి వివాహంలోనూ భాగస్వామ్య గౌరవం, పిల్లల సంక్షేమం, కుటుంబ బాధ్యతలను ప్రాధాన్యత ఇవ్వడం అవసరం.ఆధ్యాత్మిక దృక్పథంలో చూస్తే వ్యక్తిగత జీవితంపై తీర్పు చెప్పడం కన్నా ఆ వ్యక్తి ప్రవర్తనలో ధర్మ విలువలు ఎంతవరకు ప్రతిబింబిస్తున్నాయో పరిశీలించడం ముఖ్యం. వివాహ బంధం కొనసాగపోవడానికి ఎన్నో వ్యక్తిగత కారణాలు ఉండొచ్చు. పూర్తి కారణాలు తెలియకుండా తప్పొప్పులు చెప్పడం సముచితం కాదంటారు ఆధ్యాత్మికవేత్తలు. సనాతన ధర్మం గురించి ప్రజలకు సందేశాలు ఇచ్చేనాయకులు తమ జీవితాల్లో సత్యం, నిబద్ధత, బాధ్యత, పరస్పర గౌరవం వంటి విలువలకు ప్రాధాన్యత ఇవ్వాలని అంతా ఆశించడం సహజం. సనాతన ధర్మం అంటే ఇతరులకు చెప్పేందుకు ఉపయోగించే నినాదం కాదు..అది మనిషి తన జీవితంలో ఆచరించాల్సిన విలువల సమాహారం. రాజకీయ నాయకుడు అయినా, ఆధ్యాత్మికవేత్త అయినా, సామాన్యుడు అయినా ధర్మం ముందు బాధ్యత ఒక్కటే. ధర్మం మాటల్లో కనిపించడం కన్నా చేతల్లో చూపించినప్పుడే సందేశం విలువ పెరుగుతుంది..

మొదటి పేజీ తరువాయి కృష్ణా జలాల పంపిణీలో వాటా

రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు
ఆంధ్రప్రదేశ్‌తో వివాదం ఉన్న అన్ని అంశాలపై అవసరమైన ఆధారాలను సమర్పించాలని సూచించారు. ఈ నెల 18 తర్వాత సుప్రీంకోర్టులో కేసు విచారణకు రానున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి న్యాయ నిపుణులతో చర్చించారు. ముఖ్యమంత్రి ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీ బోధి పెవిలియన్‌లో నీటిపారుదల శాఖపై సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తో పాటు సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది సీఎస్ వైద్యనాథన్, అడ్వకేట్ జనరల్ సుదర్శన్ రెడ్డి, నీటిపారుదల సలహాదారు, నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. డిండి, అచ్చంపేట ఎత్తిపోతల పథకాల పనులను వేగవంతం చేయాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ఇంజనీర్లను ఆదేశించారు. ఇప్పటికే నిర్ణయించిన ప్రకారం ఏదుల నుంచి డిండి, అచ్చంపేట పథకాలకు నీటిని అందించాలని స్పష్టం చేశారు. ఈ రెండు పథకాలకు అవసరమైన 0.6 టీఎంసీల నీటిని నార్లపూర్ నుంచి ఏదుల వరకు తరలించేందుకు ఎలాంటి ఆటంకాలు లేకుండా చూడాలని సూచించారు. ఎక్కడ టన్నెల్, ఎక్కడ కాలువ అవసరమో గుర్తించి సమగ్ర ప్రాజెక్టు నివేదిక సిద్ధం చేయాలని, అందుకు అనుగుణంగా పనులు ప్రారంభించాలని ఆదేశించారు. కాళేశ్వరం అదనపు టీఎంసీ పనుల విషయంలో తొందరపాటు నిర్ణయాలు తీసుకోవద్దని ముఖ్యమంత్రి అధికారులను హెచ్చరించారు. గత ప్రభుత్వం చేసిన తప్పులు పునరావృతం కాకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ప్రస్తుతం ఉన్న రెండు టీఎంసీల నీటినే తరలించలేని పరిస్థితి ఉన్నందున అదనపు టీఎంసీ పనుల విషయంలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. ముందుగా సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసుల పురోగతిని పరిశీలించి, భూసేకరణ చేపట్టాలని ఆదేశించారు. కేంద్ర జల సంఘం నుంచి అవసరమైన అన్ని అనుమతులు పొందడంతో పాటు సమగ్ర ప్రాజెక్టు నివేదిక డీపీఆర్ సిద్ధం చేసుకోవాలని అధికారులకు సూచించారు.

మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ హౌజ్ అరెస్టు



(వరంగల్, సాక్షర): ప్రభుత్వ మాజీ చీఫ్ విప్ మాజీ శాసనసభ్యులు దాస్యం వినయ్ భాస్కర్ ను పోలీసులు హౌజ్ అరెస్ట్ చేసారు. అయనను వడ్డేపల్లి ఇంటి వద్ద అరెస్టు చేసారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గ వ్యాప్తంగా బీఆర్ ఎస్ నేతల అరెస్ట్ లు కొనసాగాయి. కుడా మాజీ చైర్మన్ మర్రి యాదవ రెడ్డి కాజిపేట్ డివిజన్లకు చెందిన బీఆర్ఎస్ నాయకులు హసన్ పర్తి పోలీస్ స్టేషన్ లో ఉన్నారు. వారిని పరామర్శించేందుకు వెళ్లిన మాజీ కార్పొరేటర్ దాస్యం విజయ్ భాస్కర్ సైతం అరెస్ట్ చేసారు. మాజీ కార్పొరేటర్ సోదా కిరణ్, పశ్చిమ నియోజకవర్గ కో ఆర్డినేటర్ పులి రజినీకాంత్ బీఆర్ఎస్వీ ప్రెసిడెంట్ బైరపాక ప్రశాంత్ హనుమకొండ పోలీసు స్టేషన్ లో వుంచారు.

మొదటి పేజీ తరువాయి అంతరిక్షంలో చైనా అద్భుతం..

7 పికోకెల్విన్ల ఉష్ణోగ్రతను నమోదు చేసినట్లు వారు ప్రకటించారు. ఈ ఫలితాల వివరాలను ప్రతిష్ఠాత్మక 'సైన్స్' జర్నల్‌లో ప్రచురించారు. పెకింగ్ యూనివర్సిటీ, చైనీస్ అకాడమీ ఆఫ్ సైన్సెస్‌కు చెందిన శాస్త్రవేత్తల బృందం ఈ అసాధారణ ప్రయోగాన్ని నిర్వహించింది. ఇందుకోసం వారు సుమారు 20,000 రుబీడియం-87 అణువులతో కూడిన బోస్-ఐన్‌స్టీన్ కండెన్‌సేట్‌ను ఉపయోగించారు. అంతరిక్ష కేంద్రంలోని మైక్రోగ్రావిటీ (సూక్ష్మ గురుత్వాకర్షణ) వాతావరణంలో ఈ అణువులను లేజర్ ట్రాప్‌లు, ఇతర శీతలీకరణ పద్ధతుల ద్వారా అత్యంత చల్లగా మార్చారు. అనంతరం ఆ అణువుల సమూహాన్ని ఏడు సెకన్ల పాటు పరిశీలించి, దాని విస్తరణ వేగాన్ని బట్టి ఉష్ణోగ్రతను లెక్కించారు. ఈ ఉష్ణోగ్రత 9.7 పికోకెల్విన్లు (0.0000000000097 కెల్విన్లు)గా తేలింది. ఈ ఉష్ణోగ్రత ఎంత తక్కువంటే, విశ్వం సగటు ఉష్ణోగ్రత అయిన 2.7 కెల్విన్లతో పోలిస్తే ఇది దాదాపు 280 బిలియన్ రెట్లు చల్లనిది. ఇంతకుముందు 2021లో జర్మనీలో ఫ్రీ-ఫాల్ ప్రయోగంలో 38 పికోకెల్విన్ల ఉష్ణోగ్రతను నమోదు చేయగా, ఇప్పుడు డ్రాగన్ కంట్రీ ఆ రికార్డును బద్దలుకొట్టింది. భూమిపై గురుత్వాకర్షణ కారణంగా ఇలాంటి ప్రయోగాలు చేయడం చాలా కష్టం. అణువులు వేగంగా కిందకు పడిపోవడంతో వాటిని ఎక్కువసేపు పరిశీలించడం సాధ్యం కాదు. కానీ, అంతరిక్షంలోని మైక్రోగ్రావిటీ వాతావరణం ఈ సమస్యను అధిగమించేందుకు వీలు కల్పించింది. అతి శీతల పదార్థాలను నియంత్రించడంలో తాము సాధించిన పురోగతికి ఈ ప్రయోగం నిదర్శనమని శాస్త్రవేత్తలు తెలిపారు. ఈ విజయం భవిష్యత్తులో మరింత కచ్చితమైన క్వాంటం సెన్సార్ల తయారీకి, అంతరిక్షంలో ప్రాథమిక భౌతిక శాస్త్ర అధ్యయనాలకు మార్గం సుగమం చేస్తుందని పరిశోధకులు భావిస్తున్నారు.

మొదటి పేజీ తరువాయి దేశాన్నే ఆకట్టుకుంటున్న సదర్..

అన్ని వర్గాల ప్రజలు ప్రతి సంవత్సరం ప్రదర్శించడం సదర్ ప్రత్యేకత. యాదవులు నిర్వహించే సదర్ ను ఎంతో ఆదరిస్తున్నారు. లేనిదే చరిత్ర లేదని రామాయణం, హర్యానా, ఉత్తరప్రదేశ్, బీహార్ రాష్ట్రాల మహాభారతం చెబుతున్నాయని అన్నారు. నుండి దున్నపోతులను తీసుకొచ్చి

పెట్టుబడులు, పరిశ్రమల విస్తరణకు ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుంది:మంత్రి పొన్నం ప్రభాకర్



(హైదరాబాద్, సాక్షర): ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రాన్ని 2047 నాటికి అభివృద్ధి చెందిన రాష్ట్రంగా తీర్చిదిద్దడంతో పాటు, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను 2034 నాటికి ఒక ట్రిలియన్ డాలర్లకు, 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్లకు చేర్చాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని రాష్ట్ర రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్-2026లో భాగంగా ఆటోమొబైల్, ఆటో కాంపోనెంట్స్, ఎలక్ట్రిక్ వెహికల్స్ ఇవి రంగాలకు సంబంధించి సచివాలయంలో నిర్వహించిన తొలి ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సమావేశానికి మంత్రి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ. డిసెంబర్ 7 నుంచి 9 వరకు హైదరాబాద్‌లోని భారత్ ఫ్యూచర్ సిటీలో జరగనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్-2026లో ఆటోమొబైల్, ఈవీ రంగాలకు చెందిన ప్రముఖ కంపెనీలు, పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులు పెద్ద ఎత్తున భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. తెలంగాణలో ఆటోమొబైల్ తయారీ, ఆటో కాంపోనెంట్స్, ఎలక్ట్రిక్ మొబిలిటీ, బ్యాటరీ టెక్నాలజీ, ఈవీ ఛార్జింగ్ మౌలిక సదుపాయాల రంగాల్లో భారీ పెట్టుబడులకు అనుకూలమైన వాతావరణం ఉందన్నారు. రాష్ట్రంలో ఇప్పటికే పెట్టుబడులు పెట్టిన సంస్థలు తమ పరిశ్రమలను మరింత విస్తరించడంతో పాటు, కొత్త పెట్టుబడులకు ముందుకు రావాలని కోరారు. ఈవీ పాలసీతో కాలుష్య రహిత తెలంగాణకు అడుగులు.. తెలంగాణను కాలుష్య రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో రెండేళ్ల క్రితమే దేశంలో ప్రత్యేకమైన ఎలక్ట్రిక్ వాహనాల పాలసీని తీసుకొచ్చామని మంత్రి తెలిపారు. ఈవీ వాహనాల కొనుగోళ్లను ప్రోత్సహించేందుకు 100 శాతం రోడ్ ట్యాక్స్, రిజిస్ట్రేషన్ ఫీజు మినహాయింపులు కల్పించామని పేర్కొన్నారు. ఈ ప్రోత్సాహకాల ఫలితంగా గత రెండేళ్ల కాలంలో రాష్ట్రంలో 2,17,690 ఎలక్ట్రిక్ వాహనాలు అమ్ముడయ్యాయని, తద్వారా సుమారు రూ.2,343 కోట్ల మేర పన్ను మినహాయింపులు కల్పించామని వెల్లడించారు. ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం పెరగడం ద్వారా కాలుష్య నియంత్రణతో పాటు పర్యావరణ పరిరక్షణకు దోహదపడుతుందని తెలిపారు.

31వ సీఐఐ భాగస్వామ్య సదస్సుకు సర్వాంగ సుందరంగా ముస్తాబైన విశాఖ నగరం



(విశాఖపట్నం, సాక్షర): 31వ సీఐఐ భాగస్వామ్య సదస్సుకు విశాఖ నగరం సర్వాంగ సుందరంగా ముస్తాబయింది. ఆంధ్రా యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాల గ్రౌండ్స్ లో 12,13 తేదీల్లో సీఐఐ భాగస్వామ్య సదస్సు జరగనుంది. ఏపీ సంస్కృతి సంప్రదాయాలు ఉట్టిపడేలా విదేశీ అతిథులకు స్వాగతం పలికేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. గిరిజన థింసా డాన్స్, గరగ నృత్యం, తప్పెట గుళ్ళు తదితర సంప్రదాయాలను తెలియచేసేలా ఏర్పాటు చేసారు. ఏటి కొప్పాక, కొండపల్లి బొమ్మలు, తోలుబొమ్మలాట కూచిపూడి లాంటి



సాంప్రదాయ కళల్ని ప్రదర్శించేలా అలంకరణలు చేసారు. ఏపీ తీర ప్రాంతం, ఏపీ ఆతిథ్యం, రుచులు, అమరావతి వైభవం, నూతన రాజధాని, కడియం నర్సరీ లాంటి ప్రత్యేకతలను ప్రదర్శించేలా కళాకృతులు తీర్చిదిద్దారు. రాష్ట్రంలో వనరులు, పెట్టుబడి అవకాశాలను పారిశ్రామిక వేత్తలకు తెలియ చెప్పేలా వ్యవసాయం, ఉద్యాన పంటలు, అరకు కాఫీ, టూరిజం, లాజిస్టిక్స్, సోలార్ తదితర అంశాలను చాటి చెప్పేలా స్టాళ్లు, కళాకృతులు రూపొందించారు. ప్రధాన ప్లీనరీ హాల్ తో పాటు పారిశ్రామిక వేత్తలు చర్చలు జరిపేలా వివిధ సమావేశ ప్రాంగణాలను ప్రభుత్వం సిద్ధం చేసింది. దిగ్గజ కంపెనీల చైర్మన్లు,



సీఈఓలు ముఖ్యమంత్రి చంద్రబాబుతో సమావేశం అయ్యి చర్చలు జరిపేందుకు వీలుగా మరో ప్రత్యేక హాల్ సిద్ధం అయ్యాయి. బిజినెస్ టూ బిజినెస్, గవర్నమెంట్ టు బిజినెస్ చర్చల కోసం ప్రత్యేక ఏర్పాట్లు పూర్తయ్యాయి. భాగస్వామ్యాలు, ఒప్పందాలు కుదుర్చుకునేందుకు వేర్వేరుగా ఏర్పాట్లు చరేసారు. ఒకేసారి రెండు, మూడు కార్యక్రమాలు నిర్వహించుకునేలా సమావేశ మందిరాలు అందుబాటులో వున్నాయి. ఈ సమావేశ మందిరాల్లో ప్రారంభ, ముగింపు కార్యక్రమాలతో పాటు ఆరు కీలకమైన అంశాలపై మేధో మధనం జరగనుంది.

మొదటి పేజీ తరువాయి 'సర్' పేరుతో మోదీ సర్కార్ ఓట్లను తొలగిస్తోంది:సీఎం రేవంత్‌రెడ్డి

మైనారిటీలకు ఓటు హక్కును దూరం చేయాలని బీజేపీ ప్రభుత్వం కుట్ర చేస్తోందని తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. హైదరాబాద్ బంజారాభవన్‌లో జాతీయ విద్యా దినోత్సవాన్ని ఈరోజు (బుధవారం) నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొని, ప్రసంగించారు. సర్ (ప్రత్యేక ఓటర్ల సమగ్ర సవరణ) పేరుతో మైనారిటీలు, దళితులు, పేదల ఓట్లను తొలగిస్తున్నారని ఆగ్రహించారు. స్కాలర్‌షిప్‌లపై కూడా బీజేపీ రాజకీయం..: మైనారిటీ విద్యార్థుల స్కాలర్‌షిప్‌లపై కూడా బీజేపీ రాజకీయం చేస్తోందని సీఎం రేవంత్‌రెడ్డి దుయ్యబట్టారు. మోదీని గద్దె దించడమే కాంగ్రెస్ లక్ష్యమని పునరుద్ఘాటించారు. కాంగ్రెస్, బీజేపీ నేతలు ఒక్కటేనని బీఆర్ఎస్ నేతలు విమర్శిస్తున్నారని.. మోదీ కాళ్లపై పడింది ఎవరో అందరికీ తెలుసునని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యావ్యవస్థను మౌలానా అబుల్ కలాం ఆజాద్ బలోపేతం చేశారని వ్యాఖ్యానించారు. దేశంలో వర్సిటీలతో పాటు ఐఐటీలను స్థాపించారని ప్రస్తావించారు. ఆనాటి పునాదుల వల్లే ప్రపంచవ్యాప్తంగా భారతీయులు రాణిస్తున్నారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో విద్యావ్యవస్థకు పెద్దపీట..: కాంగ్రెస్ ప్రభుత్వంలో విద్యావ్యవస్థకు పెద్దపీట వేస్తున్నామని ముఖ్యమంత్రి ఉద్ఘాటించారు. మైనారిటీలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా కల్పించారు. యువతలో స్కిల్స్ పెంచేందుకు ఐటీఐలను ఏటీసీలుగా మార్చామని గుర్తుచేశారు. మైనారిటీల్లో చాలామంది స్కిల్డ్ యువత ఉన్నారని చెప్పుకొచ్చారు. యువత కోసమే స్కిల్ యూనివర్సిటీని తీసుకువచ్చామని వెల్లడించారు. మైనారిటీలకు విద్యా, ఉద్యోగాల్లో కాంగ్రెస్ 4% రిజర్వేషన్ కల్పించిందని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు

నత్తనడకన టిమ్స్ ఆసుపత్రుల పనులు

(హైదరాబాద్, సాక్షర): రేవంత్ రెడ్డికి మెడికవర్ ఆసుపత్రులపై ఉన్న శ్రద్ధ ప్రభుత్వ ఆసుపత్రులపై ఎందుకు లేదని బీఆర్ఎస్ నేత క్రిశాంక్ ప్రశ్నించారు. రెండు సంవత్సరాల్లో హెలికాప్టర్ వేసుకొని వెళ్లి 3 మెడికవర్ ఆసుపత్రులను ప్రారంభించాడు. కానీ అదే 23 నెలల్లో అల్వాల్ టిమ్స్ ఆసుపత్రి పనులు కేవలం 5 శాతం మాత్రమే చేశారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి 2025 జనవరి నెలలో అల్వాల్ టిమ్స్ ఆసుపత్రిని సందర్శించి, 90% పనులు పూర్తయ్యాయని, 2025 ఆగస్టు 31వ తేదీలోపు పనులు పూర్తి చేస్తామని తెలిపాడు. మంగళవారం నాడు మంత్రి దామోదర రాజనర్సింహ సందర్శించి, 95% పనులు పూర్తయ్యాయని, త్వరలో ఆసుపత్రిని ప్రారంభిస్తామని చెప్పాడు. అంటే జనవరి 2025 నుంచి నిన్నటి వరకు అల్వాల్ టిమ్స్ ఆసుపత్రి పనులు కేవలం 5% మాత్రమే జరిగాయని మంత్రులు స్పష్టం చేశారని అయన అన్నారు. వంత్ రెడ్డి కుటుంబ సభ్యుల వ్యాపార భాగస్వామ్యాలు ఉన్నందునే కార్పొరేట్ హాస్పిటళ్లపై ప్రత్యేక శ్రద్ధ చూపిస్తూ, పేదల టిమ్స్ ఆసుపత్రులను గాలికొదిలేశారని ఆరోపించారు వరంగల్, సనత్‌నగర్ ఆసుపత్రుల్లాగే అల్వాల్‌లోనూ పూర్తి సేవలు అందించకుండా ఎన్నికల ప్రయోజనాల కోసం అరకొరగా రిబ్బన్ కటింగ్ చేసి చేతులు దులుపుకునే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు.రాజకీయ కక్షలు పక్కనపెట్టి, ఫోటో షూట్లు ఆపి 1000 పడకల అల్వాల్ టిమ్స్ ఆసుపత్రిని తక్షణమే పూర్తిస్థాయిలో ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు.

మేడ్చల్‌లో ఏడుగుళ్ల దేవాలయం తొలగింపుపై నిరసన...

- జాతీయ రహదారి విస్తరణలో భాగంగా ఏడుగుళ్ల దేవాలయం తొలగింపునకు అధికారులు నోటీసులు..
- ఆలయ కమిటీ సభ్యులకు నిరసన

(మేడ్చల్, సాక్షర): పట్టణంలో ఎంతో ప్రాచుర్యం కలిగిన ఏడుగుళ్ల దేవాలయాన్ని జాతీయ రహదారి విస్తరణలో భాగంగా తొలగించేందుకు రహదారి నిర్వహణ అధికారులు సోమవారం నోటీసులు జారీచేయడంతో ఆలయ తొలగింపుపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ బుధవారం ఆలయ కమిటీ సభ్యులు, పట్టణ ప్రజలు దేవాలయం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. పట్టణ ప్రజల ఆధ్యాత్మిక విశ్వాసాలతో ముడిపడి ఉన్న ఆలయాన్ని తొలగించడంపై కమిటీ సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ 200 ఏళ్ల చరిత్ర కలిగిన ఆలయాన్ని తొలగిస్తే చూస్తూ ఊరుకోమని...ఎట్టి పరిస్థితుల్లోనూ ఆలయం ఇక్కడే ఉండాలని డిమాండ్ చేశారు

హైదరాబాద్‌లో మత్తు టాబ్లెట్ల దందా..

- 300 నైట్రో-విట్ టాబ్లెట్లు స్వాధీనం

(హైదరాబాద్, సాక్షర): మల్లేపల్లిలో ఈగల్ టీమ్, హెచ్-న్యూ సంయుక్తంగా దాడులు నిర్వహించాయి. హబీబ్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో తనిఖీలు చేసాయి. నిందితులు ఉప్పాడ ప్రసాద్, సమీరా బేగం నుంచి 300 నైట్రో-విట్ టాబ్లెట్లు స్వాధీనం చేసుకున్నారు. మరో ఆపరేషన్‌లో పల్లవి, సూర్యధరన్ అనే ఇద్దరి అదుపులోకి తీసుకున్నారు. కర్ణాటకలోని బీదర్ నుంచి టాబ్లెట్లు తీసుకొచ్చి విక్రయిస్తున్నట్లు ప్రాథమిక విచారణలో గుర్తించారు. స్థానిక యువతను లక్ష్యంగా చేసుకుని మత్తు టాబ్లెట్ల విక్రయాలు జరుగుతున్నాయిని గుర్తించారు. గంజాయి విక్రయాలు తగ్గడంతో ప్రత్యామ్నాయంగా మత్తు టాబ్లెట్ల దందా చేస్తున్నట్లు పోలీసుల అనుమానం. అక్రమ సరఫరా, విక్రయాలపై మరిన్ని దాడులు చేస్తామని అధికారులు హెచ్చరించారు.

సీఎం రేవంత్ రెడ్డి బర్త్‌డే ఫ్లెక్సీ దగ్ధం..

- మల్లారెడ్డిపల్లిలో రగిలిన వర్గ విభేదాలు
- గౌరారం పీఎస్ కు చేరిన లొల్లి

(గజ్వేల్, సాక్షర): గజ్వేల్ నియోజకవర్గ పరిధిలోని వర్గల్ మండలం మల్లారెడ్డిపల్లి గ్రామంలో కాంగ్రెస్ లో వర్గపోరు బయటపడింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జన్మదినం సందర్భంగా ఏర్పాటు చేసిన శుభాకాంక్షల ఫ్లెక్సీని అర్ధరాత్రి వేళ పెట్రోల్ పోసి తగలబెట్టిన ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. గ్రామంలో సీఎం రేవంత్ రెడ్డి పుట్టినరోజును పురస్కరించుకుని స్థానిక కాంగ్రెస్ శ్రేణులు ప్రధాన కూడలిలో ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. అయితే అర్ధరాత్రి సమయంలో మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి ముఖ్య అనుచరుడు, స్థానిక సర్పంచ్ భర్త దాసరి యాదగిరి ఈ ఫ్లెక్సీపై పెట్రోల్ పోసి నిప్పంటించారని కాంగ్రెస్ వర్గాలు ఆరోపిస్తున్నాయి. ఉదయం చూసేసరికి సీఎం ఫ్లెక్సీ పూర్తిగా దగ్ధమై ఉండటంతో గ్రామంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. రాష్ట్ర ముఖ్యమంత్రి ఫ్లెక్సీని స్వపక్షంలో ఉన్న మరో వర్గమే ఇలా తగలబెట్టడం స్థానిక రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. ఈ చర్యపై వర్గల్ మండల యూత్ కాంగ్రెస్ నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం చిత్రపటాన్ని అవమానించిన వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసారు. గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా పోలీసులు పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు.

ప్రతి ఒక్కరూ సోనియా గాంధీ రచించిన పుస్తకాన్ని చదవాలి

- టీపీసీసీ మహేష్ కుమార్ గౌడ్

(హైదరాబాద్, సాక్షర): సోనియా గాంధీ పుస్తకంలో ఎన్నో బాధాకరమైన వాస్తవాలు వున్నాయి. పుస్తకంలో తన జీవితంలోని అనుభవాలను సోనియా వెల్లడించారని టీపీసీసీ ఛీఫ్ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. సోనియా గాంధీ రచించిన 'బిలాంగింగ్: ఏ జర్నీ ఆఫ్ లవ్' పుస్తకం నిన్న మార్కెట్లోకి విడుదల సందర్భంగా అయన మీడియాతో మాట్లాడారు. విదేశాల్లో పుట్టినా భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను గౌరవించిన ఆదర్శ మహిళ సోనియా. దేశ రాజకీయాలను ఆకళింపు చేసుకుని పార్టీని నడిపిస్తున్న నాయకురాలు. 2004లో ప్రధాని పదవిని త్యజించిన ఘనత సోనియా గాంధీదేనని అన్నారు. మన్మోహన్ సింగ్‌ను ప్రధానిగా ఎంపిక చేసిన ఘనత సోనియాదే. త్యాగధనుల కుటుంబానికి కోడలిగా సోనియా గాంధీ ప్రస్థానం కొనసాగింది. ఇందిరా గాంధీ, సంజయ్ గాంధీ, రాజీవ్ గాంధీల మరణాలతో తీవ్ర మానసిక వేదన గురయిన సోనియా తన జీవితంలోని విషాదాలను పుస్తకంలో వివరించారని అన్నారు. సోనియా పుస్తకంపై రాజకీయ విమర్శలను పట్టించుకోవాల్సిన అవసరం లేదు. ప్రతి ఒక్కరూ సోనియా గాంధీ రచించిన పుస్తకాన్ని చదవాలని అన్నారు.

పట్టభద్రులను ఉద్యోగులుగా మార్చడమే లక్ష్యం..దుండ్ర కుమారస్వామి

(హైదరాబాద్, సాక్షర): మెహిదీపట్నంలోని గుడిమల్కాపూర్ కింగ్స్ ప్యాలెస్‌లో నిరుద్యోగులు, పట్టభద్రుల ఆత్మీయ సమ్మేళనం, జాబ్ మేళా–2026 నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జాతీయ బీసీ దళ్ అధ్యక్షుడు, బీసీ రిజర్వేషన్ల సాధన సమన్వయ జేఏసీ చైర్మన్ దుండ్ర కుమారస్వామి పాల్గొని యువత సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పట్టభద్రులను ఉద్యోగులుగా మార్చడమే తమ ప్రధాన లక్ష్యమని, నిరుద్యోగ సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, నియామకాల్లో పారదర్శకత పాటించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పలువురు పట్టభద్రులు హైదరాబాద్–రంగారెడ్డి–మహబూబ్‌నగర్ ఎమ్మెల్సీ నియోజకవర్గం నుంచి దుండ్ర కుమారస్వామి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేయాలని కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఆయన.. పట్టభద్రులు, నిరుద్యోగులు, ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యలను శాసనమండలిలో బలంగా వినిపిస్తానని హామీ ఇచ్చారు.

ఆ రెండు పార్టీలు సైలెంట్

(హైదరాబాద్, సాక్షర): ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వైవాహిక జీవిత పరిణామాలపై అటు అధికార భాగస్వామి తెలుగుదేశం పార్టీ, ఇటు ప్రధాన ప్రతిపక్షం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలు బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ తమ శ్రేణులకు కఠిన సంయమన మార్గదర్శకాలను జారీ చేశాయి. నాయకుల వ్యక్తిగత వ్యవహారాలను రాజకీయాల్లోకి లాగవద్దని, ఎలాంటి అనుచిత పోస్టులు పెట్టవద్దని ఆ రెండు పార్టీలు హెచ్చరించాయి. అయితే, క్షేత్రస్థాయిలో ప్రధాన పార్టీలు హుందాతనం ప్రదర్శిస్తుంటే.. జనసేన ముసుగులో ఉన్న కొందరు సోషల్ మీడియా ఔత్సాహికులు, అభిమానులు మాత్రం పరిస్థితిని అనవసరంగా రగిలిస్తూ వివాదాలను పెంచి పోషిస్తున్నారు.జనసేన పార్టీ సోషల్ మీడియా బలానికి, బలహీనతకు ప్రధాన కారణం అందులో అత్యధికులు సాధారణ సినీ అభిమానులే కావడం. వీరిలో చాలామందికి పార్టీ సంస్థాగత నియమావళి, రాజకీయ లక్ష్మణరేఖలపై ఎలాంటి స్పష్టమైన అవగాహన ఉండదు. అధికారిక పార్టీ గొడుగు కింద క్రమశిక్షణతో కాకుండా, వ్యక్తిగత ఖాతాల ద్వారా తాము పవన్ కల్యాణ్‌ను కాపాడుతున్నాం అనే భ్రమలో చేసే పోస్టులు చివరకు పార్టీకే తీవ్ర కీడు చేస్తున్నాయి. స్వయంగా పవన్ కల్యాణ్ పీఆర్వో అధికారికంగా విడాకుల ప్రెస్ నోట్‌ను విడుదల చేసినప్పటికీ.. ఆ విషయాన్ని సైతం టీడీపీ వర్గాలే మీడియాకు లీక్ చేశాయంటూ మిత్రపక్షంపై బురదజల్లే పోస్టులు పెట్టడం వీరి రాజకీయ అపరిపక్వతకు నిదర్శనం. మిత్రధర్మాన్ని విస్మరించి టీడీపీ శ్రేణులను బహిరంగంగా కించపరచడం, ప్రతి చిన్న అంశానికీ ప్రత్యర్థులతో పాటు మిత్రులనూ రెచ్చగొట్టడం వీరి ప్రధాన ధోరణిగా మారింది.ఈ గందరగోళంలో మరో ప్రమాదకరమైన కోణం కూడా దాగి ఉంది. జనసేన అభిమానుల రూపంలో చెలరేగిపోతున్న కొందరు ఖాతాదారులు వాస్తవానికి వైసీపీకి చెందిన కోవర్ట్స్ అన్న అనుమానాలు బలంగా వ్యక్తమవుతున్నాయి. టీడీపీ-జనసేన కూటమిని మానసికంగా, రాజకీయంగా చీల్చడమే లక్ష్యంగా పెట్టుకున్న కొందరు కేటుగాళ్లు.. తాము పవన్ భక్తులమని చెప్పుకుంటూ సోషల్ మీడియాలో టీడీపీ నాయకత్వంపై, చంద్రబాబుపై అత్యంత విషపూరిత ప్రచారం సాగిస్తున్నారు. పవన్ వ్యక్తిగత అంశాన్ని నెపంగా చూపి ఇరు పార్టీల కేడర్ మధ్య చిచ్చుపెట్టేందుకు ఇలాంటి ముసుగు ఖాతాలు శతవిధాలా ప్రయత్నిస్తున్నాయి. ఈ కుట్రను గ్రహించలేని అమాయక జనసేన అభిమానులు కూడా ఆ ఉచ్చులో పడి కూటమి సమన్వయాన్ని దెబ్బతీసేలా ప్రవర్తిస్తుండటం పార్టీ సీనియర్లను ఆందోళనకు గురిచేస్తోంది.జనసేన అధిష్ఠానం, పార్టీ అధికారిక డిజిటల్ వింగ్ తక్షణమే కళ్లు తెరిచి దిద్దుబాటు చర్యలు చేపట్టాల్సిన అనివార్యత ఏర్పడింది. అసలైన కార్యకర్తలు ఎవరు, విధ్వంసకర ఫ్యాన్స్ ఎవరు, ప్రత్యర్థి పార్టీల నుంచి చొరబడిన కోవర్టులు ఎవరన్నది వడపోసి కఠిన చర్యలు తీసుకోవాలి. అధికారిక వేదికల ద్వారా మిత్రపక్షాలపై తప్పుడు ఆరోపణలు చేసే ఖాతాలను బహిరంగంగా తిరస్కరించాలి. రాజకీయ పరిణతి లేకుండా సోషల్ మీడియాలో రెచ్చిపోతే అంతిమంగా నష్టపోయేది పవన్ కల్యాణ్ ఇమేజ్, కూటమి స్థిరత్వమేనన్న నిజాన్ని అభిమానులకు బోధించాల్సిన బాధ్యత జనసేన అగ్ర నాయకత్వంపై ఉంది. ఈ అనియంత్రిత శక్తులను ఇప్పటికైనా కట్టడి చేయకపోతే.. బయటి శత్రువుల కంటే అనుకూల శత్రువుల వల్లే జనసేనకు ఎక్కువ నష్టం వాటిల్లే ప్రమాదం పొంచి ఉంది.

వరంగల్ హోటళ్లలో అధికారుల దాడులు..విస్తుపోయే నిజాలు



(వరంగల్, సాక్షర): వరంగల్ హోటళ్లలో ఫుడ్ సేఫ్టీ తనిఖీలతో కలకలం రేగాయి. మండి బజార్‌లో హోటళ్లలో ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీలు నిర్వహించారు. హోటళ్లలో సింథటిక్ రంగుల వినియోగం గుర్తించారు. బిర్యానీ, చికెన్ వంటకాల్లో కృత్రిమ రంగులు కలుపుతున్నట్లు అధికారులు నిర్ధారించారు. ఫ్రోజెన్ చికెన్ నిల్వ, అపరిశుభ్ర వంటగదులు ఆందోళనలు కలిగించాయి. ఆహార తయారీలో నిబంధనలు పాటించని హోటళ్లపై అధికారులు కొరడా ఝుళిపించారు. పలు ఆహార పదార్థాల నమూనాలు సేకరించి ల్యాబ్‌కు పంపారు.

గాజుల అలంకారంలో కనక దుర్గమ్మ



(విజయవాడ, సాక్షర): కార్తీక మాసం సందర్భంగా కార్తీక శుద్ధ విదియ పర్వదినాన్ని పురస్కరించుకొని విజయవాడలోని పవిత్ర ఇంద్రకీలాద్రిపై శ్రీ కనకదుర్గ అమ్మ గాజుల అలంకారంలో భక్తులకు దివ్యదర్శనమిస్తున్నారు. వివిధ రంగుల గాజులతో సర్వాంగ సుందరంగా అలంకరించబడిన అమ్మవారి రూపం భక్తులను విశేషంగా ఆకట్టుకుంటోంది. అమ్మవారి దివ్య మంగళ స్వరూపాన్ని దర్శించుకుని భక్తులు భక్తిపారవశ్యంలో మునిగిపోతున్నారు.

భారీ పెట్టుబడులే లక్ష్యంగా ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ తొలి సమావేశం పాల్గొన్న మంత్రి పొన్నం

(హైదరాబాద్ఇ, సాక్షర): నెవ్స్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ - 2026లో ఆటోమొబైల్, ఈవీ రంగాల్లో భారీ పెట్టుబడులే లక్ష్యంగా ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ తొలి సమావేశం ప్రారంభం అయింది. సచివాలయంలో మంత్రి పొన్నం ప్రభాకర్ అధ్యక్షతన ప్రారంభమైన ఆటోమొబైల్ & ఎలక్ట్రిక్ వెహికల్స్ (EV) రంగం ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో రవాణా శాఖ సెక్రెటరీ ఇలాంబర్తి, స్పెషల్ సెక్రటరీ ఇండస్ట్రీస్ కృష్ణ ఆదిత్యా, నిఖిల్ చక్రవర్తి ఇండస్ట్రీస్ సెక్రెటరీ, ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, జెటీసి వెంకట రమణ , ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ కన్వీనర్‌గా పరిశ్రమల శాఖ డైరెక్టర్ జుబైద్ షేక్ తదితరులు పాల్గొన్నారు. హైబ్రిడ్ విధానంలో జరుగుతున్న సమావేశానికి సుమారు 25 మంది ప్రముఖ పారిశ్రామికవేత్తలు, కంపెనీల ప్రతినిధులు హాజరు అయ్యారు. ఏథర్, బాష్, జెడ్ఎఫ్, టాఫే, జియో బీపీ, ఏవీఎల్ తదితర ప్రముఖ సంస్థల ప్రతినిధుల పాలు పంచుకున్నారు. తెలంగాణలో ఆటోమొబైల్ తయారీ, ఎలక్ట్రిక్ వాహనాలు, ఈవీ ఛార్జింగ్ మౌలిక సదుపాయాలు, బ్యాటరీ టెక్నాలజీ, క్లీన్ మొబిలిటీ రంగాల్లో పెట్టుబడులపై చర్చ జరిగింది. మంత్రి పొన్నం ప్రభాకర్ రాష్ట్రంలో కొత్త పరిశ్రమల ఏర్పాటు, పెట్టుబడుల అవకాశాలు, పరిశ్రమల విస్తరణపై పారిశ్రామికవేత్తలతో చర్చించారు. గ్లోబల్ సమ్మిట్‌లో నిర్వహించే ఇన్వెస్ట్‌మెంట్ ఎక్స్‌పోలో ప్రముఖ ఆటోమొబైల్, ఈవీ కంపెనీల భాగస్వామ్యంపై చర్చ జరిగింది. పరిశ్రమలకు అవసరమైన విధానపరమైన అంశాలు, ప్రభుత్వ సహకారం, మౌలిక సదుపాయాల కల్పనపై పారిశ్రామికవేత్తల నుంచి సూచనల స్వీకరించారు. గ్లోబల్ సమ్మిట్‌లో ఆటోమొబైల్ & ఈవీ రంగంపై ప్రత్యేక సెషన్ నిర్వహణకు కీలక అంశాల గుర్తించారు. పరిశ్రమలు, ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయంతో కొత్త పెట్టుబడులు, ఉద్యోగావకాశాల కల్పనకు కార్యాచరణ ప్రణాళికపై చర్చ జరిగింది. తెలంగాణను దేశంలోనే ప్రముఖ ఆటోమొబైల్, ఎలక్ట్రిక్ వాహనాల పెట్టుబడుల గమ్యస్థానంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.

ఎండోస్కోపిక్ స్పైన్ సర్జరీలో కిమ్స్ అరెటే హాస్పిటల్‌కు అరుదైన గుర్తింపు.....

హైదరాబాద్‌లో కిమ్స్ అరెటే హాస్పిటల్‌కు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది. అడ్వాన్స్‌డ్ స్పైన్ కేర్ విభాగంలో హైదరాబాద్‌లోని కిమ్స్ అరెటే హాస్పిటల్ మరో అరుదైన ఘనత సాధించింది. అత్యాధునిక ఎండోస్కోపిక్ స్పైన్ సర్జరీ విధానంలో 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్'గా గుర్తింపు పొందింది. హాస్పిటల్‌లోని స్పైన్ ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన ప్రముఖ వైద్య బృందం నిర్వహిస్తున్న సేవలను గుర్తిస్తూ, అంతర్జాతీయ సంస్థ రివోస్పైన్ (RIWOspine) ఈ గుర్తింపును అందించింది. ముఖ్యంగా డాక్టర్ సుకుమార్ సూరా నేతృత్వంలో గత 13 ఏళ్లకు పైగా ఎండోస్కోపిక్ స్పైన్ సర్జరీ విభాగంలో అందిస్తున్న విశేష వైద్య సేవలకు ఈ గౌరవం దక్కింది. ఈ గుర్తింపు భారతదేశంలోనే తొలిసారిగా లభించడం విశేషం. మూత్రం, నరాల సమస్యలు, వెన్నెముకకు సంబంధించిన వ్యాధులతో బాధపడుతున్న రోగులకు అత్యాధునిక ఎండోస్కోపిక్ స్పైన్ సర్జరీ ద్వారా మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నారు. ఈ విధానంలో చిన్న కోతతోనే శస్త్రచికిత్స నిర్వహించడం వల్ల రోగులకు తక్కువ నొప్పి, వేగవంతమైన కోలుకోవడం, తక్కువ ఆసుపత్రి బస వంటి ప్రయోజనాలు కలుగుతున్నాయి. ఈ చికిత్సా విధానంలో అత్యాధునిక పరికరాలు, స్పైనల్ కెమెరాలు, నావిగేషన్ టెక్నాలజీ, ప్రత్యేక శస్త్రచికిత్స పరికరాలను వినియోగిస్తున్నారు. రోగులకు నాణ్యమైన వైద్యం అందించడంతో పాటు త్వరగా సాధారణ జీవనానికి తిరిగి వచ్చేలా వైద్య బృందం కృషి చేస్తోంది. ఈ సందర్భంగా కిమ్స్ గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ బి. భాస్కర్ రావు మాట్లాడుతూ, అత్యాధునిక వైద్య సాంకేతికతను అందుబాటులోకి తీసుకురావడంలో కిమ్స్ ఎప్పుడూ ముందుంటుందని తెలిపారు. నైపుణ్యం కలిగిన వైద్యులు, ఆధునిక పరికరాలు, రోగుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధతో మెరుగైన వైద్య సేవలు అందించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. ఈ గుర్తింపు కిమ్స్ అరెటే హాస్పిటల్ వైద్య బృందం నిబద్ధతకు, అత్యాధునిక వెన్నెముక శస్త్రచికిత్స రంగంలో సాధించిన పురోగతికి నిదర్శనంగా నిలుస్తుందని ఆసుపత్రి వర్గాలు వెల్లడించాయి.

సీనియర్ ఐఏఎస్ అధికారులపై కోర్టు ధిక్కరణ కేసులు.. నవంబర్ 13న హైకోర్టు విచారణ



- సర్వీస్, సీనియారిటీ అంశాల్లో ఏళ్లుగా అమలుకాని తీర్పులపై పిటిషన్లు
- విచారణకు వ్యక్తిగతంగా హాజరుకావాలని అధికారులకు కోర్టు ఆదేశం
- తదుపరి విచారణకు అధికారులు వ్యక్తిగతంగా హాజరు కావాలని హైకోర్టు ఆదేశం

(విజయవాడ, సాక్షర): రాష్ట్రంలో ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న, పదవీ విరమణ చేసిన పలువురు సీనియర్ ఐఏఎస్ అధికారులపై దాఖలైన కోర్టు ధిక్కరణ వ్యాజ్యాలపై ఏపీ హైకోర్టు ఈ నెల 13న విచారణ జరపనుంది. ఉద్యోగుల సర్వీసు అంశాల్లో న్యాయస్థానం గతంలో వెలువరించిన తీర్పులను ఉద్దేశపూర్వకంగా అమలు చేయడం లేదంటూ దాఖలైన పలు పిటిషన్లను జస్టిస్ రవినాథ్ తిలహరి, జస్టిస్ ఆలపాటి గిరిధర్‌లతో కూడిన ధర్మాసనం విచారించనుంది. ఈ పిటిషన్లను సచివాలయ సిబ్బంది, ఆర్ అండ్ బీ ఇంజనీర్లు, టీటీడీ ఉద్యోగులు, పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ అధికారులు, పదవీ విరమణ చేసిన పలువురు ఉద్యోగులు దాఖలు చేశారు. సూపర్‌న్యూమరరీ పోస్టుల కేటాయింపు, అంతర్రాష్ట్ర సీనియారిటీ నిబంధనల అమలు, ఇతర సర్వీసు ప్రయోజనాల కల్పన వంటి అంశాలపై 2018 నుంచి న్యాయస్థానం ఇచ్చిన పలు ఉత్తర్వులను అధికారులు అమలు చేయడం లేదని పిటిషనర్లు ఆరోపిస్తున్నారు. అక్టోబర్ 30న జరిగిన విచారణ సందర్భంగా, ఈ కేసును ధర్మాసనం నవంబర్ 13కి వాయిదా వేసింది. ఖాళీల లెక్కింపు, నూతన పోస్టుల సృష్టి, సీనియారిటీ సమస్యల పరిష్కారంలో పరిపాలనాపరమైన చిక్కులు ఉన్నాయని, కోర్టు ఆదేశాల అమలుకు మరికొంత సమయం కావాలని ప్రభుత్వం తరపున అడ్వకేట్ జనరల్ కోరారు. అయితే, న్యాయస్థానం ఇచ్చిన ప్రధాన ఆదేశాలు ఇప్పటికీ కార్యరూపం దాల్చలేదని పిటిషనర్లు వాదిస్తున్నారు. ఈ కేసులో కొత్తగా ప్రతివాదులుగా చేరిన వారు రెండు వారాల్లోగా కౌంటర్ అఫిడవిట్లు దాఖలు చేయాలని, ఇప్పటికే కౌంటర్లు వేసిన అధికారులు తదుపరి విచారణకు వ్యక్తిగతంగా హాజరు కావాలని ధర్మాసనం తన గత ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది.

ఘనంగా జాతీయ విద్యా దినోత్సవ వేడుకలు



(ఆదిలాబాద్‌టౌన్, సాక్షర): కేఆర్కే కాలనీలోని మండల పరిషత్ ఉన్నత ప్రాథమిక పాఠశాల తెలుగు మాధ్యమం పాఠశాలలో భారతదేశ తొలి విద్యా శాఖ మంత్రి, గొప్ప విద్యావేత్త మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని పురస్కరించుకొని జాతీయ విద్యా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు నర్రా నవీన్ యాదవ్ మాట్లాడుతూ, దేశ విద్యారంగ అభివృద్ధికి మౌలానా అబుల్ కలాం ఆజాద్ చేసిన విశేష సేవలను, విద్యా వ్యవస్థ బలోపేతానికి ఆయన అందించిన కృషిని విద్యార్థులకు వివరించారు. ప్రతి ఒక్కరికీ నాణ్యమైన విద్య అందాలనే ఆయన ఆశయాలను విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు.అనంతరం విద్యార్థులు మౌలానా అబుల్ కలాం ఆజాద్ జీవిత విశేషాలు, విద్యారంగానికి ఆయన చేసిన సేవలను వివరిస్తూ జాతీయ విద్యా దినోత్సవం ప్రాముఖ్యతను తెలియజేశారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు నర్రా నవీన్ యాదవ్, ఉపాధ్యాయులు జాడే శ్రీనివాస్, శ్రీకాంత్, శ్రీరామ్, కిరణ్ కుమార్, కిషోర్ కుమార్, శృతి తదితరులు పాల్గొన్నారు.

మొదటి పేజీ తరువాయి

గాంధీ కుటుంబంలో మరణాలు యాదృచ్ఛికం కాదు

సోనియా గాంధీ రాసిన ఆత్మకథ "బిలాంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్" ఇటీవల విడుదలైన నేపథ్యంలో దేశవ్యాప్తంగా రాజకీయ చర్చ జరుగుతోంది. ఈ క్రమంలో కంగన తన 'ఎమర్జెన్సీ' సినిమా కోసం గాంధీ కుటుంబంపై లోతుగా పరిశోధన చేశానని, ఆ సమయంలో తనకు కొన్ని వింత విషయాలు తెలిశాయని పేర్కొన్నారు. "గాంధీ కుటుంబంలోకి ఓ మిస్టీరియస్ ఫారినర్ ప్రవేశించాక, ఇందిరా గాంధీ, సంజయ్ గాంధీ, రాజీవ్ గాంధీ వంటి సింహాసనానికి అసలైన వారసులంతా హతమయ్యారు. చివరికి ఆ విదేశీ వ్యక్తే ఏకైక వారసురాలిగా మిగిలిపోయారు. ఇన్ని యాదృచ్ఛిక సంఘటనలు జరిగినా ప్రజలు ఎందుకు ఆలోచించలేదు?" అని కంగనా ప్రశ్నించారు. మరో పోస్టులో, సంజయ్ గాంధీ మరణం తర్వాత ఆయన భార్య మేనకా గాంధీని, వారి కుమారుడిని సోనియా గాంధీ ఇంటి నుంచి గెంటేశారని కంగన ఆరోపించారు. "సంజయ్ గాంధీ ప్రేమించి పెళ్లి చేసుకున్న మేనక, ఆయన మరణం తర్వాత దిక్కులేనిదైంది. చిన్న వయసులోనే వితంతువుగా మారిన ఆమెను, పసిబిడ్డతో సహా ఇంటి నుంచి బయటకు పంపించేశారు. మిగిలిన వారందరూ చనిపోవడానికి ముందే ఆమెను పక్కకు తప్పించడం ఎంత సౌకర్యంగా ఉంది!" అని కంగన వ్యాఖ్యానించారు. ఇటీవల విడుదలైన గాంధీ కుటుంబానికి చెందిన ఓ పాత వీడియోపైనా కంగనా స్పందించారు. ఆ వీడియోలో అందరూ సోనియా కనుసన్నల్లో ఉన్నట్లు కనిపించారని, భర్తను కోల్పోయిన మేనకా గాంధీ మాత్రం ఒంటరిగా, చిన్నబుచ్చుకుని ఉన్నారని ఆమె విశ్లేషించారు. విదేశాల్లోని ఓ కేఫ్‌లో రాజీవ్ గాంధీకి అనుకోకుండా పరిచయమై, అప్పటి నుంచి గాంధీ కుటుంబంలోకి వచ్చిన సోనియా.. ఆ తర్వాత దేశాన్ని దశాబ్దాల పాటు పాలించడంపై కంగన తీవ్ర అనుమానాలు వ్యక్తం చేశారు. కంగనా చేసిన ఈ ఆరోపణలు ఇప్పుడు రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి.


బిర్సా ముండా 151వ జయంతిని ఘనంగా నిర్వహించాలి

- ఆదివాసీ హక్కుల పరిరక్షణకు ఐక్యంగా పోరాడాలి గోడం గణేష్ పిలుపు



(ఆదిలాబాద్, సాక్షర) భారతదేశ ఆదివాసీ విప్లవ వీరుడు, జల్, జంగల్, జమీన్, స్వయం పరిపాలన కోసం పోరాడిన అడవి బిడ్డ, స్వాతంత్ర్య సమరయోధుడు, ఆదివాసీ హక్కుల పోరాటానికి స్ఫూర్తిప్రదాత భగవాన్ బిర్సా ముండా 151వ జయంతిని ఈ నెల 15న దేశవ్యాప్తంగా ఆదివాసులు ఘనంగా నిర్వహించాలని ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుం దెబ్బ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు గోడం గణేష్ విజ్ఞప్తి చేశారు. స్థానిక ఆదివాసులతో సమావేశమై ఆయన మాట్లాడుతూ 1875 నవంబర్ 15న జన్మించిన బిర్సా ముండా బ్రిటిష్ పాలకుల దోపిడీకి, ఆదివాసీల భూముల ఆక్రమణకు, అటవీ హక్కుల నిరాకరణకు వ్యతిరేకంగా ప్రజలను చైతన్యపరిచి చారిత్రాత్మకమైన ఉల్గులాన్ ఉద్యమానికి నాయకత్వం వహించారని తెలిపారు. ఆదివాసీల జల్, జంగల్, జమీన్ హక్కుల కోసం తన జీవితాన్ని త్యాగం చేసిన మహనీయుడు బిర్సా ముండా అని కొనియాడారు. ఆయన పోరాట స్ఫూర్తి నేటి తరానికి మార్గదర్శకమని పేర్కొన్నారు.నేటికీ దేశవ్యాప్తంగా ఆదివాసీలు భూమి హక్కులు, అటవీ హక్కులు, విద్య, వైద్యం, ఉపాధి, తాగునీరు వంటి కనీస మౌలిక సదుపాయాల కోసం పోరాటం చేయాల్సిన దౌర్భాగ్య పరిస్థితి ఉందన్నారు. ప్రభుత్వాలు ఆదివాసీలకు రాజ్యాంగం కల్పించిన హక్కులను సమర్థవంతంగా అమలు చేయాలని, అటవీ హక్కుల చట్టం - 2006ను పకడ్బందీగా అమలు చేసి అర్హులైన ఆదివాసీ కుటుంబాలకు పోడు భూముల పట్టాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.అలాగే ఐదవ షెడ్యూల్ ప్రాంతాల్లో రాజ్యాంగ నిబంధనలను అమలు చేయాలని, పీసా చట్టం ప్రకారం గ్రామసభలకు అధికారాలు కల్పించాలని, ఆదివాసీల భూములు అన్యాక్రాంతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.ఆదివాసీ భాషలు, సంస్కృతి, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలను రక్షించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ఆదివాసీ యువత విద్యావంతులై, తమ హక్కుల పట్ల అవగాహన పెంపొందించుకొని సమాజ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.బిర్సా ముండా జయంతిని కేవలం ఉత్సవంగా కాకుండా ఆయన ఆశయాలను ఆచరణలో పెట్టే దినంగా జరుపుకోవాలని, ఆదివాసీ సమాజమంతా ఐక్యంగా ఉండి తమ హక్కులు, ఆత్మగౌరవం, అస్తిత్వ పరిరక్షణ కోసం శాంతియుతంగా, ప్రజాస్వామ్యబద్ధంగా పోరాడాలని గోడం గణేష్ పిలుపునిచ్చారు.సమావేశంలో తుడుం దెబ్బ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి వెట్టి మనోజ్, రాష్ట్ర కార్యదర్శి అర్కా శేషారావు, మహిళా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోడం రేణుక, మహిళా సంఘం రాష్ట్ర కార్యదర్శి ఉయిక ఇందిరా, మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు సోయం లలిత, జిల్లా ప్రధాన కార్యదర్శి గేడం విష్ణు, డివిజన్ అధ్యక్షుడు ఆత్రం గణపతి, మండల అధ్యక్షులు వెడ్మ ముకుందరావు తదితరులు పాల్గొన్నారు.

జన గణనలో ఓబీసీ విభాగం చేర్చాలి



(హాజీపూర్ / మంచిర్యాల, సాక్షర) జన గణనలో ఓబీసీ విభాగం చేర్చి కులానికి ఒక ప్రత్యేక సంకేతం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో హాజీపూర్ మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి వినతి సమర్పించి నిరసన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ బ్రిటిష్ ప్రభుత్వం 1931లో కుల గణన చేపడితే దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 80 సంవత్సరాలు అవుతున్నా బీసీ కుల గణన చేపట్టకపోవడం బీసీలపై వివక్షగా భావిస్తున్నామన్నారు. దేశ ప్రధాని మోదీ పార్లమెంట్ సాక్షిగా బీసీ కుల గణన చేపడతామని ప్రకటించిన మాటలు బుట్టదాఖలయ్యాయన్నారు.కుల గణన చేపట్టాలని దేశంలో, రాష్ట్రంలో అనేక సంవత్సరాలుగా ఉద్యమాలు నడుస్తున్న నేపథ్యంలో తమ ఉద్యమ ఆకాంక్షను, న్యాయమైన డిమాండ్ ను పరిష్కరించకపోవడం బాధాకరమన్నారు. జన గణనలో ఓబీసీ విభాగం చేరిస్తే బీసీల జనాభా బహిర్గతమై చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్ కల్పించాల్సి వస్తుందని, అలాగే విద్యా, ఉద్యోగ, స్థానిక సంస్థల్లో ప్రస్తుతం కొనసాగుతున్న రిజర్వేషన్లు పెంచాల్సి వస్తుందని కేంద్ర పాలకులు భావిస్తున్నారన్నారు.బీసీ కుల గణనకు అనుకూలంగా 10 రాష్ట్ర ప్రభుత్వాలు అసెంబ్లీ తీర్మానం చేసి పంపించినప్పటికీ, దేశంలో గుర్తింపు పొందిన 27 రాజకీయ పార్టీలు బీసీ కుల గణన కోసం కేంద్ర ప్రభుత్వానికి లేఖలు ఇచ్చినప్పటికీ కుల గణన చేపట్టకపోవడం బీసీలపై వివక్ష, కుట్ర అని భావిస్తున్నామన్నారు. ఇప్పటికైనా జన గణనలో ఓబీసీ విభాగం చేర్చి కులానికి ఒక ప్రత్యేక సంకేతం పెట్టాలని డిమాండ్ చేస్తున్నామని, లేని పక్షంలో ఈ అంశాన్ని బీసీ సమాజం ముందు ఎండగట్టి బీజేపీ ప్రభుత్వాన్ని బీసీ సమాజం ముందు దోషిగా నిలబెడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు గుమ్ముల శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి పెద్దల్ల చంద్రకాంత్, శకపురి భీమ్ సేన్ తదితరులు పాల్గొన్నారు.

మొదటి పేజీ తరువాయి

ఒకే సమయంలో రెండు రాష్ట్రాల సమ్మిట్‌లు

హైదరాబాద్ సమ్మిట్‌కు అంతర్జాతీయ ప్రతినిధులతో పాటు జాతీయ స్థాయి కార్పొరేట్ నెట్‌వర్క్‌ను కాంగ్రెస్ ప్రభుత్వం ఆహ్వానిస్తుండగా.. విశాఖ సదస్సుకు 59 దేశాల ప్రతినిధులు, 15 మంది విదేశీ మంత్రులు, భారత ఉపరాష్ట్రపతి, కేంద్ర వాణిజ్య మంత్రితో పాటు సుమారు 1,250 మందికి పైగా ప్రముఖులను రప్పించేలా ఏపీ ప్రభుత్వం భారీ నెట్‌వర్క్‌ను రంగంలోకి దించింది. పారిశ్రామికవేత్తలు సైతం హైదరాబాద్ నుంచి విశాఖకు, విశాఖ నుంచి హైదరాబాద్‌కు తమ ప్రతినిధులను సర్దుబాటు చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.ఈ పరిణామాన్ని కేవలం ఆధిపత్య పోరాటంగా చూడటం కంటే.. ప్రాంతీయ ఆర్థిక వికాసానికి దారితీసే ఆరోగ్యకరమైన పోటీ గా భావించవచ్చు. ఒకప్పుడు చంద్రబాబు నాయుడు హైదరాబాద్‌ను ఐటీ కేంద్రంగా నిలబెట్టినప్పుడు పోటీ లేని వాతావరణం ఉండేది. కానీ ఇప్పుడు విభజిత ఆంధ్రప్రదేశ్‌ను పునర్నిర్మించే సంకల్పంతో నవ్యాంధ్ర వేగంగా అడుగులు వేస్తుంటే.. దశాబ్దాలుగా ఉన్న మెట్రో నగర అనుకూలతను, ఫ్యూచర్ సిటీ కాన్సెప్ట్‌ను మరింత ముందుకు తీసుకెళ్లేందుకు తెలంగాణ ప్రభుత్వం దూకుడు ప్రదర్శిస్తోంది. తెలంగాణ గ్రీన్ ఫీల్డ్ భారత్ ఫ్యూచర్ సిటీ , ఏఐ, ఫార్మా రంగాల్లో పట్టు నిలుపుకోవాలని ప్రయత్నిస్తుంటే.. ఏపీ తన సుదీర్ఘ తీరప్రాంతం, పోర్టులు, స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ , సెమీకండక్టర్లు, పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులతో పోటీ పడుతోంది.పోటీ ఎంత బలంగా ఉంటే పెట్టుబడిదారులకు అంత మేలు జరుగుతుందన్నది మార్కెట్ సూత్రం. సింగిల్ విండో అనుమతులు, పారదర్శక పారిశ్రామిక రాయితీలు, మౌలిక వసతుల కల్పనలో ఏ రాష్ట్రం మెరుగైన ఆఫర్లు ఇస్తుందనే అంశాన్ని పరిశ్రమలు బేరీజు వేసుకుంటాయి. గతంలో కేవలం ఒకే నగరానికో లేదా ఒకే ప్రాంతానికో పరిమితమైన పరిశ్రమలు.. ఇప్పుడు హైదరాబాద్‌తో పాటు విశాఖ, అమరావతి, రాయలసీమ వంటి ద్వితీయ శ్రేణి నగరాలకు కూడా విస్తరించే వెసులుబాటు కలుగుతుంది. రెండు ప్రభుత్వాల విధానాలలో పారదర్శకత పెరగడానికి, పరిపాలనా జాప్యాన్ని నివారించేందుకు ఈ ఆరోగ్యకరమైన పోటీ ఒక శక్తివంతమైన సాధనంగా పనిచేస్తుంది. రెండు రాష్ట్రాల మధ్య నెలకొన్న ఈ పెట్టుబడుల సమరం అంతిమంగా తెలుగు సమాజానికి, ఉపాధి కోసం ఎదురుచూస్తున్న లక్షలాది మంది నిరుద్యోగ యువతకే ప్రయోజనం చేకూర్చనుంది.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రభావం

(మహబూబ్ నగర్, సాక్షర): తెలంగాణలో త్వరలో జరగనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు అధికార కాంగ్రెస్ పార్టీకి అగ్నిపరీక్షగా మారే సంకేతాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం చూపుతున్న అలసత్వం.. ముఖ్యంగా రెండో వేతన సవరణ కమిషన్ (పీఆర్సీ) అమలుపై నెలకొన్న ప్రతిష్టంభన ఉద్యోగ వర్గాల్లో తీవ్ర అసంతృప్తికి కారణమవుతోంది. తమ చిరకాల డిమాండ్లను నెరవేర్చకపోతే ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులకు వ్యతిరేకంగా ఓటు వేయడమే కాకుండా, స్వయంగా ప్రచారం చేసి గుణపాఠం చెబుతామని ఉద్యోగ సంఘాలు హెచ్చరిస్తుండటం రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశమవుతోందిప్రస్తుతం మహబూబ్‌నగర్- రంగారెడ్డి-హైదరాబాద్, అలాగే వరంగల్- ఖమ్మం- నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గాల్లో ఎన్నికల వేడి మొదలైంది. ఈ రెండు నియోజకవర్గాల పరిధిలోని ఆరు జిల్లాల్లో కలిపి సుమారు నాలుగు లక్షల మందికి పైగా ఉద్యోగులు, పెన్షనర్లు, కాంట్రాక్ట్ సిబ్బంది గ్రాడ్యుయేట్లుగా ఉన్నారు. ఇప్పటికే పెద్ద సంఖ్యలో ఉద్యోగులు ఓటర్లుగా నమోదు చేసుకున్నారు. పట్టభద్రుల స్థానాల్లో ఫలితాలను తారుమారు చేయగల సంఖ్యాబలం వీరికి ఉండటంతో, ఉద్యోగ వర్గాల అసహనం నేరుగా ఫలితాలపై ప్రభావం చూపే ప్రమాదం ఏర్పడింది.నవంబర్ 6న నాంపల్లిలోని టీజీవో భవన్‌లో తెలంగాణ ఉద్యోగులు, గెజిటెడ్ అధికారులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్ల జాయింట్ యాక్షన్ కమిటీ చైర్‌పర్సన్ మారం జగదీశ్వర్, సెక్రటరీ జనరల్ ఏలూరి శ్రీనివాసరావు అధ్యక్షతన విస్తృత స్థాయి కార్యవర్గ సమావేశం జరిగింది. మూడేళ్లకు పైగా పెండింగ్‌లో ఉన్న సమస్యలపై ఈ భేటీలో సుదీర్ఘంగా చర్చించారు. ముఖ్యంగా జూలై 1, 2023 నుంచి వర్తించేలా 51శాతం ఫిట్‌మెంట్‌తో రెండో పీఆర్సీ నివేదికను తక్షణమే విడుదల చేసి అమలు చేయాలని జేఏసీ పట్టుబడుతోంది. గతంలో జూన్ 2 నాటికి కమిషన్ నుంచి నివేదిక తెప్పిస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ ఇప్పటికీ నెరవేరలేదని నేతలు గుర్తుచేశారు. అలాగే ఉద్యోగులకు రావాల్సిన వివిధ బిల్లుల బకాయిలు ప్రస్తుతం రూ. 10,000 కోట్ల మార్కును దాటాయి. వీటిని క్లియర్ చేయడానికి ప్రభుత్వం ప్రతినెలా కేటాయిస్తున్న మొత్తాన్ని ప్రస్తుత రూ. 1,000 కోట్ల నుంచి రూ. 2,000 కోట్లకు పెంచాలని ఉద్యోగ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.మరోవైపు.. పాత పెన్షన్ విధానం (ఓపీఎస్) పునరుద్ధరణ అంశాన్ని పరిశీలించేందుకు సంయుక్త కమిటీ వేస్తామని, పీఆర్సీ నివేదిక తెప్పిస్తామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క హామీ ఇచ్చి రెండు నెలలు దాటినా ఇప్పటివరకు కార్యాచరణ శూన్యమని మండిపడ్డారు. ప్రభుత్వం తెచ్చిన కొత్త ఎంప్లాయ్ హెల్త్ స్కీమ్ (ఈహెచ్ఎస్)ను జేఏసీ స్వాగతించినప్పటికీ, అది కాగితాలకే పరిమితం కాకుండా ప్రభుత్వ రంగ సంస్థలన్నింటికీ వర్తింపజేయాలని, నెట్‌వర్క్ ఆసుపత్రులు తప్పనిసరిగా నగదు రహిత సేవలు అందించేలా కఠిన మార్గదర్శకాలు ఇవ్వాలని కోరారు.జేఏసీ అగ్రనాయకత్వం ప్రభుత్వంతో సంప్రదింపులకు ఇంకా మొగ్గు చూపుతున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో ఉద్యోగుల్లో తీవ్ర అసహనం నెలకొంది. ఎన్నికల వేళ ఇచ్చిన హామీలను దాటవేస్తున్నారన్న ఆగ్రహం వారిలో స్పష్టంగా కనిపిస్తోంది. ఈ నేపథ్యంలోనే దీపావళి పండుగ ముగియగానే ఉద్యమ కార్యాచరణను ఖరారు చేయాలని జేఏసీ నిర్ణయించింది. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నోటిఫికేషన్ సమీపిస్తున్న వేళ, ప్రభుత్వం నుంచి స్పష్టమైన కాలపరిమితితో కూడిన హామీ రాకపోతే పోరుబాట తప్పదని ఉద్యోగ వర్గాలు హెచ్చరిస్తున్నాయి. పెండింగ్ బిల్లుల విడుదల, 51శాతం ఫిట్‌మెంట్‌తో పీఆర్సీ అమలు దిశగా ప్రభుత్వం త్వరితగతిన అడుగులు వేయకపోతే, గ్రాడ్యుయేట్ ఓటర్ల ఆగ్రహం అధికార పార్టీకి రాజకీయంగా భారీ నష్టాన్ని చేకూర్చే అవకాశాలు కనిపిస్తున్నాయి

ఐటీ, పారిశ్రామిక రంగాల్లో ఆదిలాబాద్‌ను అగ్రగామిగా తీర్చిదిద్దుతాం



(ఆదిలాబాద్, సాక్షర) ఆదిలాబాద్‌ను ఐటీ, పారిశ్రామిక రంగాల్లో అభివృద్ధి చేసి, స్థానిక యువతకు విస్తృత ఉపాధి అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు.బుధవారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో రూ.57.85 కోట్లతో నిర్మించిన నూతన ఐటీ టవర్‌ను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, నిధుల కొరతతో నిలిచిపోయిన ఐటీ టవర్ నిర్మాణాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో పూర్తి చేసి అందుబాటులోకి తీసుకొచ్చామని తెలిపారు. యువత ఉద్యోగాల కోసం హైదరాబాద్‌కు వలస వెళ్లకుండా స్థానికంగానే ఉపాధి పొందేలా ఐటీ సంస్థలను తీసుకొస్తున్నామని పేర్కొన్నారు.ఐటీ టవర్‌లో నైపుణ్య శిక్షణ కేంద్రం, ఇంక్యుబేషన్ కేంద్రం ఏర్పాటు చేశామని తెలిపారు. ఎన్టీటీ డేటాలో 300 మందికి, ఎన్ ల్యాబ్స్‌లో 250 మందికి, వైడర్ సాఫ్ట్‌వేర్‌లో 20 మందికి, పోస్ట్రిట్ ఏఐలో 50 మందికి ఉపాధి కల్పించేలా సంస్థలు కార్యకలాపాలు ప్రారంభించాయని వెల్లడించారు. స్థానిక యువతకు సాంకేతిక నైపుణ్యాల్లో శిక్షణ ఇచ్చి ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పారు. ఆదిలాబాద్‌లో 3 వేల ఎకరాల్లో పారిశ్రామిక కారిడార్ ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి ప్రకటించారు. తొలివిడతలో 2 వేల ఎకరాలు, రెండో విడతలో మరో వెయ్యి ఎకరాలు సేకరించేందుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు.ఆదిలాబాద్‌లో విమానాశ్రయం ఏర్పాటుకు ముఖ్యమంత్రి ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారని, భూసేకరణ, అనుమతుల ప్రక్రియను వేగవంతం చేసి త్వరలో శంకుస్థాపన చేసేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. విమానాశ్రయం అందుబాటులోకి వస్తే ఐటీ, పారిశ్రామిక రంగాల అభివృద్ధికి మరింత ఊతం లభిస్తుందని పేర్కొన్నారు. గతంలో మూతపడిన సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా పరిశ్రమను తిరిగి ప్రారంభించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. సాంకేతిక, విధానపరమైన సమస్యలను పరిష్కరించి పరిశ్రమ పునరుద్ధరణకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.హైదరాబాద్‌కే పరిమితమైన ఐటీ రంగాన్ని ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాలు, గ్రామీణ ప్రాంతాలకు విస్తరించడమే ప్రభుత్వ సంకల్పమని మంత్రి స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఎంపీ జి. నగేష్ మాట్లాడుతూ, ఐటీ టవర్ ప్రారంభం జిల్లా యువత భవిష్యత్తుకు ఎంతో మేలు చేస్తుందని అన్నారు. విమానాశ్రయం, జాతీయ రహదారులు, రైల్వే, సీసీఐ పునరుద్ధరణ వంటి ప్రాజెక్టులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఎమ్మెల్యే పాయల్ శంకర్ మాట్లాడుతూ... ఐటీ టవర్‌ను అందుబాటులోకి తీసుకొచ్చిన ముఖ్యమంత్రి, ఐటీ మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. ఉద్యోగావకాశాలు పెరుగుతున్న నేపథ్యంలో మరో ఐటీ టవర్ మంజూరు చేయాలని కోరారు. స్థానిక పరిశ్రమలకు ప్రత్యేక రాయితీలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు.ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ మాట్లాడుతూ, ఆదివాసీ, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వడం అభినందనీయమన్నారు. ఐటీ, పారిశ్రామిక సంస్థల్లో స్థానిక ఆదివాసీ యువతకు ఉద్యోగాల్లో ప్రాధాన్యం కల్పించాలని, ఈ ప్రాంతంలో విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఐటీ శాఖ కార్యదర్శులు అనుదీప్, శశాంక్, అదనపు కలెక్టర్లు ఎస్. రాజేశ్వర్, ఆర్.ఎస్. చిత్రూ, ఎస్పీ అఖిల్ మహాజన్, టీజీఐఐసీ జోనల్ మేనేజర్ శివప్రసాద్, ఆర్డీవో జగదీశ్వర్ రావు, మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూష, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీకాంత్, ప్రజాప్రతినిధులు, ఐటీ శాఖ అధికారులు, పరిశ్రమల ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అబుల్ కలాం ఆజాద్ చేసిన సేవలు చిరస్మరణీయం జిల్లా అదనపు కలెక్టర్ పి. చంద్రయ్య



(మంచిర్యాల, సాక్షర) భారతదేశ తొలి విద్యా శాఖ మంత్రి, స్వాతంత్ర్య సమరయోధుడు, గొప్ప విద్యావేత్త, భారతరత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ దేశంలో విద్యారంగ అభివృద్ధికి అందించిన సేవలు చిరస్మరణీయమని జిల్లా అదనపు కలెక్టర్ పి. చంద్రయ్య అన్నారు.బుధవారం మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని పురస్కరించుకొని జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జాతీయ విద్యా దినోత్సవ వేడుకలకు జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి నీరటి రాజేశ్వరి, అధికారులతో కలిసి హాజరై ఆజాద్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ మౌలానా అబుల్ కలాం ఆజాద్ భారతదేశ విద్యారంగ అభివృద్ధికి పునాదులు వేసిన మహనీయులలో ఒకరని, స్వాతంత్ర్య ఉద్యమంలో కీలక పాత్ర పోషించడంతో పాటు, స్వతంత్ర భారతదేశ తొలి విద్యా శాఖ మంత్రిగా దేశంలో విద్యా వ్యవస్థ బలోపేతానికి విశేష కృషి చేశారని తెలిపారు. దేశంలోని ప్రతి ఒక్కరికీ విద్య అందుబాటులో ఉండాలని, పేద, బడుగు, బలహీన వర్గాల పిల్లలకు నాణ్యమైన విద్య అందించాలనే లక్ష్యంతో అనేక విద్యా సంస్కరణలకు శ్రీకారం చుట్టారని తెలిపారు. ఉన్నత విద్య, సాంకేతిక విద్య, పరిశోధన రంగాల అభివృద్ధికి ఆజాద్ చేసిన కృషి దేశ ప్రగతికి ఎంతో దోహదపడిందని తెలిపారు. విద్య అనేది కేవలం ఉద్యోగం పొందేందుకు మాత్రమే కాకుండా, వ్యక్తిత్వ వికాసానికి, సామాజిక సమానత్వానికి, దేశాభివృద్ధికి ప్రధాన సాధనమని ఆజాద్ భావించారని తెలిపారు. మహనీయుల ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని ప్రతి ఒక్కరూ విద్యకు ప్రాధాన్యతనిస్తూ, సమాజ అభ్యున్నతికి కృషి చేయాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నర్సాపూర్ లో పోలీసుల కమ్యూనిటీ కాంటాక్ట్

- 90 ద్విచక్ర వాహనాలు, 4 ఆటోలు, 2 కార్ల తనిఖీ



(ఇచ్చోడ, సాక్షర) నిబంధనలు ఉల్లంఘించిన 85 కేసుల్లో రూ.16,570 జరిమానా వసూలు చేసినట్లు పోలీసులు తెలిపారు.మండలం నర్సాపూర్ గ్రామంలో ఇచ్చోడ పోలీసుల ఆధ్వర్యంలో కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసులు గ్రామంలో ఉదయం 5 గంటల నుండి విస్తృతంగా తనిఖీలు చేపట్టారు.తనిఖీల్లో భాగంగా సరైన ధ్రువపత్రాలు లేని 90 ద్విచక్ర వాహనాలు, 4 ఆటోలు, 2 కార్లను తనిఖీ చేసి వాహనదారులకు రోడ్డు భద్రతా నిబంధనలపై అవగాహన కల్పించారు. వాహనాల ఈ-చలాన్లను పరిశీలించగా 85 కేసులకు సంబంధించి రూ.16,570 జరిమానాలను వాహనదారులు



చెల్లించడం జరిగింది.వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని పోలీసులు సూచించారు. వాహనాలకు సంబంధించిన పత్రాలు, నంబర్ ప్లేట్లు సక్రమంగా ఉండేలా చూసుకోవాలని తెలిపారు. అదేవిధంగా యువత గంజాయి, ఇతర మాదకద్రవ్యాలు, గుడుంబా వంటి నిషేధిత పదార్థాలకు దూరంగా ఉండాలని, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడవద్దని సూచించారు. గ్రామంలో ఎలాంటి అనుమానాస్పద లేదా చట్టవిరుద్ధ కార్యకలాపాలు జరిగినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు.కార్యక్రమంలో ఎస్ఐ విష్ణు ప్రకాష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

బాసర ట్రిపుల్ ఐటీ విద్యార్థులకు నిరంతరం సురక్షిత తాగునీరు అందించాలి జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా



(నిర్మల్ ప్రతినిధి, సాక్షర) బాసర ట్రిపుల్ ఐటీలో విద్యార్థులకు నిరంతరం పరిశుభ్రమైన, సురక్షితమైన తాగునీరు అందించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు.బుధవారం బాసర ట్రిపుల్ ఐటీలో విద్యార్థులతో ముఖాముఖి సమావేశం నిర్వహించి, క్యాంపస్ లో నీటి సరఫరా సమస్యలు, ఇతర ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తాగునీటి నాణ్యతను పరీక్షించి, శుద్ధి చేసిన నీటిని మాత్రమే విద్యార్థులకు అందించాలని సూచించారు. నీరు ఎక్కడ కలుషితమవుతుందో గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని, తాగునీటితో పాటు రోజువారీ అవసరాలకు సరిపడా నీటిని నిరంతరం సరఫరా చేయాలని ఆదేశించారు. విద్యార్థులు తమ సమస్యలను వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఈ సమావేశంలో భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, ట్రిపుల్ ఐటీ ఉపకులపతి గోవర్ధన్, ఓఎస్డీ మురళి దర్శన్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

భారత్ సమ్మిట్ రాజకీయ వేదిక కాదు..

- ప్రపంచ సమస్యలకు పరిష్కారాలే లక్ష్యం:
- మంత్రి శ్రీధర్ బాబు
- రాహుల్ గాంధీని రీలాంచ్ చేయాల్సిన అవసరం లేదు
- మోదీ తర్వాత ఎవరిని లాంచ్ చేయాలని బీజేపీ ఆలోచిస్తోంది

హైదరాబాద్ : భారత్ సమ్మిట్ నిర్వహణపై బీజేపీ నేతలు చేస్తున్న విమర్శలను రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఖండించారు. రాహుల్ గాంధీని రీలాంచ్ చేయడానికే సమ్మిట్ నిర్వహిస్తున్నారంటూ కొందరు బీజేపీ నాయకులు అవగాహన రాహిత్యంతో మాట్లాడుతున్నారని విమర్శించారు. రాహుల్ గాంధీ జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు ఉన్న నాయకుడని, ఆయనను ప్రత్యేకంగా మరోసారి లాంచ్ చేయాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీలో భారత్ సమ్మిట్‌పై నిర్వహించిన మీడియా సమావేశంలో శ్రీధర్ బాబు మాట్లాడారు. ప్రగతిశీల ఆలోచనలు కలిగిన పార్టీ కాంగ్రెస్ అని, ఆ భావజాలంతోనే తమ పార్టీ ముందుకు సాగుతోందని తెలిపారు. బీజేపీ ఆలోచనా విధానం భిన్నంగా ఉంటుందని, ఆ పార్టీ భావజాలం ఏమిటో ప్రజలందరికీ తెలుసన్నారు. మోదీ తర్వాత ఎవరిని లాంచ్ చేయాలని బీజేపీ ఆలోచిస్తోందంటూ ప్రశ్నించారు. రాహుల్ గాంధీ ఆలోచనా విధానం బీజేపీకి ఎప్పటికీ అర్థం కాదని వ్యాఖ్యానించారు. భారత్ సమ్మిట్‌ను రాజకీయ కోణంలో చూడకూడదని, ప్రస్తుతం ప్రపంచం ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కార మార్గాలను అన్వేషించడమే ఈ సదస్సు ప్రధాన ఉద్దేశమని శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. ఈ సమ్మిట్ ఆర్థిక సదస్సు తరహాలో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. యువత, సాంకేతికత సహా అనేక కీలక అంశాలపై సదస్సులో చర్చలు జరుగుతాయని తెలిపారు. ముఖ్యంగా జెన్‌జీ యువత లేవనెత్తుతున్న పలు అంశాలపై మేధోపరమైన చర్చలు నిర్వహిస్తామని చెప్పారు. అలాగే ఎస్ఐఆర్ పేరుతో కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న చర్యల ప్రజాస్వామిక ప్రభావాలపైనా చర్చిస్తామని మంత్రి వెల్లడించారు.

అటవీ ఆంక్షలతో ఆదివాసీ గూడాల్లో నరకం : సోయం బాపూరావు



(సిరికొండ, సాక్షర) ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు, విద్యుత్, మంచి నీరు, రోడ్డు సదుపాయాల కోసం అనుమతులు ఇవ్వాలని మాజీ ఎంపీ సోయం బాపూరావు డిమాండ్ చేశారు.ఆదివాసీ సమస్యలను పరిష్కరించాలని వంద మంది ఆదివాసులతో కలిసి జిల్లా అటవీ శాఖ అధికారికి మాజీ ఎంపీ, మాజీ ఎమ్మెల్యే, రాజ్ గోండ్ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షులు సోయం బాపూరావు వినతిపత్రం అందజేశారు.ఆదిలాబాద్ జిల్లా సిరికొండ మండలంలోని వాయిపేట్, సాత్ మోరి, లచ్చంపూర్, కోసుపటేల్ గూడా తదితర ఆదివాసీ గ్రామాల్లో అనేక ఇబ్బందులు ఉన్నాయని, గ్రామాల్లో కనీస మౌలిక వసతులైన తాగు, సాగు నీరు, విద్యుత్, సంకేతాలు లేక సమస్య తీవ్రంగా ఉందని తెలిపారు. ప్రభుత్వం మంజూరు చేసినప్పటికీ అటవీ శాఖ అధికారులు అడ్డుకోవడంతో ఆదివాసులు తీవ్ర అవస్థలకు గురవుతున్నారన్నారు.సిరికొండ మండలంలోని అనేక గ్రామాల్లో ఇప్పటికీ సంకేతాలు లేక ఆపద సమయంలో అంబులెన్స్ కు ఫోన్ చేయాలన్నా సంకేతాలు లేక ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. గ్రామాల్లో మంచినీటి కోసం బోర్లు, బావులు తవ్వాలన్నా అటవీ శాఖ అధికారులు అడ్డుపడడంతో చెరువు నీరు తాగి అనేక రోగాల బారిన పడి మృత్యువాత పడుతున్నామని ఆదివాసులు తమ గోడును వెళ్లబోసుకున్నారు.ప్రభుత్వం 100 శాతం కొలం గూడాల్లో ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసినప్పటికీ అటవీ అధికారులు అడ్డుకోవడంతో తమకు సొంత ఇంటి కల నెరవేరడం లేదన్నారు. గ్రామాల్లో ఇప్పటికే ఉన్న బావుల్లోని మట్టిని సైతం తీయనీయకుండా అటవీ అధికారులు అడ్డుకోవడం సమంజసం కాదని, ఇప్పటికైనా ఆదివాసుల సమస్యలను గుర్తించి తాగు నీరు, విద్యుత్, సంకేతాల కోసం టవర్ నిర్మాణానికి అనుమతులు ఇవ్వాలని విన్నవించారు.

ఎల్ నినో ప్రభావంతో ఆత్మహత్య చేసుకున్న కౌలు రైతు కుటుంబాలను ఆదుకోవాలి

- సంగెపు బొర్రన్న



(బేల, సాక్షర): ఎల్ నినో ప్రభావ తీవ్రత మూలంగా ఆత్మహత్య చేసుకున్న కౌలు రైతు కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం పరిహారం ఇచ్చి ఆదుకోవాలని రైతు స్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షులు సంగెపు బొర్రన్న కోరారు. బేల మండలంలోని సిర్సన్న గ్రామానికి చెందిన ఉరడే అవినాష్, పాటన్ గ్రామానికి చెందిన తిప్పరెడ్డి లస్మారెడ్డి అనే రైతులు గత కొన్ని రోజుల క్రితం మానసిక వేదనతో తాము సాగు చేస్తున్న కౌలుకు తీసుకున్న పంట భూమిలోనే పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న కుటుంబాలను సంగెపు బొర్రన్న, గ్రామ సర్పంచ్ సురేష్ రెడ్డితో కలిసి పరామర్శించారు. వ్యవసాయానికి చేసిన పంట పెట్టుబడి, దిగుబడులపై అధ్యయనం చేస్తూ, ఆర్థిక స్థితిగతులపై కుటుంబ సభ్యుల నుంచి సమాచారం తీసుకున్నారు.ఈ ఏడాదిలో ఎల్ నినో ప్రభావ తీవ్రత ఎక్కువగా ఉండడం మూలంగా వారు సాగు చేస్తున్న పంట భూమిలో సోయాబిన్, పత్తి పంట పండిస్తున్న క్రమంలో పంటలకు అయిన ఖర్చులకు ఆశించినంత పంట దిగుబడి రాలేదని కుటుంబ సభ్యుల ద్వారా తెలుసుకున్నారు. వాస్తవంగా గత సంవత్సరం అతి భారీ వర్షాల వలన పంట చేతికి రాక, ఈ ఏడాదిలో అత్యల్ప వర్షపాతం ఉండడంతో పంట అంతా ఎదగకుండా, మరో పక్క ప్రకృతి విపత్తుల ద్వారా పంటలకు అత్యల్ప వర్షపాతం నమోదు కావడంతో తాము సాగు చేసిన పంట భూమిలో ఆశించినంత పంట దిగుబడి రానందున, గత ఖరీఫ్ లో ఆశించినంత పంట దిగుబడి రానందున, ఈ ఏడాదిలో పంట ఎదుగుదల లేకపోవడంతో మనోవేదనకు గురై పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నారని తెలిపారు.ఈ కుటుంబాలకు మానవతా హృదయంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన జీవో నంబర్ 194 ప్రకారం ఆరు లక్షల రూపాయల పరిహారంతో పాటు ఈ కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించే విధంగా ప్రయత్నం చేయవలసిన అవసరం ఉందని ఆయన అన్నారు.కుటుంబ యజమానురాలికి నెలకు 5 వేల రూపాయల పింఛన్ ఇవ్వాలి. వీరి పిల్లలకు ఉన్నతమైన ఉచిత విద్య, వైద్య సదుపాయాలు అందించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం పూనుకోవాలి. గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ శాఖ వారు, రెవెన్యూ సిబ్బంది కలిసి రైతు ఆత్మహత్యలు జరగకుండా గ్రామ గ్రామాన అవగాహన సదస్సులు నిర్వహించాలి. ప్రతి రైతుకు ఆర్థిక భరోసా కల్పించే విధంగా చిరు ధాన్యాలపై, ఆకు కూరగాయలు, కోళ్ల పెంపకం, పాడి గేదెల, మేకల పెంపకాన్ని ప్రోత్సహించే విధంగా, నెలసరి ఆదాయం 15 వేల రూపాయలు ఉండే విధంగా ప్రయత్నం చేయవలసిన అవసరం ఉందని సంగెపు బొర్రన్న ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో సురేష్ రెడ్డి, ఆనంద్ రావు, రూపేష్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి శ్రీధర్ బాబుకు స్వాగతం పలికిన సోయం బాపూరావు



(ఆదిలాబాద్, సాక్షర): ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో నూతనంగా నిర్మించిన ఐటీ టవర్ ను ప్రారంభించేందుకు ఆదిలాబాద్ కు వచ్చిన తెలంగాణ ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుకు మాజీ ఎంపీ, మాజీ ఎమ్మెల్యే, రాజ్ గోండ్ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షులు సోయం బాపూరావు ఘన స్వాగతం పలికారు.బుధవారం స్థానిక ఏరోడ్రోమ్ హెలీప్యాడ్ వద్ద మంత్రికి పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికి శాలువాతో సత్కరించారు.

పండగ వచ్చింది... మనిషి మారాడా?

మాల మెడలోనేనా? మానవత్వం మనసులో లేదా? భక్తి ఆడంబరంలో కాదు... ఆచరణలో కనిపించాలి! దీపావళి వెళ్లిపోయింది. కార్తీక మాసం వచ్చింది. అయ్యప్ప మాలధారణలు మొదలయ్యాయి. ఆలయాల్లో పూజలు, అభిషేకాలు, భజనలు, బ్రహ్మోత్సవాలతో ఆధ్యాత్మిక వాతావరణం కనిపిస్తోంది. ఇళ్ల ముందు దీపాలు వెలుగుతున్నాయి. దేవాలయాలు భక్తులతో కళకళలాడుతున్నాయి. ఇదంతా మన సంస్కృతిలో భాగం. మన సంప్రదాయాలకు ప్రతీక.కానీ ఈ సందడిలో మనల్ని మనం ఒక్కసారి ప్రశ్నించుకోవాలి. దీపావళి దీపాలు ఇళ్లలో వెలిగాయి... మరి మనిషి మనసులో వెలుగు నిండిందా? కార్తీక దీపాలు వెలిగిస్తున్నాం... మనలోని అహంకారం, అసూయ, ద్వేషం అనే చీకట్లను తొలగించగలిగామా? ఇదే నేటి సమాజం ముందున్న అసలైన ప్రశ్న! భక్తి అంటే ఆడంబరమా? ఆచరణా? రోడ్డుపక్కన ఆకలితో ఒక మనిషి కనిపిస్తే పట్టించుకోకుండా వెళ్లిపోతాం. అదే సమయంలో దేవుడి దర్శనం కోసం గంటల తరబడి క్యూలో నిలబడతాం. దేవుడికి వంద కొబ్బరికాయలు కొడతాం. వేల రూపాయల కానుకలు సమర్పిస్తాం. కానీ పక్కింట్లో కష్టాల్లో ఉన్న కుటుంబానికి ఒక్క రూపాయి సాయం చేయడానికి మాత్రం వెనుకాడతాం.దేవుడికి సమర్పించే నైవేద్యం కంటే ఆకలితో ఉన్నవారికి పెట్టే అన్నం విలువైనది కాదా? గుడిలో వెలిగించే దీపం కంటే నిరాశలో ఉన్న మనిషి జీవితంలో వెలుగు నింపడం గొప్పది కాదా? దేవుడు ఎక్కడున్నాడనే దానిపై మనకు ఎన్నో విశ్వాసాలు ఉండవచ్చు. కానీ బాధలో ఉన్న మనిషికి అండగా నిలబడటంలోనే మానవత్వానికి నిజమైన అర్థం కనిపిస్తుంది. నిజమైన భక్తి గుడి గోడల మధ్యనే ఉండకూడదు అది మన గుండెల్లో ఉండాలి. మన ప్రవర్తనలో కనిపించాలి. మన చేతల్లో ప్రతిఫలించాలి. సమాజంలో తగ్గుతున్న మానవ సంబంధాలు! ఈరోజు మనిషి ఎంతో అభివృద్ధి చెందాడు. చేతిలో స్మార్ట్‌ఫోన్ ఉంది. ప్రపంచం అరచేతిలోకి వచ్చింది. సాంకేతికత పెరిగింది. సంపాదన పెరిగింది. సౌకర్యాలు పెరిగాయి. కానీ మనుషుల మధ్య ఆత్మీయత మాత్రం తగ్గుతున్నట్లు కనిపిస్తోంది.పక్కింట్లో ఏం జరుగుతుందో తెలియదు. ఎదురింటి మనిషి కష్టాల్లో ఉన్నా పలకరించే తీరిక లేదు. ఒకే కుటుంబంలో ఉన్నవారికి కూడా మనసు విప్పి మాట్లాడుకునే సమయం దొరకడం లేదు.సోషల్ మీడియాలో వందలాది మందికి శుభాకాంక్షలు చెబుతున్నాం. కానీ ఎదురుగా కనిపించే మనిషిని చిరునవ్వుతో పలకరించలేకపోతున్నాం. ఇదే మన సమాజం ఆలోచించాల్సిన అంశం.డబ్బు సంపాదించడం తప్పు కాదు. అభివృద్ధి సాధించడం అవసరమే. కానీ ఆ ప్రయాణంలో మనిషిని, మనసును, మానవ సంబంధాలను కోల్పోతే ఆ అభివృద్ధికి అర్థం ఏముంటుంది? మాలధారణతో పాటు మనసులోనూ మార్పు రావాలి! అయ్యప్ప దీక్ష అనేది కేవలం నల్లని వస్త్రాలు ధరించడం, మాల వేసుకోవడం, నియమాలు పాటించడం మాత్రమే కాదు. అది క్రమశిక్షణకు, సహనానికి, సమానత్వానికి, ఆత్మనిగ్రహానికి ప్రతీక.దీక్షలో ఉన్నప్పుడు ప్రతి ఒక్కరినీ స్వామి అని పిలుస్తాం. కులం, మతం, ఆర్థిక స్థితి



అనే తేడాలు లేకుండా ఒకరినొకరు గౌరవిస్తాం. మరి ఆ సమానత్వ భావన దీక్ష ముగిసిన తర్వాత కూడా కొనసాగకూడదా? మాల వేసుకున్నాం... మనసులోనూ మంచితనాన్ని నింపుకుందాం! దీక్ష చేశాం... దయను కూడా ఆచరిద్దాం! నియమాలు పాటిస్తున్నాం... మన మాటల్లోనూ నిజాయితీని పాటిద్దాం! కార్తీక మాసంలో ఉపవాసం చేస్తున్నాం... పక్కవాడి ఆకలిని కూడా గుర్తిద్దాం! పండగకు నిజమైన అర్థం మనిషికి మనిషి తోడైనప్పుడే! ఈరోజు మన చుట్టూ ఎన్నో సమస్యలున్నాయి. అప్పుల బాధతో సతమతమవుతున్న రైతు ఉన్నాడు. చదువు పూర్తిచేసుకుని ఉద్యోగం కోసం ఎదురుచూస్తున్న యువత ఉంది. వైద్య ఖర్చులు భరించలేక ఇబ్బందులు పడుతున్న పేద కుటుంబాలున్నాయి. వృద్ధాప్యంలో ఆదరణకు నోచుకోని తల్లిదండ్రులున్నారు. ఒంటరితనంతో బాధపడుతున్న మనుషులున్నారు.వారికి మనం చేయగలిగిన చిన్న సహాయం కూడా ఎంతో విలువైనది.రైతు కష్టాల్లో ఉంటే అండగా నిలుద్దాం. ఉద్యోగం కోసం తిరుగుతున్న యువతకు తెలిసిన మార్గం చూపిద్దాం. పేద విద్యార్థికి పుస్తకం కొనిద్దాం. అనారోగ్యంతో బాధపడుతున్నవారికి తోడుగా నిలుద్దాం. ఒంటరిగా ఉన్న వృద్ధుడిని పలకరిద్దాం. మన వల్ల మరొకరి ముఖంలో చిరునవ్వు వస్తే అదే నిజమైన పండగ.సమాజంలో మార్పు రావాలని ప్రభుత్వాలను, నాయకులను ప్రశ్నించడం ఎంత ముఖ్యమో, మనలో మనం మారడం కూడా అంతే ముఖ్యం. ప్రతి సమస్యకు ప్రభుత్వం మాత్రమే పరిష్కారం చూపాలని ఎదురుచూడకుండా, మన పరిధిలో మనం చేయగలిగిన మంచిని ప్రారంభించాలి. చివరగా ఒక్క మాట... పండగలు ప్రతి సంవత్సరం వస్తాయి. దీపాలు ప్రతి కార్తీకంలో వెలుగుతాయి. మాలధారణలు ప్రతి ఏడాది జరుగుతాయి. పూజలు, వ్రతాలు, దీక్షలు మన సంప్రదాయంలో కొనసాగుతూనే ఉంటాయి. కానీ వీటన్నింటి వల్ల మనిషిలో మంచితనం పెరుగుతోందా? ఎదుటివారి బాధను అర్థం చేసుకునే హృదయం ఏర్పడుతోందా? అన్నదే అసలైన కొలమానం.గుడికి వెళ్లడం మానేయమని కాదు. పూజలు చేయవద్దని కాదు. భక్తిని తగ్గించమని అసలే కాదు. భక్తికి మానవత్వాన్ని జోడించమని మాత్రమే ఈ సమాజానికి విజ్ఞప్తి! దేవుడికి పూలు సమర్పించే చేతులతోనే కష్టాల్లో ఉన్నవారికి చేయూతనిద్దాం. దేవుడి ముందు తలవంచే మనసుతోనే ఎదుటివారి బాధను గౌరవిద్దాం. ఎందుకంటే... దీపం వెలిగించడం ఒక ఆచారం... మనిషి జీవితంలో వెలుగు నింపడం ఒక బాధ్యత! మాల మెడలో ఉండటం దీక్ష... మానవత్వం మనసులో ఉండటం సంస్కారం! దేవుడిని ఆరాధించడం భక్తి... దేవుడి సృష్టిని ప్రేమించడం మానవత్వం! ఈ కార్తీక మాసంలో మనమంతా ఒక చిన్న సంకల్పం చేద్దాం. ఒకరికి ఒకరం అండగా నిలుద్దాం. మనిషిని మనిషిగా గౌరవిద్దాం. మనలోని స్వార్థాన్ని తగ్గించుకుందాం. సమాజంలో ప్రేమ, దయ, సహనం, సేవాభావం పెంపొందిద్దాం. అప్పుడే పండగకు పరిపూర్ణత. అప్పుడే దీక్షకు సార్థకత. అప్పుడే మనిషిగా పుట్టినందుకు నిజమైన అర్థం! స్వామియే శరణం అయ్యప్ప!



వ్యాసకర్త: ఉక్కల్ కర్ రాజేందర్ నాథ్,
ఫ్రీలాన్స్ జర్నలిస్ట్ -9440287170

ఎల్ నినో పరిస్థితుల్లో వ్యాపారులు మానవతా దృక్పథంతో వ్యవహరించాలి జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



(చెన్నూర్, సాక్షర) ఎల్ నినో పరిస్థితుల్లో బియ్యం వ్యాపారులు మానవతా దృక్పథంతో వ్యవహరించి ప్రజలకు బియ్యం ధరలను అందుబాటులో ఉంచాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం జిల్లాలోని భీమారం మండల కేంద్రంలో సమత రైస్ డిపో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బియ్యం విక్రయ కేంద్రాన్ని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు, జిల్లా పౌర సరఫరాల అధికారి వేణుగోపాల్, మండల తహసిల్దార్ సదానందంతో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎల్ నినో ప్రభావం వల్ల ప్రస్తుతం మార్కెట్లో నెలకొని ఉన్న పరిస్థితుల నేపథ్యంలో బియ్యం వ్యాపారులు, వర్తకులు అందరూ మానవతా దృక్పథంతో వ్యవహరిస్తూ ప్రజలకు బియ్యం ధరలను అందుబాటులో ఉంచాలని, తనిఖీల కోసం వచ్చే బృందాలకు వ్యాపారులు, వర్తకులు సహకరించాలని తెలిపారు. 26 కిలోల బరువుతో కూడిన బీపీటీ బియ్యం బస్తాను రూ.1,352, బీపీటీ స్టీమ్ బియ్యం రూ.1,482, బీపీటీ పాత బియ్యం రూ.1,638, హెచ్ఎంటీ పాత బియ్యం బస్తా రూ.1,950, జేఎస్ఆర్ పాత బియ్యం రూ.1,976 చొప్పున విక్రయ కేంద్రం ద్వారా నిబంధనల ప్రకారం విక్రయించాలని నిర్వాహకులకు సూచించారు.అనంతరం చెన్నూర్ పట్టణంలోని అంబేద్కర్ చౌక్, గాంధీ చౌక్లలో శ్రీ లక్ష్మీ ట్రేడర్స్ రైస్ డిపో, దేవుడా రైస్ డిపో వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బియ్యం విక్రయ కేంద్రాలను జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు, జిల్లా పౌర సరఫరాల అధికారి వేణుగోపాల్, మండల తహసిల్దార్ మల్లికార్జున్, మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్ తో కలిసి ప్రారంభించారు. 26 కిలోల బరువుతో కూడిన బీపీటీ కొత్త బియ్యం బస్తాను రూ.1,430, బీపీటీ స్టీమ్ బియ్యం రూ.1,612, హెచ్ఎంటీ స్టీమ్ బియ్యం రూ.1,898, హెచ్ఎంటీ పాత బియ్యం బస్తా రూ.1,976, జేఎస్ఆర్ పాత బియ్యం రూ.2,028 చొప్పున నిర్ణీత గరిష్ఠ ధరలకు విక్రయించాలని తెలిపారు.మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి పాఠశాలలో కొనసాగుతున్న అదనపు తరగతి గదుల నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించారు. నిర్మాణ పనులను నిర్ణీత ప్రమాణాలతో, నాణ్యతకు ప్రాధాన్యతనిస్తూ త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. పనుల్లో ఎలాంటి జాప్యం జరగకుండా నిరంతరం పర్యవేక్షించాలని, అవసరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు.పాఠశాలలో విద్యార్థినులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి ప్రభుత్వం నిర్దేశించిన వంటకాల పట్టిక ప్రకారం ప్రతిరోజూ భోజనం అందించాలని, భోజనం నాణ్యత, వంటశాల పరిసరాలు, పరిశుభ్రత తదితర అంశాలను సమర్థవంతంగా చేపట్టాలని తెలిపారు. విద్యార్థినులకు నిర్ణీత వంటకాల పట్టిక ప్రకారం పౌష్టికాహారంతో కూడిన నాణ్యమైన భోజనం అందించాలని, ఆహార పదార్థాల తయారీలో పరిశుభ్రత పాటించాలని సిబ్బందికి సూచించారు.మండల తహసిల్దార్ కార్యాలయాన్ని సందర్శించి తహసిల్దార్ మల్లికార్జున్ తో కలిసి జీవో నంబర్ 76, 58, 59 క్రింద వచ్చిన దరఖాస్తులు, భూ భారతి కార్యక్రమం, భూముల రీ సర్వే, కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలకు సంబంధించిన అంశాలను పరిశీలించారు. జీవో నంబర్ 58, 59 లకు సంబంధించిన దరఖాస్తుల స్థితిగతులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, అర్హత కలిగిన లబ్ధిదారులకు నిబంధనల ప్రకారం ప్రయోజనాలు అందేలా చూడాలని సూచించారు. భూ భారతి కార్యక్రమంలో భాగంగా భూ సమస్యలకు సంబంధించిన దరఖాస్తులను పరిశీలించి, పరిష్కారానికి అవసరమైన చర్యలు వేగవంతం చేయాలని తెలిపారు. రీ సర్వేకు సంబంధించిన పనులను ప్రణాళికాబద్ధంగా పూర్తి చేయాలని, భూ రికార్డుల నిర్వహణలో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల క్రింద పెండింగ్లో ఉన్న దరఖాస్తులను పరిశీలించి, అర్హులైన లబ్ధిదారులకు పథకం ఫలాలు మంజూరు చేసేందుకు అవసరమైన ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ వేగవంతం చేయాలని, నిర్ణీత గడువులోగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకలు



(ఆదిలాబాద్, సాక్షర): ఆదిలాబాద్ పట్టణంలో కలెక్టరేట్ సమావేశ మందిరంలో బుధవారం నిర్వహించిన జాతీయ విద్యా దినోత్సవాన్ని పురస్కరించుకొని మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి అదనపు కలెక్టర్లు ఆర్.ఎస్. చిత్రూ, ఎస్. రాజేశ్వర్, ఆదిలాబాద్ మున్సిపల్ చైర్పర్సన్ బండారి అనూష సతీష్, ఆదిలాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి ఘనంగా నివాళులు అర్పించారు.కార్యక్రమంలో వైస్ చైర్మన్ రోహిత్, మైనారిటీ సంక్షేమ అధికారి అబ్దుల్ కలీం, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ మనోహర్, విద్యా, ఇతర శాఖల అధికారులు, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

తపాలాపూర్ యూత్ నూతన కమిటీ ఎన్నిక



(జన్నారం, సాక్షర) జన్నారం మండలంలోని తపాలాపూర్ యూత్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. బుధవారం గ్రామంలోని యువకులందరూ ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసుకొని నూతన సంఘాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.నూతన కమిటీ అధ్యక్షులుగా సుంకం వంశీ, ఉపాధ్యక్షులుగా సొదాని హరీష్, ప్రధాన కార్యదర్శులుగా పప్ప అభిలాష్, మామిడి వినయ్, కోశాధికారిగా పాదం రాకేశ్, ప్రచార కార్యదర్శులుగా సల్ల అరుకాలు, శాఖాపురపు అజయ్, నిర్వహణ కార్యదర్శులుగా గుంటుకు మహేష్, దుర్గం ప్రసాద్, పీఆర్వోలుగా అల్లంల కిరణ్, మైలారపు దుర్గయ్య, సామాజిక మాధ్యమ బాధ్యులుగా అడల అజయ్, మైదం అభిలాష్, చిలుక మనోహర్, సలహాదారులుగా అల్లంల శ్రీను, పాదం గట్టుస్వామి, ఆర్గల రాకేశ్, ఆరోగ్య సమన్వయకర్తలుగా ఏనుగుల వంశీ, పప్ప రవితేజ, వ్యవసాయ సమన్వయకర్తలుగా పుట్టకొక్కుల మహేష్, గంట శ్రీను, సామాజిక సమన్వయకర్తలుగా చిరుత మనోహర్, పెంకర్ల రాజు, విద్యా సమన్వయకర్తగా దండిగే రాకేశ్, సాంస్కృతిక కార్యకర్తలుగా మారిశెట్టి సాయికృష్ణ, పెరదొండ రాజు ఎన్నికయ్యారు.ఈ సందర్భంగా నూతన కమిటీ మాట్లాడుతూ గ్రామంలోని యువకులందరం గ్రామ అభివృద్ధికి, గ్రామంలోని ప్రజల సమస్యల పరిష్కారం కోసం అహర్నిశలు కృషి చేస్తామని తెలిపారు.

డ్రైనేజీ సమస్య పరిష్కారానికి రోడ్డెక్కిన ప్రజలు

(హైదరాబాద్, సాక్షర): రోడ్లపై పొంగిపొర్లుతున్న డ్రైనేజీ సమస్యను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ హయత్ నగర్ డివిజన్ కి చెందిన 10 కాలనీల ప్రజలు రోడ్డుపై బైఠాయించి నిరసన ధర్నా చేపట్టారు. మూడు సంవత్సరాల క్రితం సాంక్షన్ అయిన డ్రైనేజీ పనులను ప్రారంభించకుండా అలసత్వం వహిస్తున్న అధికారులు వెంటనే వచ్చి సమస్య పరిష్కారం చేయాలని కాలని వాసులు డిమాండ్ చేశారు. ఈ ధర్నా కార్యక్రమంలో హయత్ నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ నవజీవన్ రెడ్డి పాల్గొని రోడ్డుపై స్థానిక ప్రజలతో కలసి బైఠాయించారు. పక్కనే ఉన్న స్కూల్ విద్యార్థులు డ్రైనేజీ వల్ల అనారోగ్యం పాలై అంటు రోగాలకు గురవుతున్నారన్నారు. ఈ డ్రైనేజీ వల్ల దాదాపు 15 కాలనీ ప్రజలు తీవ్ర ఇబ్బందికి గురవుతున్నారన్నారు. పలుమార్లు సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లిన కాలయాపన చేయడం జరుగుతుందన్నారు. అధికారులు వెంటనే స్పందించి పనులు ప్రారంభించాలని జీవన్ రెడ్డి అన్నారు. అధికారులు సమస్యను పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున రోడ్డుపై బైఠాయించి వంటావార్పు కార్యక్రమంను చేపడతామని హెచ్చరించారు.

ఆజాద్ సేవలు చిరస్మరణీయం : నరేష్ జాదవ్

- జాతీయ విద్యా దినోత్సవ వేడుకల్లో ఘన నివాళి



(ఆదిలాబాద్‌టౌన్, సాక్షర) మత సామరస్యం, జాతీయ సమైక్యతకు ఆజాద్ ప్రతీకగా నిలిచారని డీసీసీ అధ్యక్షులు నరేష్ జాదవ్ అన్నారు.ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో భారత స్వాతంత్ర్య సమరయోధుడు, దేశ తొలి విద్యాశాఖ మంత్రి, భారతరత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ 138వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి, మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు డాక్టర్ నరేష్ జాదవ్, మాజీ డీసీసీ అధ్యక్షులు సాజిద్ ఖాన్, మాజీ డీసీసీ జనరల్ సెక్రటరీ గండ్రత్ సుజాత, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ అల్లూరి సంజీవ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షులు డాక్టర్ నరేష్ జాదవ్ మాట్లాడుతూ భారత స్వాతంత్ర్య పోరాటంలో మౌలానా అబుల్ కలాం ఆజాద్ తనదైన చెరగని ముద్ర వేశారని, మహాత్మా గాంధీ, జవహర్ లాల్ నెహ్రూ వంటి జాతీయ నాయకులతో కలిసి బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా పోరాడారని తెలిపారు. స్వాతంత్ర్య ఉద్యమంలో పలుమార్లు జైలు జీవితాన్ని అనుభవించినప్పటికీ దేశ స్వాతంత్ర్యం కోసం తన పోరాటాన్ని కొనసాగించారని పేర్కొన్నారు.స్వాతంత్ర్యం అనంతరం భారతదేశ తొలి విద్యాశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టి, దేశ విద్యారంగ అభివృద్ధికి బలమైన పునాదులు వేశారని కొనియాడారు. ముఖ్యంగా ప్రతి ఒక్కరికీ విద్య అందుబాటులో ఉండాలని, 14 సంవత్సరాల లోపు పిల్లలకు ఉచిత నిర్బంధ విద్య అందించాలని, మహిళా విద్య, సాంకేతిక విద్య, ఉన్నత విద్యకు ప్రాధాన్యత కల్పించాలని ఆయన కృషి చేశారని తెలిపారు. దేశంలో విద్యా వ్యవస్థను బలోపేతం చేయడంలో ఆయన పాత్ర చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని అన్నారు.మత సామరస్యం, జాతీయ సమైక్యత, లౌకికవాదం, భిన్నత్వంలో ఏకత్వం వంటి గొప్ప విలువలకు మౌలానా ఆజాద్ ప్రతీకగా నిలిచారని, ఆయన ఆశయాలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని డాక్టర్ నరేష్ జాదవ్ పేర్కొన్నారు.భారతదేశ విద్యా, సాంస్కృతిక రంగాలకు ఆయన చేసిన సేవలకు గుర్తింపుగా ఆయన జన్మదినమైన నవంబర్ 11వ తేదీని జాతీయ విద్యా దినోత్సవంగా జరుపుకోవడం ఆయనకు దేశం అందిస్తున్న గౌరవమని తెలిపారు. మౌలానా అబుల్ కలాం ఆజాద్ జీవితం, దేశభక్తి, విద్యారంగానికి ఆయన చేసిన సేవలు ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని, ఆయన ఆశయాల సాధనకు కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ కృషి చేస్తుందని డాక్టర్ నరేష్ జాదవ్ అన్నారు. కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు ఖిజర్ పాషా, తెలంగాణ రాష్ట్ర ఎస్సీ విభాగ వైస్ ప్రెసిడెంట్ దుర్గం శేఖర్, ఆదిలాబాద్ ఆత్మ కమిటీ చైర్మన్ గిమ్మ సంతోష్ రావు, ఆదిలాబాద్ జిల్లా ఎస్సీ విభాగం అధ్యక్షులు పరమేశ్వర్, రాష్ట్ర ఎస్టీ విభాగ ఉపాధ్యక్షులు సేద్మకి ఆనంద్ రావు, ఆదిలాబాద్ జిల్లా ఫ్రంటల్ ఆర్గనైజేషన్ కోఆర్డినేటర్ డేరా కృష్ణారెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఆఫీసు ఇంచార్జ్ గౌలి సంజీవ్ కుమార్, ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ లీగల్ సెల్ అధ్యక్షులు దేవుతాడే మంగేష్, ఆదిలాబాద్ జిల్లా సేవాదళ్ అధ్యక్షులు మోతి రామ్, ఆదిలాబాద్ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ ప్రెసిడెంట్ నాహీద్, కలీం, శ్రీలేఖ ఆదివాసి, జిల్లా కాంగ్రెస్ జనరల్ సెక్రటరీలు, సెక్రటరీలు, కాంగ్రెస్ పార్టీ మైనారిటీ విభాగ నాయకులు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు, వార్డు ప్రెసిడెంట్లు, ప్రజాప్రతినిధులు, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

బెల్లంపల్లి ఏరియాలో డైరెక్టర్ వెంకటేశ్వర్లు పర్యటన



(రెబ్బెన, సాక్షర): బెల్లంపల్లి ఏరియాలో బుధవారం సింగరేణి డైరెక్టర్ ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్స్ కే.వెంకటేశ్వర్లు ఏరియా జిఎం ఎం.శ్రీరమేష్ తో కలిసి పర్యటించారు.వ్యూ పాయింట్ నుండి త్వరలో ప్రారంభం కానున్న గోలేటి ఉపరితల గని పని స్థలాలు, విస్తరణ ప్రదేశాలను పరిశీలించారు.ఓసి అనుమతులు,చేయాల్సిన పనుల విషయంలో ఏరియా అధికారులకు పలు సూచనలు చేశారు.అనంతరం జిఎం కార్యాలయంలో అన్ని విభాగాల అధిపతులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.సాయంత్రం ఖైరిగుర ఓపెన్ కాస్ట్ పనిస్థలాలను వ్యూ పాయింట్ నుండి సందర్శించారు.5స్టార్ రేటింగ్ సాధించినందుకు అధికారులను అభినందించారు. వార్షిక బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను నాణ్యతతో సాధించాలని అన్నారు. కార్యక్రమంలో ఖైరిగుర పిఓ మచ్చగిరి నరేందర్,ఇంచార్జీ ఏరియా ఇంజినీర్ జ్ఞానేశ్వర్,ప్రాజెక్ట్ ఇంజినీర్ నరేష్,ఖైరీగుర ఓసి ఇంచార్జీ మేనేజర్ గౌతం రాజేష్,గోలేటి మేనేజర్ మహేష్, ఏరియా ఇంచార్జీ సెక్యూరిటీ అధికారి రాజేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

మౌలానా ఆజాద్ కు ఘన నివాళులు

- జాతీయ విద్యా దినోత్సవం సందర్భంగా చిత్రపటానికి పూలమాలలు వేసిన అదనపు కలెక్టర్లు



(ఆదిలాబాద్, సాక్షర) జాతీయ విద్యా దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్లు ఆర్.ఎస్. చిత్రు, ఎస్. రాజేశ్వర్ ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూష, ఆదిలాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి, వైస్ చైర్మన్ రోహిత్, మైనారిటీ సంక్షేమ అధికారి అబ్దుల్ కలీం, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ మనోహర్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రైతులను వేధించడం సరికాదు..

- మాజీ మంత్రి జోగు రామన్న డీసీసీబీ అధికారులు వైఖరి మార్చుకోవాలి...రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి



(ఆదిలాబాద్, సాక్షర) కరువు పరిస్థితులను ఎదుర్కొంటున్న ఆదిలాబాద్ జిల్లా రైతాంగాన్ని డీసీసీబీ బ్యాంకు అధికారులు రుణాల వసూళ్ల పేరుతో ఇబ్బందులకు గురిచేయడం సమంజసం కాదని మాజీ మంత్రి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న అన్నారు. ఎల్ నినో ప్రభావంతో రైతులు తీవ్రంగా నష్టపోయి ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న తరుణంలో, బ్యాంకు అధికారులు రైతు కుటుంబాల ఇళ్లకు వెళ్లి రుణాలు చెల్లించాలని ఒత్తిడి చేయడం సరికాదన్నారు. బ్యాంకు అధికారులు తమ వైఖరిని మార్చుకోవాలని హెచ్చరించారు.బుధవారం జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎల్ నినో ప్రభావంతో జిల్లా రైతాంగం పంటలను పూర్తిగా నష్టపోయి తీవ్ర ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం కరువు ప్రాంతంగా ప్రకటించినప్పటికీ ఇప్పటివరకు రైతు కుటుంబాలకు ఎలాంటి నష్టపరిహారం అందించకపోవడం విచారకరమన్నారు. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో రైతులకు అండగా నిలవాల్సిన ప్రభుత్వం, బ్యాంకుల ద్వారా రుణాల వసూళ్లకు ఒత్తిడి చేయించడం తగదన్నారు.ఒకవైపు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క బ్యాంకు అధికారులతో చర్చలు జరుపుతుండగా, మరోవైపు రైతులను రుణాలు చెల్లించాలంటూ వేధించడం ప్రభుత్వ ద్వంద్వ వైఖరికి నిదర్శనమని విమర్శించారు.గత కేసీఆర్ ప్రభుత్వ హయాంలో మహారాష్ట్ర రైతులు సైతం తెలంగాణలో పత్తి విక్రయించుకునే పరిస్థితి ఉండేదని గుర్తు చేశారు. కానీ నేడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాల కారణంగా విదేశాల నుంచి పత్తి దిగుమతులు పెరిగి తెలంగాణ రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆరోపించారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతులకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవడంలో పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. పత్తి, సోయా పంటలకు ఎకరాకు రూ.25 వేల చొప్పున, ఇతర పంటలకు రూ.20 వేల చొప్పున నష్టపరిహారం అందిస్తామని ప్రకటించి, ఇప్పటివరకు ఒక్క రూపాయి కూడా చెల్లించలేదన్నారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో అందించిన రూ.10 వేల పంట నష్టపరిహారాన్ని విమర్శించిన కాంగ్రెస్ ప్రభుత్వం, అంతకంటే ఎక్కువ పరిహారం ఇస్తామని చెప్పి రైతులను మోసం చేసిందని మండిపడ్డారు.జిల్లా పర్యటనకు వస్తున్న మంత్రి శ్రీధర్ బాబు దృష్టికి బీఆర్ఎస్ పార్టీ తరఫున రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను తీసుకెళ్తామని తెలిపారు. స్థానిక ఎంపీ, ఎమ్మెల్యేలు రాజకీయ చర్చలకే పరిమితం కాకుండా రైతుల సమస్యలపై ఢిల్లీకి వెళ్లి కేంద్ర ప్రభుత్వంతో చర్చలు జరపాలని సూచించారు. జిల్లా రైతాంగం తీవ్ర ఇబ్బందుల్లో ఉంటే వారికి అండగా నిలవాల్సిన ప్రజాప్రతినిధులు రాజకీయాల్లో మునిగితేలడం వారి చిత్తశుద్ధిని ప్రశ్నిస్తోందని జోగు రామన్న విమర్శించారు. సమావేశంలో యూనిస్ అక్బని, గంగారెడ్డి, దేవన్న, సేవ్వా జగదీష్, బట్టు సతీష్, కొమురా రాజు, అప్కామ్ గంగయ్య, దయానంద్, కడప తిరుపతి, దివిటి రాజు, లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

త్వరలోనే జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు


- హైదరాబాద్ లో పూర్తవగానే జిల్లాల్లో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి



(హైదరాబాద్/ ఆదిలాబాద్ సాక్షర) రాష్ట్ర రాజధాని హైదరాబాద్ లో పనిచేస్తున్న అర్హులైన జర్నలిస్టులకు త్వరలోనే ఇళ్ల స్థలాలను అందించేందుకు చర్యలు చేపట్టినట్లు రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు.బుధవారం సచివాలయంలో తెలంగాణ రాష్ట్ర పనిచేస్తున్న జర్నలిస్టుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె. విరాహత్ అలీ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. రాంనారాయణల నేతృత్వంలో సంఘ ప్రతినిధి బృందం మంత్రిని కలిసి, ఇటీవల జరిగిన తమ సంఘ రాష్ట్ర కార్యవర్గ తీర్మానాలతో కూడిన వినతి పత్రాన్ని అందించింది.జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల విషయంలో ఇటీవల ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, రాష్ట్ర సమాచార, రెవెన్యూ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిలు చేసిన సానుకూల ప్రకటనపై తమ సంఘ కార్యవర్గ సమావేశం కృతజ్ఞతలు తెలపడంతో పాటు ఈ ప్రక్రియను వేగవంతం చేసి జర్నలిస్టుల్లో నెలకొన్న ఆందోళనకు తెరదించాలని ప్రభుత్వాన్ని కోరుతూ తీర్మానం చేసినట్లు విరాహత్ అలీ, రాంనారాయణలు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. అలాగే మరో ప్రధాన సమస్య అయిన ఆరోగ్య పథకాన్ని అమలు చేసి, జర్నలిస్టుల ప్రాణాలకు ప్రభుత్వం భద్రత కల్పించాలని తమ సంఘం చేసిన తీర్మానాన్ని వారు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.దీనిపై మంత్రి స్పందిస్తూ ముందుగా హైదరాబాద్ లో పనిచేస్తున్న జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్యను పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని, త్వరలోనే ఇళ్ల స్థలాలు అందిస్తామన్నారు. ఈ ప్రక్రియ పూర్తి అయిన వెంటనే జిల్లాల్లో పనిచేస్తున్న జర్నలిస్టులకు కూడా ఇళ్ల స్థలాలు అందించేందుకు చర్యలు చేపడతామని శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు.మంత్రిని కలిసిన ప్రతినిధి బృందంలో సంఘ రాష్ట్ర కార్యదర్శి కొంపల్లి శ్రీకాంత్ రెడ్డి, రాష్ట్ర కోశాధికారి మోతే వెంకట్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఏ. రాజేష్ ఉన్నారు.

కార్యక్రమాలకు చిన్నారెడ్డి దూరం...

- తెలంగాణ కాంగ్రెస్‌లో మరో సీనియర్ నేత వ్యవహారం చర్చనీయాంశంగా మారింది.
- సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న మాజీ మంత్రి, సీనియర్ నాయకుడు డాక్టర్ జీ. చిన్నారెడ్డి ప్రస్తుతం పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉండటం రాజకీయ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది.



(వరంగల్, సాక్షర): గతంలో కాంగ్రెస్ పార్టీలో కీలక పదవులు నిర్వహించిన ఆయన.. ఇటీవల చోటుచేసుకున్న పరిణామాల తర్వాత మౌనం పాటిస్తుండటంతో అసలు ఏం జరుగుతోందనే చర్చ మొదలైంది. మాజీ మంత్రి జీవన్‌రెడ్డి తరహాలో చిన్నారెడ్డి కూడా పార్టీకి దూరమయ్యే ఆలోచనలో ఉన్నారా? అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి.డాక్టర్ జీ. చిన్నారెడ్డికి కాంగ్రెస్ పార్టీలో సుదీర్ఘ రాజకీయ ప్రస్థానం ఉంది. 1985 నుంచి ఎన్నికల రాజకీయాల్లో కొనసాగుతున్న ఆయనకు పార్టీ పలుమార్లు అవకాశాలు కల్పించింది. మొత్తం ఎనిమిదిసార్లు ఎమ్మెల్యేగా, ఒకసారి గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీగా పోటీ చేసే అవకాశం ఇచ్చింది. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో మంత్రిగా కూడా పనిచేశారు. ఉమ్మడి రాష్ట్రంలో యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా, తెలంగాణ ఏర్పడిన తర్వాత పీసీసీ క్రమశిక్షణ కమిటీ చైర్మన్‌గా బాధ్యతలు నిర్వహించారు. రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడిగానూ పనిచేశారు.పార్టీ అధిష్ఠానానికి సన్నిహితుడిగా గుర్తింపు పొందిన చిన్నారెడ్డి.. ఇటీవల వనపర్తి రాజకీయ పరిణామాల నేపథ్యంలో వార్తల్లో నిలిచారు. ప్రస్తుత ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, పార్టీ వ్యవహారాలపై ఆయన చేసిన వ్యాఖ్యలు కాంగ్రెస్‌లో చర్చకు దారితీశాయి. ఈ పరిణామాల నేపథ్యంలో ఆయన పార్టీ క్రమశిక్షణ కమిటీ ముందు వివరణ ఇచ్చుకోవాల్సి వచ్చింది. అనంతరం రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్ష పదవి నుంచి ప్రభుత్వం తొలగించింది. దీంతో చిన్నారెడ్డి రాజకీయ ప్రస్థానంలో కొత్త పరిణామాలు చోటుచేసుకున్నాయి.ప్రణాళిక సంఘం ఉపాధ్యక్ష పదవి నుంచి తొలగించిన తర్వాత చిన్నారెడ్డి రాజకీయంగా మౌనం పాటిస్తున్నారనే చర్చ పార్టీ వర్గాల్లో జరుగుతోంది. హైదరాబాద్‌లోనూ, ఢిల్లీలోనూ పార్టీ నిర్వహిస్తున్న పలు కార్యక్రమాల్లో ఆయన కనిపించడం లేదని నేతలు చర్చించుకుంటున్నారు. ముఖ్యంగా పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉండటం ఇప్పుడు రాజకీయ ప్రాధాన్యత సంతరించుకుంది.ఇదే సమయంలో కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ మంత్రి జీవన్‌రెడ్డి పార్టీతో విభేదాల నేపథ్యంలో తీసుకున్న రాజకీయ నిర్ణయాలు కూడా చర్చకు వస్తున్నాయి. చిన్నారెడ్డి కూడా అదే దారిలో పయనిస్తారా? పార్టీపై అసంతృప్తితోనే మౌనం వహిస్తున్నారా? లేక ప్రస్తుత పరిణామాలు సద్దుమణిగే వరకు వేచి చూస్తున్నారా? అనే ప్రశ్నలు రాజకీయ వర్గాల్లో వినిపిస్తున్నాయి.దశాబ్దాల రాజకీయ అనుభవం ఉన్న చిన్నారెడ్డి భవిష్యత్ కార్యాచరణపై ఇప్పుడు ఆసక్తి నెలకొంది. పార్టీ నాయకత్వంతో మళ్లీ సఖ్యత కుదుర్చుకుంటారా? తిరిగి పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటారా? లేక తన రాజకీయ భవిష్యత్తుపై మరో నిర్ణయం తీసుకుంటారా? అన్నది చూడాలి. ప్రస్తుతానికి ఆయన మౌనం వెనుక ఉన్న కారణాలపై స్పష్టత లేదు. రానున్న రోజుల్లో చిన్నారెడ్డి వేసే రాజకీయ అడుగులే ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పనున్నాయి.

పథకాలు అందాలంటే బ్యాంకు ఖాతా తప్పనిసరి



- కజ్జర్లలో బ్యాంకింగ్ వ్యవస్థపై అవగాహన సదస్సు

(తలమడుగు, సాక్షర) ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందాలంటే బ్యాంకు ఖాతా తప్పనిసరని బ్యాంకు మేనేజర్ సూచించారు. బ్యాంకు ఆఫ్ మహారాష్ట్ర తలమడుగు శాఖ ఆధ్వర్యంలో బ్యాంకింగ్ వ్యవస్థపై తలమడుగు మండలంలోని కజ్జర్ల గ్రామంలో అవగాహన సదస్సు నిర్వహించారు.బ్యాంకు ఆఫ్ మహారాష్ట్ర బ్యాంకు మేనేజర్ మాట్లాడుతూ బ్యాంకులు ప్రజల అవసరాల కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిందని, ప్రభుత్వం నుండి వచ్చే సంక్షేమ పథకాలు అందాలంటే కచ్చితంగా బ్యాంకు ఖాతాలు తెరవాలని సూచించారు. దీనితో పాటు జీవిత బీమా పథకం, పీఎం మోదీ స్కీములు పీఎంజేజేబీవై, పీఎంఎస్బీవైలతో పాటు పీఎం జన్ ధన్ యోజన, బాలికలకు సుకన్య సమృద్ధి యోజన, అలాగే అటల్ పెన్షన్ యోజన, నామిని రిజిస్ట్రేషన్, కేవైసీలు, డెత్ క్లెయిములు అన్ని పథకాలు బ్యాంకులో లభిస్తాయని చెప్పారు. కార్యక్రమంలో కజ్జర్ల గ్రామ సర్పంచ్ వెల్మ నారాయణ రెడ్డి, ఉప సర్పంచ్ అగ్గిమల్ల గంగన్న, బ్యాంకు ఆఫ్ మహారాష్ట్ర స్పెషల్ అసిస్టెంట్ కాడే స్వామి, ఫీల్డ్ ఆఫీసర్ భుక్య నవీన్, సెక్రెటరీ కస్తూరి శోభా రాణి, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

పట్టణ ప్రాంతాలలో ఇందిరమ్మ టవర్ల నిర్మాణం : కలెక్టర్ ఇలా త్రిపాఠి

- ప్లాట్ల కేటాయింపునకు దరఖాస్తుల ఆహ్వానం డిసెంబర్ 05 లోగా దరఖాస్తుల స్వీకరణ



(నిజామాబాద్ ప్రతినిధి, సాక్షర) రాష్ట్రంలోని నగర ప్రాంతాల్లో నివసిస్తున్న అర్హులైన నిరుపేద, మధ్యతరగతి కుటుంబాలకు సొంత ఇంటి కలను సాకారం చేయాలనే లక్ష్యంతో తెలంగాణ గృహ నిర్మాణ మండలి ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ టవర్ల నిర్మాణం చేపట్టి, అందుబాటు ధరల్లో ఫ్లాట్ల కేటాయింపు కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తోందని కలెక్టర్ ఇలా త్రిపాఠి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.రాష్ట్రంలోని నిజామాబాద్ సహా గ్రేటర్ వరంగల్, హనుమకొండ, నల్గొండ, మహబూబ్ నగర్ మొత్తం ఐదు పట్టణ ప్రాంతాల్లో ఇందిరమ్మ టవర్ల నిర్మాణాలు జరిపి, అర్హులైన వారికి ఫ్లాట్లు కేటాయించాలని నిర్ణయించిందని అన్నారు.ఇందులో భాగంగా నిజామాబాద్ నాగారం ప్రాంతంలో గల ఆర్జీకే కాలనీలో ఇందిరమ్మ టవర్ నిర్మాణం జరిపి 480 ఫ్లాట్ల కేటాయింపు కోసం అర్హులైన వారి నుండి దరఖాస్తులు ఆహ్వానించడం జరుగుతోందన్నారు.ఫ్లాట్ విస్తీర్ణం, ధర, ప్రభుత్వ రాయితీ వివరాలుప్రతి ఫ్లాట్ నమోదు విస్తీర్ణం 512 చదరపు అడుగులుగా నిర్ణయించారని, ఒక్కో ఫ్లాట్ పై ప్రభుత్వం రూ.5 లక్షల రాయితీ అందించనుందని కలెక్టర్ ఇలా త్రిపాఠి వెల్లడించారు. ఫ్లాట్ల నిర్మాణానికి అవసరమైన స్థలం ఖర్చును ప్రభుత్వమే భరిస్తుందని అన్నారు. ప్రభుత్వ రాయితీ మినహాయించి, ఒక్కో ఫ్లాట్ కు లబ్ధిదారుడు తన వాటా రూపంలో రూ.3.50 లక్షలు చెల్లించాల్సి ఉంటుందని తాత్కాలికంగా నిర్ణయించారని తెలిపారు.దరఖాస్తు రుసుము, ముందస్తు మొత్తం వివరాలుఒక్కో దరఖాస్తుకు రూ.100 తిరిగి చెల్లించబడని రుసుము ఉంటుందని, ముందస్తు మొత్తం కింద రూ.10,000 చెల్లించాలని అన్నారు. ఫ్లాట్ కేటాయింపు జరగని వారికి ముందస్తు మొత్తం తిరిగి వాపసు చేస్తారని తెలిపారు. ఫ్లాట్ కేటాయింపు జరిగిన వారికి ఈ మొత్తాన్ని లబ్ధిదారుడి వాటాలో సర్దుబాటు చేస్తారని అన్నారు.అర్హత నిబంధనలుదరఖాస్తు చేసుకునే వారికి సంబంధిత మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఎక్కడా సొంత ఇల్లు లేదా ప్లాట్ ఉండకూడదని తెలిపారు. కుటుంబ వార్షిక ఆదాయం రూ.6 లక్షలకు మించకూడదని, ప్లాట్ ను 10 సంవత్సరాల పాటు విక్రయించడం లేదా అద్దెకు ఇవ్వడం అనుమతించబడదని కలెక్టర్ స్పష్టం చేశారు. అయితే బ్యాంకు తాకట్టుకు అనుమతి ఉంటుందని సూచించారు. ఒక కుటుంబం నుంచి ఒకే దరఖాస్తు, ఒకే ఫ్లాట్ కు మాత్రమే అవకాశం కల్పిస్తారని అన్నారు. మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో నివసించే వారు మాత్రమే ఈ పథకం కింద దరఖాస్తు చేసుకునేందుకు అర్హులని కలెక్టర్ పేర్కొన్నారు. చెల్లింపుల విధానం... ఫ్లాట్ కోసం ఎంపిక అయిన లబ్ధిదారులు తమ వాటా మొత్తాన్ని విడతల వారీగా చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. తాత్కాలిక కేటాయింపు సమయంలో రూ.1 లక్ష, ఆర్సీసీ నిర్మాణం పూర్తయినప్పుడు రూ.1 లక్ష, ముగింపు దశలో రూ.1 లక్ష, నిర్మాణం పూర్తయి ఫ్లాట్ అప్పగించే సమయంలో మిగిలిన మొత్తం వాటాను చెల్లించాలని అన్నారు. ఎంపిక ప్రక్రియ... అర్హులైన దరఖాస్తుదారులను గుర్తించేందుకు ముందుగా గుర్తింపు ధ్రువీకరణ నిర్వహిస్తారని, అనంతరం లాటరీ విధానం ద్వారా ఫ్లాట్లు కేటాయించి, ఎంపికైన లబ్ధిదారుల వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తారని కలెక్టర్ వివరించారు.దరఖాస్తు విధానం, చివరి తేదీఅర్హులైన అభ్యర్థులు సంబంధిత మీ సేవా కేంద్రాల ద్వారా లేదా అధికారిక మీ సేవా వెబ్ సైట్ ద్వారా ఆన్ లైన్ లో దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. దరఖాస్తుల స్వీకరణకు డిసెంబర్ 05 చివరి తేదీ అని తెలిపారు. మరిన్ని వివరాల కోసం సహాయ కేంద్రం నంబర్ 040-24603572 ను సంప్రదించవచ్చని సూచించారు. అర్హులైన నిజామాబాద్ నగర ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని నిర్ణీత గడువులోగా దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు.

స్కైవాక్‌తో సరికొత్త రూపులో సికింద్రాబాద్!



(హైదరాబాద్, సాక్షర): సికింద్రాబాద్‌లో బస్ టెర్మినల్, రైల్వే స్టేషన్, మెట్రో స్టేషన్లను అనుసంధానిస్తూ స్కైవాక్‌లు నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధమయ్యాయి. చిలకలగూడలో ఐదు ఎకరాల్లో కొత్త బస్ టెర్మినల్ ఏర్పాటు చేసి, అక్కడి నుంచి రైల్వే స్టేషన్ పదో ప్లాట్‌ఫామ్ వరకు స్కైవాక్ నిర్మించనున్నారు. ఈస్ట్, వెస్ట్ మెట్రో స్టేషన్లకు కూడా అనుసంధాన మార్గాలను ప్రతిపాదించారు. కొత్త టెర్మినల్ వెయ్యికి పైగా సిటీ బస్సులకు సేవలందించనుండగా.. అక్కడే ఈవీ స్టేషన్లు కూడా ఏర్పాటు చేయనున్నారు.చిలకలగూడ రైల్వే క్వార్టర్స్ ప్రాంతంలో రైల్వేకు చెందిన ఐదు ఎకరాల భూమిలో కొత్త బస్ టెర్మినల్‌ను నిర్మించాలని టీజీఎస్ఆర్టీసీ ప్రతిపాదించింది. ఈ టెర్మినల్ నుంచి సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లోని పదో ప్లాట్‌ఫామ్ వరకు స్కైవాక్ నిర్మించనున్నారు. దీనివల్ల బస్ టెర్మినల్ నుంచి రైల్వే స్టేషన్‌తోపాటు సికింద్రాబాద్ ఈస్ట్ మెట్రో స్టేషన్‌కు కూడా ప్రయాణికులు సులభంగా చేరుకోవచ్చు. ప్రస్తుతం రద్దీగా ఉండే రోడ్లపై నడుచుకుంటూ వెళ్లాల్సిన అవసరం లేకుండా ఈ స్కైవాక్‌లు ఉపయోగపడనున్నాయి.కొత్త బస్ టెర్మినల్ నిర్మాణానికి సంబంధించి ఆర్టీసీ, దక్షిణ మధ్య రైల్వే మధ్య భూ మార్పిడి ఒప్పందం త్వరలో కుదరనుంది. ఇందులో భాగంగా చిలకలగూడ రైల్వే క్వార్టర్స్ ప్రాంతంలో రైల్వేకు చెందిన ఐదు ఎకరాల భూమిని ఆర్టీసీకి కేటాయించనున్నారు. ప్రతిగా కాచిగూడ రైల్వే స్టేషన్ పునరాభివృద్ధి కోసం ఆర్టీసీకి చెందిన ఐదు ఎకరాల భూమిని రైల్వేకు ఇవ్వనున్నారు. కాచిగూడలో రైల్వే నిధులతో ఆర్టీసీ బస్ డిపోను నిర్మించనుంది. ఇందుకు సంబంధించిన ఒప్పందంపై త్వరలో సంతకాలు చేయనున్నట్లు ఆర్టీసీ ఉన్నతాధికారి వెల్లడించారు.కొత్తగా నిర్మించనున్న సికింద్రాబాద్ బస్ టెర్మినల్ నుంచి నగరంలోని వివిధ ప్రాంతాలకు వెళ్లే వెయ్యికి పైగా సిటీ బస్సులను నిర్వహించేలా ఏర్పాట్లు చేయనున్నారు. ఎలక్ట్రిక్ బస్సుల కోసం ప్రత్యేకంగా ఛార్జింగ్ సదుపాయాలు కూడా కల్పించనున్నారు. ప్రస్తుతం గురుద్వారా, బ్లూ సీ హోటల్, రెతిఫైల్, చిలకలగూడ జంక్షన్ ప్రాంతాల్లో బస్సులను నిలిపి ప్రయాణికులను ఎక్కించుకుంటున్నారు. కొత్త టెర్మినల్ అందుబాటులోకి వస్తే ఈ ప్రాంతాల్లో బస్సుల నిలుపుదల అవసరం ఉండదని అధికారులు భావిస్తున్నారు.సికింద్రాబాద్ ప్రాంతంలో పాదచారుల రాకపోకలు సులభతరం చేసేందుకు హెచ్ఎండీఏ అనుబంధ సంస్థ గతంలోనే స్కైవాక్‌ల ప్రతిపాదనలు రూపొందించింది. సికింద్రాబాద్ ఈస్ట్, వెస్ట్ మెట్రో స్టేషన్లను రైల్వే స్టేషన్‌తో అనుసంధానించేలా మరో రెండు మార్గాలను ప్రతిపాదించారు. వీటితో మెట్రో ప్రయాణికులు, రైల్వే ప్రయాణికులు, స్థానిక పాదచారులకు ప్రయోజనం కలగనుంది. చిలకలగూడ వైపు ప్రతిపాదించిన స్కైవాక్ ఆ ప్రాంతంలో పాదచారుల రాకపోకల సమస్యలను పరిష్కరించేందుకు ఉపయోగపడుతుందని అధికారులు చెబుతున్నారు.మరోవైపు సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ పునరాభివృద్ధి పనులు కూడా వేగంగా కొనసాగుతున్నాయి. ఇప్పటివరకు 70 శాతానికి పైగా పనులు పూర్తయ్యాయి. పదో ప్లాట్‌ఫామ్ వైపు చేపట్టిన పనులు కూడా తుది దశకు చేరుకున్నాయి. వచ్చే ఏడాది నాటికి స్టేషన్ పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తుందని రైల్వే అధికారులు భావిస్తున్నారు. పునరాభివృద్ధి పనులు పూర్తవడంతోపాటు ప్రతిపాదిత స్కైవాక్‌లు అందుబాటులోకి వస్తే సికింద్రాబాద్ రవాణా కేంద్రంలో ప్రయాణికుల రాకపోకలు మరింత సులభతరం కానున్నాయి.

నేటి విద్యార్థులే రేపటి దేశ భవిష్యత్తు



(రెబ్బెన, సాక్షర) జాతీయ విద్యా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఇంపాక్ట్ క్లబ్ ఇంటర్నేషనల్ ప్రాంతం 20 ఆధ్వర్యంలో కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా గోలేటిలోని సింగరేణి ఉన్నత పాఠశాల, గోలేటి ఆశ్రమ ఉన్నత పాఠశాలల్లో విద్యార్థుల కోసం ప్రత్యేక వ్యక్తిత్వ వికాసం, కెరీర్ మార్గదర్శకత్వం, విద్యా అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.కార్యక్రమంలో ఇంపాక్ట్ క్లబ్ ఇంటర్నేషనల్ ప్రాంతం 20 కొమరం భీం జిల్లా ఏరియా ఇన్‌చార్జి కేసరి ఆంజనేయులు గౌడ్ విద్యార్థులతో నేరుగా మమేకమై వారితో ఆసక్తికరంగా సంభాషిస్తూ వారి ఆలోచనలు, అభిప్రాయాలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు ఆత్మవిశ్వాసం, సానుకూల ఆలోచనా విధానం, లక్ష్య నిర్దేశం, నాయకత్వ లక్షణాలు, సంభాషణ నైపుణ్యాలు, క్రమశిక్షణ, సమయపాలన, సామాజిక బాధ్యత వంటి ముఖ్యమైన అంశాలపై అవగాహన కల్పించారు.విద్యార్థులు భవిష్యత్తులో వైద్యులు, ఇంజినీర్లు, ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు, శాస్త్రవేత్తలు, వ్యాపారవేత్తలు వంటి ఉన్నత స్థాయికి ఎదగాలంటే ఏయే సబ్జెక్టులను ఎంచుకోవాలి, ఎలాంటి కోర్సులు అభ్యసించాలి, ఏయే పోటీ పరీక్షలకు సిద్ధం కావాలి అనే అంశాలపై సమగ్ర కెరీర్ మార్గదర్శకత్వం అందించారు. విద్యార్థులు అభిరుచి, ఆసక్తి, ప్రతిభను గుర్తించి స్పష్టమైన లక్ష్యంతో ముందుకు సాగాలని సూచించారు. ప్రస్తుత సమాజంలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు, చెడు అలవాట్లు, హింసాత్మక ప్రవర్తన, తోటి విద్యార్థుల పట్ల వేధింపులు వంటి అంశాలపై అవగాహన కల్పించారు. కోపాన్ని నియంత్రించుకోవడం, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, తోటి విద్యార్థులను గౌరవించడం, మానవత్వం, మంచి నడవడికను అలవర్చుకోవడం ద్వారా బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగాలని పిలుపునిచ్చారు.కేసరి ఆంజనేయులు గౌడ్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థిలోనూ ఏదో ఒక ప్రతిభ దాగి ఉంటుందని దానిని గుర్తించి సరైన దిశలో కృషి చేస్తే జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చన్నారు. విద్యార్థులు పెద్ద పెద్ద కలలు కనాలని, వాటిని సాకారం చేసుకోవడానికి నిరంతరం కష్టపడాలని సూచించారు. జీవితంలో విజయం సాధించాలంటే విద్యతో పాటు క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, పట్టుదల, సంస్కారం ఎంతో అవసరమన్నారు.అనంతరం ఇంపాక్ట్ సభ్యులు ఆర్సీ సర్వీస్ వేముల రమేష్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు సామాజిక బాధ్యతను అలవర్చుకొని సమాజానికి ఉపయోగపడే మంచి పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు. సింగరేణి ఉన్నత పాఠశాలలో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులను ప్రోత్సహిస్తూ వారికి బహుమతులుగా పెన్నులను అందజేశారు. విద్యార్థుల్లో చదువుపై ఆసక్తి, సృజనాత్మక ఆలోచనా విధానం, పోటీతత్వాన్ని పెంపొందించడమే ఈ ప్రోత్సాహ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు.కార్యక్రమంలో సింగరేణి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రవితేజ, పీఈటీ భాస్కర్, గోలేటి ఆశ్రమ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి. దేవయ్య, ఇంపాక్ట్ సభ్యులు, విశ్రాంత ఎంఈఓ రాజేశం గౌడ్, దాసరి శ్రీనివాస్, అజ్మీర ప్రభాకర్, నరేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మొదటి పేజీ తరువాయి

ఎవరికి ఏ పదవి? కాంగ్రెస్‌లో ఉత్కంఠ!

ఈ రెండింటి సమతూకం కుదరకపోవడమే ఈ రాజకీయ ప్రతిష్టంభనకు ప్రధాన కారణం.రాష్ట్రంలోని మెజారిటీ కార్పొరేషన్లు, కమిషన్లు ప్రస్తుతం నడిపించే నాయకుడు లేక ఖాళీగా దర్శనమిస్తున్నాయి. 2024లో నియమితులైన పలువురు ఛైర్మన్లు, పాలకమండలి సభ్యుల పదవీకాలం జూలై, ఆగస్టు నెలల్లోనే ముగిసింది. మిగిలిన విభాగాల్లోనూ పూర్తిస్థాయి నియామకాలు చేపట్టలేదు. నెలాఖరుకల్లా కొలిక్కి వస్తుందని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ పలుమార్లు సంకేతాలిచ్చినప్పటికీ, గ్రౌండ్ లెవల్‌లో ఏకాభిప్రాయం కుదరడం లేదు. ఇప్పటికే రేవంత్ రెడ్డి, మహేష్ గౌడ్ మధ్య జరిగిన చర్చల్లో దాదాపు 15 కార్పొరేషన్లు, కమిషన్ల ఛైర్మన్లు, సభ్యుల ఎంపికపై ప్రాథమిక అవగాహన కుదిరినప్పటికీ, మిగిలిన కీలక విభాగాల విషయంలో ప్రతిష్టంభన కొనసాగుతోంది. దీనికితోడు లండన్ వర్సిటీలో ఉన్నత విద్య అభ్యసిస్తున్న రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షీ నటరాజన్ అందుబాటులో లేకపోవడం కూడా ప్రక్రియలో జాప్యానికి కారణంగా కనిపిస్తోంది.తాజా సమాచారం ప్రకారం ఈ నెల 12న లేదా మాజీ ప్రధాని ఇందిరా గాంధీ జయంతి రోజైన నవంబరు 19న తొలి విడత నామినేటెడ్ పదవుల జాబితా వెలువడవచ్చనే ప్రచారం బలంగా సాగుతోంది. అయితే నవంబరు 12, 13, 14 తేదీల్లో హెచ్ఐసీసీలో జరిగే ప్రతిష్టాత్మక 'భారత్ సమ్మిట్'కు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ హాజరయ్యే అవకాశాలు ఉన్నందున, వారి రాకను బట్టి తుది భేటీ ఉండనుంది. ఒకవేళ ఇక్కడ కూడా పీటముడి వీడకపోతే స్థానిక సంస్థల ఎన్నికల వరకు ఈ వ్యవహారం వాయిదా పడే ప్రమాదముంది. ఈ దఫా రెన్యూవల్ కేవలం నిర్మలా జగ్గారెడ్డి, ప్రీతమ్, బెల్లయ్యనాయక్, శివసేనారెడ్డి సహా ఆరుగురికి మించి ఉండకపోవచ్చని సమాచారం. మెజారిటీ స్థానాలను కొత్త ముఖాలకే కేటాయించి అసంతృప్తిని చల్లార్చాలని అధిష్ఠానం భావిస్తోంది.మరోవైపు గవర్నర్ కోటా కింద భర్తీ చేయాల్సిన మూడు ఎమ్మెల్సీ స్థానాల ప్రక్రియను డిసెంబర్ రెండో లేదా మూడో వారం వరకు కాంగ్రెస్ వ్యూహాత్మకంగా పక్కనబెట్టింది. ముందుగా కార్పొరేషన్లను తేల్చి, ఆ తర్వాతే మండలి లెక్కలు తేల్చాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పీసీసీ చీఫ్ నిర్ణయించారు. 2027 మార్చిలో జరగనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సమీకరణాలు ఈ వాయిదా వెనుక దాగి ఉన్నాయి. ముఖ్యంగా మహబూబ్‌నగర్- రంగారెడ్డి-హైదరాబాద్ పట్టభద్రుల నియోజకవర్గం సీఎం సొంత జిల్లాను కలుపుకుని ఉండటంతో అక్కడ పాగా వేయడం ప్రతిష్టాత్మకంగా మారింది. దీనిని దృష్టిలో ఉంచుకుని గవర్నర్ కోటా ఎమ్మెల్సీల్లో ఇద్దరు బీసీలకు, ఒక బ్రాహ్మణ సామాజిక వర్గానికి అవకాశం ఇవ్వాలనే ఫార్ములా తెరపైకి వచ్చింది. బీసీల కోటాలో పద్మశాలీతో పాటు మున్నూరు కాపు లేదా ముదిరాజ్ వర్గానికి చోటు కల్పించాలని యోచిస్తుండగా, బీఆర్ఎస్, బీజేపీలు బ్రాహ్మణ సామాజిక వర్గానికి ఇచ్చిన ప్రాధాన్యతను పరిగణనలోకి తీసుకుని కాంగ్రెస్ కూడా ఆ వర్గాన్ని ప్రసన్నం చేసుకునే ఎత్తుగడ వేస్తోంది. మిగిలిన రెండేళ్ల పదవీకాలాన్ని సద్వినియోగం చేసుకుని, రాబోయే సార్వత్రిక అసెంబ్లీ ఎన్నికల్లో పోటీకి సిద్ధపడాలని చూస్తున్న ఆశావహుల లాబీయింగ్ తారస్థాయికి చేరింది. అసంతృప్తి పెచ్చరిల్లకుండా, అన్ని వర్గాలనూ ఏకతాటిపై నిలపడం నాయకత్వానికి పెను పరీక్షగా మారింది

మొదటి పేజీ తరువాయి

కాంగ్రెస్‌కు పరీక్షగా ఉద్యోగుల అసంతృప్తి!

అనంతరం సెప్టెంబర్ 18లోగా నివేదిక సమర్పించాలని ప్రభుత్వం గడువు విధించగా.. నవంబర్ నాటికీ ఉద్యోగుల ప్రధాన డిమాండ్ పరిష్కారం కాలేదనే అసంతృప్తి కొనసాగుతోంది.పీఆర్సీ నివేదికను వెంటనే విడుదల చేసి అమలు చేయాలని తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగులు, గెజిటెడ్ అధికారులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్ల జాయింట్ యాక్షన్ కమిటీ (డిమాండ్ చేస్తోంది. 51 శాతం ఫిట్‌మెంట్‌తో 2023 జులై 1 నుంచి కొత్త వేతనాలను అమలు చేయాలని కోరుతోంది.దీంతో పాటు పెండింగ్ బిల్లుల చెల్లింపుల కోసం ప్రస్తుతం నెలకు కేటాయిస్తున్న రూ.1,000 కోట్లను రూ.2,000 కోట్లకు పెంచాలని, పాత పెన్షన్ విధానం పునరుద్ధరణపై కమిటీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తోంది. ఉద్యోగుల పెండింగ్ బిల్లుల విలువ రూ.10 వేల కోట్లకు పైగా ఉందని జేఏసీ నేతలు చెబుతున్నారు.నవంబర్ 6న హైదరాబాద్‌లోని టీజీవో భవన్‌లో జరిగిన విస్తృత స్థాయి సమావేశంలో ఉద్యోగుల సమస్యలపై చర్చించారు. దీపావళి తర్వాత ఆందోళన కార్యాచరణ ప్రకటించాలని నిర్ణయించినట్లు సమాచారం. ప్రస్తుతం ఈ ఉద్యోగుల అసంతృప్తి కాంగ్రెస్ పార్టీకి రాజకీయంగా కీలకంగా మారుతోంది. మహబూబ్‌నగర్-రంగారెడ్డి-హైదరాబాద్, వరంగల్-ఖమ్మం-నల్గొండ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ నియోజకవర్గాల్లో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు ఓటర్లుగా ఉండటం ప్రాధాన్యత సంతరించుకుంది.ఈ రెండు నియోజకవర్గాల పరిధిలో నాలుగు లక్షలకు పైగా ఉద్యోగులు, పెన్షనర్లు, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది గ్రాడ్యుయేట్లుగా ఉన్నారని జేఏసీ నేతలు పేర్కొంటున్నారు. వీరిలో గణనీయమైన సంఖ్యలో ఇప్పటికే ఓటర్లుగా నమోదు చేసుకునేందుకు దరఖాస్తు చేసుకున్నారని చెబుతున్నారు.పీఆర్సీ అమలు సహా తమ డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించకపోతే కాంగ్రెస్ అభ్యర్థులకు వ్యతిరేకంగా ఓటు వేయడమే కాకుండా.. వ్యక్తిగత స్థాయిలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రచారం చేస్తామని కొందరు ఉద్యోగులు హెచ్చరిస్తున్నట్లు సమాచారంఅధికారంలోకి వచ్చిన తర్వాత ఉద్యోగుల సమస్యలను పరిష్కరిస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చింది. అయితే పీఆర్సీ, పెండింగ్ డీఏలు, బిల్లుల చెల్లింపులు, పెన్షన్ విధానం వంటి అంశాలు ఇంకా చర్చల్లోనే ఉండటంతో ఉద్యోగ వర్గాల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది.మరోవైపు రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు, పీఆర్సీ నివేదిక అందిన తర్వాత తీసుకోవాల్సిన నిర్ణయాలు ప్రభుత్వానికి కీలకంగా మారాయి. ఉద్యోగ సంఘాలతో చర్చలు జరిపి సమస్యలకు పరిష్కారం చూపుతుందా? లేక ఉద్యోగుల ఆందోళన మరింత తీవ్రమవుతుందా? అన్నది ఆసక్తికరంగా మారింది.గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఉద్యోగుల డిమాండ్ల పరిష్కారం కాంగ్రెస్ ప్రభుత్వానికి రాజకీయంగానూ ప్రాధాన్యత సంతరించుకుంది. ఉద్యోగుల అసంతృప్తిని ప్రభుత్వం ఎలా చల్లారుస్తుందన్నది రాబోయే రోజుల్లో చూడాలి

కాసిపేట మోడల్ స్కూల్ లో కెరీర్ మార్గదర్శకత్వం, వ్యక్తిత్వ వికాస కార్యక్రమం



(కాసిపేట, సాక్షర): మండలంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాలలో విద్యార్థులకు ప్రేరణాత్మక వక్త మద్దెవేని అర్జున్ ఆధ్వర్యంలో వ్యక్తిత్వ వికాస, ప్రేరణా కార్యక్రమం నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖలీల్ తెలిపారు.పదవ తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులకు ప్రముఖ ప్రేరణాత్మక వక్త, ఇంపాక్ట్ ఫౌండేషన్ ధ్రువీకరణ శిక్షకుడు మద్దెవేని అర్జున్ వృత్తి మార్గదర్శకత్వం, వ్యక్తిత్వ వికాసం, పరీక్షలకు సన్నద్ధత, జ్ఞాపకశక్తి పెంపొందించే పద్ధతులు, సమయ నిర్వహణ, భవిష్యత్తులో విజయం సాధించేందుకు మెట్లు, ఒత్తిడిని అధిగమించడానికి విద్యార్థులు పాటించాల్సిన పద్ధతులు, భవిష్యత్తు కోసం గమ్యం నిర్దేశించుకోవడం గురించి వివరించారు. విద్యార్థులు తప్పనిసరిగా ఉన్నత లక్ష్యం పెట్టుకోవాలని, అవరోధాలను అధిగమించి విజయం సాధించాలని సూచించారు. విద్యార్థులు అడిగిన సందేహాలను నివృత్తి చేశారు.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ, విద్యార్థులు దురలవాట్లకు దూరంగా ఉండాలని, క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు.ఈ సందర్భంగా ప్రేరణాత్మక వక్త అర్జున్ ను ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు రాకేష్, నాగమల్లయ్య, శంకర్, విద్యార్థులు ఘనంగా సన్మానించారు.

మొదటి పేజీ తరువాయి

ఫ్యూచర్ సిటీ మాస్టర్ ప్లాన్ సిద్ధం

పురపాలక శాఖ అధికారుల సమాచారం ప్రకారం, ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ (ఎఫ్‌సీడీఏ) పరిధిలోని 7 మండలాలు, 71 రెవెన్యూ గ్రామాల్లో సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా ఈ ప్రణాళికను రూపొందించారు. నగరాల అస్తవ్యస్త విస్తరణకు అడ్డుకట్ట వేస్తూ, పర్యావరణ సమతుల్యతను కాపాడటం దీని ముఖ్య ఉద్దేశం. భూ వినియోగ ప్రణాళిక కింద వ్యవసాయ, నివాస, పారిశ్రామిక, వాణిజ్య, పర్యావరణ పరిరక్షణ ప్రాంతాలను స్పష్టంగా విభజించారు. పరిశ్రమలకు ప్రాధాన్యం ఇస్తూనే ఉద్యోగుల నివాసాలు, విద్య, వైద్యం వంటి సామాజిక వసతులపై దృష్టి సారించారు.2047 నాటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని రూపొందించిన ఈ ప్లాన్‌లో రవాణా సౌకర్యాలకు పెద్దపీట వేశారు. ఔటర్ రింగ్ రోడ్డు, రీజినల్ రింగ్ రోడ్డు, జాతీయ రహదారులను అనుసంధానించనున్నారు. పర్యావరణ అనుమతులపై నేషనల్ గ్రీన్ ట్రైబ్యునల్‌లో పిటిషన్ దాఖలు కావడంతో, చెరువులు, నాలాలు, అటవీ ప్రాంతాల పరిరక్షణకు ఈ ప్రణాళికలో స్పష్టమైన మార్గదర్శకాలు చేర్చారు.ఈ మాస్టర్ ప్లాన్‌లో వివిధ రంగాలకు ప్రత్యేక జోన్లను కేటాయించారు. ఇందులో లైఫ్ సైన్సెస్ హబ్‌కు 4,000 ఎకరాలు, నివాస ప్రాంతాలకు 2,477 ఎకరాలు, ఎలక్ట్రిక్ వాహనాలు-ఎనర్జీ పార్కులకు 1,976 ఎకరాలు కేటాయించారు. అలాగే హెల్త్ సిటీకి 594 ఎకరాలు, ఏఐ సిటీకి 403 ఎకరాలు, డేటా సెంటర్ హబ్‌కు 313 ఎకరాలు, ఎడ్యుకేషన్ హబ్‌కు 255 ఎకరాలు కేటాయించారు.మరోవైపు, మాస్టర్ ప్లాన్ సిద్ధమైన నేపథ్యంలో తమ భూములు ఏ జోన్ పరిధిలోకి వస్తాయోనన్న ఆందోళన రైతులు, భూ యజమానులు, రియల్ ఎస్టేట్ వర్గాల్లో నెలకొంది. రైతుల హక్కులు, భూసేకరణ, పరిహారం వంటి అంశాలపై ప్రభుత్వం నుంచి స్పష్టత రావాల్సి ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. హైదరాబాద్‌కు దక్షిణంగా రంగారెడ్డి జిల్లాలో ఓఆర్ఆర్, శ్రీశైలం, నాగార్జునసాగర్ హైవేల మధ్య విస్తరించి ఉన్న ఈ నగరాన్ని 'నెట్-జీరో స్మార్ట్ సిటీ'గా అభివృద్ధి చేయాలనేది ప్రభుత్వ లక్ష్యం.

విద్యతోనే సమాజ ప్రగతి - సిద్దులకుంటలో జాతీయ విద్యా దినోత్సవం

- ఆజాద్ సేవలను స్మరించుకున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు



(నిర్మల్ ప్రతినిధి, సాక్షర) సోన్ మండల పరిధిలోని సిద్దులకుంట గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జాతీయ విద్యా దినోత్సవాన్ని విద్యార్థులు, ఉపాధ్యాయులు ఘనంగా నిర్వహించారు. భారతదేశ తొలి కేంద్ర విద్యా శాఖ మంత్రి, ప్రముఖ విద్యావేత్త మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని పురస్కరించుకొని ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా ముందుగా మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం ఉపాధ్యాయులు, విద్యార్థులు జాతీయ విద్యా దినోత్సవ ప్రాముఖ్యతను వివరించారు. విద్య ద్వారానే సమాజ అభివృద్ధి, దేశ ప్రగతి సాధ్యమవుతాయని, ప్రతి ఒక్కరికీ నాణ్యమైన విద్య అందించాలనే లక్ష్యంతో విద్యా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు భూమారెడ్డి, ఉపాధ్యాయులు కడారి దశరథ్, సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

మొదటి పేజీ తరువాయి

త్వరలో మూసీ రివర్ ఫ్రంట్ పనులు ప్రారంభం ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి

మూసీని అత్యంత సుందరమైన రివర్ ఫ్రంట్‌గా అభివృద్ధి చేయడమే కాకుండా నైట్ ఎకానమీ కార్యకలాపాలను విస్తరించడం ద్వారా రాష్ట్ర ఆర్థిక పురోభివృద్ధికి, తద్వారా దేశ ఆర్థికాభివృద్ధికి తోడ్పడుతుందని వివరించారు. హైదరాబాద్ నగర గత వైభవాన్ని ముఖ్యమంత్రి వివరిస్తూ ఓల్డ్ సిటీ కాదు... ఒరిజినల్ సిటీని తిరిగి పునరుద్ధరించడం కోసం అడుగులు వేశామని చెప్పారు. దేశ విదేశాల నుంచి సందర్శకులు వచ్చేలా రివర్ ఫ్రంట్ అత్యంత ప్రతిష్టాత్మకంగా తీర్చిదిద్దుతామని చెప్పారు. భారతదేశ తొలి విద్యా శాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని పురస్కరించుకుని రాష్ట్ర మైనారిటీ శాఖ హైదరాబాద్ బంజారా భవన్‌లో నిర్వహించిన జాతీయ విద్యా దినోత్సవం, మైనారిటీ సంక్షేమ దినోత్సవంలో ముఖ్యమంత్రి గారు పాల్గొన్నారు. మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు.

భాగస్వామ్యమే గ్రామాభివృద్ధికి పునాది : సర్పంచ్ వాసాల నరేష్

- కిష్టాపూర్ లో వీబీ-జీ-రామ్ పనుల ప్రారంభం



(జన్నారం, సాక్షర) భాగస్వామ్యంతోనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని కిష్టాపూర్ గ్రామ సర్పంచ్ వాసాల నరేష్ అన్నారు. బుధవారం గ్రామంలో వీబీ-జీ-రామ్ పనులను ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో పాలకులు, ప్రజలు కలిసిమెలిసి పనులు చేసుకుంటూ పోతే గ్రామం అభివృద్ధిలో దూసుకుపోతుందని అన్నారు.కేంద్ర ప్రభుత్వ పథకం వీబీ-జీ-రామ్ పథకం ద్వారా గ్రామంలో అభివృద్ధి పనులు జరుగుతాయని, దాంతోపాటు గ్రామంలోని చాలామందికి ఉపాధి లభిస్తుందని ప్రజలకు పనితోపాటు ఆర్థిక అభివృద్ధి జరుగుతుందని, తద్వారా గ్రామం, గ్రామంలోని ప్రజలు అంతా అభివృద్ధి చెందుతారని ఆయన తెలిపారు. కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ కోల దేవపాల్ కుమార్, వార్డు సభ్యులు ముంజంపల్లి సాయికుమార్, బోడ గోవింద్, కార్యదర్శి ఎండీ న్యాయమూర్తి, ఫీల్డ్ అసిస్టెంట్ వేణు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

కల్ట్ సీక్వెల్ 'ఈఎన్ఈ రిపీట్' మూవీ నుంచి ఫస్ట్ సింగిల్ 'మిత్వా'



'ఈ నగరానికి ఏమైంది' చిత్రంతో ప్రేక్షకులకు బాగా దగ్గరైన క్రేజీ గ్యాంగ్ మరోసారి సందడి చేసేందుకు సిద్ధమైంది. ఆ సినిమాకు సీక్వెల్‌గా వస్తున్న 'ENE Repeat' నవంబర్ 19న గ్రాండ్‌గా థియేటర్లలో విడుదల కానుంది. తరుణ్ భాస్కర్ దాస్యం దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో విశ్వక్ సేన్, అభినవ్ గోమఠం, వెంకటేష్ కాకుమాను, శ్రీనాథ్ మాగంటి తమ పాత పాత్రలతో మళ్లీ అలరించనున్నారు. ఇప్పటికే ప్రమోషనల్ కంటెంట్‌తో మంచి బజ్ క్రియేట్ చేసిన మేకర్స్ తాజాగా ఈ సినిమా నుంచి ఫస్ట్ సింగిల్ 'మిత్వా'ను విడుదల చేశారు. స్నేహబంధంలోని అందమైన అనుభూతులను గుర్తుచేసేలా ఈ పాట సాగింది. వివేక్ సాగర్ స్వరపరిచిన 'మిత్వా' వినసొంపైన మెలోడీగా ఆకట్టుకుంటోంది. చక్కటి ఆర్కెస్ట్రేషన్, కొత్త తరహా మ్యూజిక్ అరేంజ్‌మెంట్స్ పాటకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. భరద్వాజ్ గాలి రాసిన సాహిత్యం స్నేహితులు పక్కన ఉన్నప్పుడు కలిగే ఆనందాన్ని, వారితో కలిసి గడిపిన మధురమైన జ్ఞాపకాలను అందంగా చూపించారు. నకుల్ అభ్యంకర్ తన వాయిస్‌తో పాటకు ప్రాణం పోయగా, వీణా ఘంటసాల వాయిస్ మరింత భావోద్వేగాన్ని తీసుకొచ్చింది. ఈ పాటకు సంబంధించిన విజువల్స్ కూడా ఎంతో ఆహ్లాదకరంగా ఉన్నాయి. థాయ్‌లాండ్ ట్రిప్‌లో ENE గ్యాంగ్ కలిసి సరదాగా గడిపిన క్షణాలను చూపించారు. అందమైన ప్రదేశాలు, బీచ్‌లలో ఎంజాయ్ చేయడం, పబ్స్‌లో పార్టీలు చేసుకోవడం వంటి సన్నివేశాలతో వారి అల్లరి, స్నేహం, అనుబంధాన్ని చూపించారు. అనీషా అంబ్రోస్, శివాత్మిక రాజశేఖర్ కూడా ఈ గ్యాంగ్‌తో కలిసి సందడి చేస్తూ కనిపించారు. 'ఈఎన్ఈ రిపీట్' లోని అసలైన ఫన్, ఎమోషన్‌ను 'మిత్వా' పాట మరోసారి గుర్తుచేస్తోంది. ఈ పాత్రల మధ్య స్నేహం, వారి కెమిస్ట్రీ ప్రేక్షకులకు ఎందుకు అంతగా నచ్చాయో ఈ పాట చూస్తే అర్థమవుతుంది. కేవలం ఒక మెలోడీగానే కాకుండా, స్నేహంలోని అల్లరి, ఆనందం, అనుబంధాలను గుర్తుచేసే పాటగా 'మిత్వా' ఆకట్టుకుంటోంది. ఎస్ ఒరిజినల్స్, రూట్‌నోడ్ సినిమా బ్యానర్లపై సృజన్ యరబోలు, సందీప్ నాగిరెడ్డి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ప్రమోషన్స్‌ను 'మిత్వా' పాటతో మ్యూజికల్‌గా ప్రారంభించిన 'ENE Repeat'పై ప్రేక్షకుల్లో ఆసక్తి మరింత పెరుగుతోంది. తమ అభిమాన గ్యాంగ్‌ను మరోసారి తెరపై చూసేందుకు ప్రేక్షకులు ఎదురుచూస్తున్నారు. ఈ చిత్రానికి ఏజే ఆరోన్ సినిమాటోగ్రఫీ అందించగా, రవితేజ గిరిజాల ఎడిటర్. నటీనటులు: విశ్వక్ సేన్, శ్రీనాథ్ మాగంటి, అభినవ్ గోమఠం, వెంకటేష్ కాకుమాను.

రోషన్ మేక హీరోగా మూవీ ఘనంగా ప్రారంభం



టాలీవుడ్‌లో ప్రతిష్టాత్మక నిర్మాణ సంస్థగా గుర్తింపు తెచ్చుకున్న అశోక క్రియేషన్స్ మరో భారీ ప్రాజెక్ట్‌ను ప్రకటించింది. పాన్ ఇండియా స్థాయిలో తెరకెక్కనున్న ఈ చిత్రం సంస్థకు ప్రొడక్షన్ నెం.3. అశోక్ వర్ధన్ ముప్పా, సునీల్ బలుసు నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. క్రియేటివ్ డైరెక్టర్ మోహనకృష్ణ ఇంద్రగంటి, యంగ్ సెన్సేషన్ రోషన్ మేక ఈ ప్రాజెక్ట్ కోసం చేతులు కలిపారు. విభిన్నమైన కథలు, సరికొత్త కథనాలతో సినిమాలు తెరకెక్కించే మోహనకృష్ణ ఇంద్రగంటి.. ఈ చిత్రంలో రోషన్‌ను సరికొత్త కోణంలో చూపించనున్నారు. తన స్క్రీన్ ప్రెజెన్స్,ఆకట్టుకునే నటనతో ఇప్పటికే తన ప్రతిభను నిరూపించుకున్న రోషన్.. ఈ భారీ చిత్రంతో మరో కొత్త అవతార్‌లో ప్రేక్షకులను అలరించనున్నారు. ముప్పా వెంకయ్య చౌదరి సమర్పణలో రూపొందుతున్న ఈ చిత్రం నేడు ఘనంగా ప్రారంభమైంది. ఈ ప్రతిష్టాత్మక పాన్ ఇండియా సినిమా ప్రారంభోత్సవం ఘనంగా జరిగింది. ముప్పా వెంకయ్య చౌదరి కెమెరా స్విచ్ ఆన్ చేయగా, హీరో శ్రీకాంత్ క్లాప్ కొట్టారు. అనంతరం ముప్పా వెంకయ్య చౌదరి చిత్ర బృందానికి స్క్రిప్ట్ అందజేశారు. దర్శకుడు మోహనకృష్ణ ఇంద్రగంటి రోషన్ మేకను గతంలో ఎన్నడూ చూడని పవర్ ఫుల్ సూపర్‌హీరో అవతార్‌లో చూపించేందుకు భారీ స్థాయి యాక్షన్ అడ్వెంచర్ కథను సిద్ధం చేశారు. ఈ తన డ్రీమ్ ప్రాజెక్ట్ కోసం ఆయన దాదాపు ఏడాదిన్నర పాటు ప్రీ-ప్రొడక్షన్ వర్క్స్ చేశారు. స్క్రిప్ట్‌ను పూర్తిస్థాయిలో డెవలప్ చేయడంతో పాటు, ప్రతి అంశాన్ని జాగ్రత్తగా తీర్చిదిద్దారు. ఆసక్తికరమైన కథాంశానికి అత్యాధునిక సాంకేతికత, భారీ స్థాయి విజువల్స్‌ను జోడించి అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకునేలా ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. ఈ సినిమాతో బాలీవుడ్ నటి రేఖా పాండే తెలుగు చిత్ర పరిశ్రమలోకి అడుగుపెడుతున్నారు. నటుడు వినయ్ రాయ్ కీలక పాత్రలో కనిపించనున్నారు. వీరిద్దరి రాకతో ఈ ప్రాజెక్ట్‌పై మరింత ఆసక్తి నెలకొంది. ఈ చిత్రానికి టాప్ టెక్నికల్ టీం పనిచేస్తోంది. పి.జి. విందా సినిమాటోగ్రఫీ నిర్వహించనున్నారు. 'హనుమాన్', 'మిరాయ్' చిత్రాలతో గుర్తింపు తెచ్చుకున్న గౌర హరి సంగీతం అందిస్తున్నారు. ప్రముఖ ప్రొడక్షన్ డిజైనర్లు రామకృష్ణ సబ్బాని, మోనికా నిగోత్రే ఈ సినిమా కోసం భారీ విజువల్ వరల్డ్‌ను రూపొందించనున్నారు. అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన యాక్షన్ కొరియోగ్రాఫర్ లీ విటేకర్‌తో పాటు రామకృష్ణ యాక్షన్ సన్నివేశాలను రూపొందించనున్నారు. మార్తాండ్ కె. వెంకటేష్ ఎడిటింగ్. యంగ్ హీరో సూపర్‌హీరో జానర్‌లోకి అడుగుపెడుతుండటం, విభిన్నమైన కథలతో గుర్తింపు తెచ్చుకున్న దర్శకుడు మోహనకృష్ణ ఇంద్రగంటి ఈ ప్రాజెక్ట్‌కు దర్శకత్వం వహిస్తుండటం, ప్రతిష్టాత్మక నిర్మాణ సంస్థ అశోక క్రియేషన్స్ భారీ స్థాయిలో నిర్మిస్తుండటంతో ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొంటున్నాయి. రోషన్ మేకను సరికొత్త, అద్భుతమైన అవతార్‌లో ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేందుకు మేకర్స్ సిద్ధమవుతున్నారు.ప్రపంచ స్థాయి ప్రమాణాలతో భారీగా తెరకెక్కనున్న ఈ సినిమా షూటింగ్ డిసెంబర్ మొదటి వారంలో ప్రారంభం కానుంది. నటీనటులు: రోషన్ మేక, రేఖా పాండే, వినయ్ రాయ్

ఘనంగా "మాయలేడి" సినిమా ప్రీ రిలీజ్



యంగ్ టాలెంటెడ్ హీరో, ప్యాషనేట్ ప్రొడ్యూసర్ రాకేష్ వర్రే చేస్తున్న కొత్త సినిమా "మాయలేడి". ఈ సినిమాలో రాకేష్ వర్రే హీరోగా నటిస్తూ క్రేజీ యాంట్స్ ప్రొడక్షన్స్ బ్యానర్ పై నిర్మిస్తున్నారు. రాకేష్ వర్రే గతంలో క్రేజీ యాంట్స్ ప్రొడక్షన్స్ బ్యానర్ పై ఎవరికీ చెప్పొద్దు, పేకమేడలు వంటి కంటెంట్ ఓరియెంటెడ్ మూవీస్ నిర్మించి అందరి ప్రశంసలు పొందారు. ఇప్పుడు "మాయలేడి"తో మరో ఇంట్రెస్టింగ్ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నారు. ఈ సినిమాను దర్శకుడు ప్రశంకర్ రూపొందిస్తున్నారు. మధుమిత సర్కార్ హీరోయిన్ గా నటిస్తోంది. "మాయలేడి" సినిమా ఈ నెల 13న వరల్డ్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు వస్తోంది. ఈ రోజు ఈ చిత్ర ప్రీ రిలీజ్ ఈవెంట్ ను హైదరాబాద్ లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కో ప్రొడ్యూసర్ విజిత్ మాట్లాడుతూ - ఈ సినిమాకు ముందు చాలా స్క్రిప్ట్స్ విన్నాను. కానీ ఈ కథ వింటున్నప్పుడు ఆద్యంతం ఎంటర్ టైన్ అయ్యాను. ఇదే ఎంటర్ టైన్ మెంట్ మీరు థియేటర్ లో ఎంజాయ్ చేస్తారు. అన్నారు. రైటర్ బిందు మాట్లాడుతూ - కంప్లీట్ ఎంటర్ టైనర్ ఇది. ఈ సినిమా రైటింగ్ వర్క్ నేను చేయగలను అని నమ్మి అవకాశం ఇచ్చిన మా డైరెక్టర్ కు థ్యాంక్స్. ఈ సినిమాలో హీరోయిన్ క్యారెక్టర్ రాసేప్పుడు నన్ను నేను పోల్చుకున్నాను. మీకు మంచి వినోదాన్ని అందించే చిత్రమిది. అన్నారు. ఆర్ట్ డైరెక్టర్ భార్గవ్ మాట్లాడుతూ - మా సినిమాను క్వాలిటీ ప్రొడక్ట్ గా తీసుకురావడంలో హీరోగా, ప్రొడ్యూసర్ గా ఎక్కడ రాజీపడలేదు రాకేష్. ఈ నెల 13న థియేటర్స్ లో మాయలేడి సినిమాను చూడండి. అన్నారు. నటి మధురిమ మాట్లాడుతూ - నేను ఈ సినిమాలో ఇందిర అనే క్యారెక్టర్ లో నటించాను. నా క్యారెక్టర్ ను పవర్ ఫుల్ గా ఉండేలా తెరకెక్కించారు డైరెక్టర్. సురేష్ కు జోడిగా నా క్యారెక్టర్ ఉంటుంది. హీరో ఎదుర్కొనే వివిధ సందర్భాలలో ఫ్యామిలీ మెంబర్స్ గా మా స్పందన, సపోర్ట్ ఎలా ఉంటుంది అనేది ఆసక్తికరంగా ఉంటుంది. అన్నారు. నటి లావణ్య మాట్లాడుతూ - నేను, మధురిమ గారు, హీరోయిన్ ..మా ముగ్గురు క్యారెక్టర్స్ ఈ మూవీలో చాలా పవర్ ఫుల్ గా ఉంటాయి. మేము ముగ్గురం మాయలేడీలం అనుకోవచ్చు. నా భర్త క్యారెక్టర్ ను కొట్టే సీన్స్ కోసం స్పెషల్ గా స్టంట్స్ ట్రైనింగ్ తీసుకున్నా. ప్రేక్షకుల్ని టైటిల్స్ టు ఎండ్ కార్డ్ ఎంగేజ్ చేసే సినిమా ఇది. అన్నారు. ఫైట్ మాస్టర్ అంజి మాట్లాడుతూ - ఈ సినిమాలో ఫైట్స్ కు మంచి అప్లాజ్ వస్తుందని నమ్ముతున్నాను. యాక్షన్ సీక్వెన్సులు అన్నీ డిఫరెంట్ గా డిజైన్ చేశాం. హీరో, హీరోయిన్స్ ఇద్దరూ బాగా ప్రాక్టీస్ చేసి ఈ స్టంట్స్ పర్ ఫార్మ్ చేశారు. అన్నారు. ఎడిటర్ రవితేజ గిరిజాల మాట్లాడుతూ - మాయలేడి ఒక బ్యూటిఫుల్ లవ్ స్టోరీ. ఈ నెల 13న థియేటర్స్ లో చూడండి. అన్నారు. డీవోపీ రాధాకృష్ణన్ మాట్లాడుతూ - ఈ సినిమాకు వర్క్ చేసే అవకాశం కల్పించిన మా డైరెక్టర్ ప్రశంకర్ గారికి, హీరో రాకేష్ కు థ్యాంక్స్. మా సినిమాలోని బ్యూటిఫుల్ విజువల్స్ మీ అందరినీ ఆకట్టుకుంటాయి. అన్నారు. డైరెక్టర్ ప్రశంకర్ మాట్లాడుతూ - ఈ సినిమా గురించి ఎక్కువ మాట్లాడితే కథలోని ట్విస్ట్స్ రివీల్ అవుతాయి. అందుకే ట్రైలర్ లో కూడా ఇంద్రజ గారు లాంటి ఆర్టిస్టులను రివీల్ చేయలేదు. సినిమాలోని కొన్ని క్యారెక్టర్స్ ను మీకు ఇంట్రడ్యూస్ చేయలేదు. స్క్రీన్ మీదే వారి క్యారెక్టర్స్ ను ఎంజాయ్ చేయాలి. ఈ చిత్రానికి దాదాపు కొత్త టీమ్ పనిచేసినా ఎంతో ప్యాషనేట్ గా వర్క్ చేశారు. విశాల్ సాంగ్స్ కే కాదు సీన్స్ కు కూడా బ్యూటిఫుల్ మ్యూజిక్ ఇచ్చారు. చాలా సందర్భాల్లో సాంగ్ ఫైట్ కలిసి ఉంటాయి. డాన్స్, ఫైట్ మాస్టర్స్ కలిసి వాటిని కంపోజ్ చేశారు. రాకేష్ కెరీర్ లో ఎవరికీ చెప్పొద్దు, పేకమేడలు వంటి డిఫరెంట్ మూవీస్ చేశారు. వాటికి కమర్షియల్ హంగులు జోడిస్తే ఎలా ఉంటుందో మాయలేడి అలా ఉంటుంది. హీరోయిన్ మధుమిత క్యారెక్టర్ లో ఎన్నో వేరియేషన్స్ ఉంటాయి. అవన్నీ స్క్రీన్ ఆకట్టుకుంటాయి. ఈ కథ విన్నప్పుడు హీరోయిన్ కు ఎడ్జ్ ఉండే స్క్రిప్ట్ ఇది అయినా నేను ఈ స్క్రిప్ట్ వదులుకోను అని రాకేష్ చెప్పారు. అప్పటి నుంచి ఇప్పటిదాకా కథను నమ్మి ప్రాజెక్ట్ ముందుకు తీసుకెళ్తున్నారు. మీరంతా మా సినిమాతో థియేటర్స్ లో ఒక కొత్త తరహా లవ్ స్టోరీ ఉన్న ఎంటర్ టైనర్ చూడబోతున్నారు. అన్నారు. హీరోయిన్ మధుమిత సర్కార్ మాట్లాడుతూ - ఈ చిత్రంతో తెలుగు ప్రేక్షకుల ముందుకు వస్తుండటం సంతోషంగా ఉంది. నా మొదటి సినిమాలోనే పర్ ఫార్మెన్స్ కు స్కోప్ ఉన్న క్యారెక్టర్ లభించడం అదృష్టంగా భావిస్తున్నా. మాయలేడి సినిమాలో నా క్యారెక్టర్ లో వేరియేషన్స్ చూస్తారు. ఈ సినిమాలో నేను చేసిన స్టంట్స్ కూడా మిమ్మల్ని ఆకట్టుకుంటాయి. మా మూవీ ప్రమోషనల్ కంటెంట్ కు మీరు మంచి రెస్పాన్స్ చూపించారు. ఆ రెస్పాన్స్ తో నాకు మీరు వెల్ కమ్ చెప్పినట్లు భావిస్తున్నా. ఈ నెల 13న మాయలేడి సినిమాను థియేటర్స్ లో చూడండి. బాగా ఎంటర్ టైన్ అవుతారు. అన్నారు. డైరెక్టర్ మహేశ్ బాబు .పి. మాట్లాడుతూ - ఈ సినిమా కోసం రాకేష్, డైరెక్టర్ ప్రశంకర్ చాలా ఎఫర్ట్స్ పెడుతున్నారు. ఈ నెల 13న వారికి పెద్ద సక్సెస్ రావాలని కోరుకుంటున్నా. హీరోయిన్ బాగా పర్ ఫార్మ్ చేస్తోంది. ట్విన్స్ ను ప్రేమించిన ఓ కుర్రాడి కథ ఇది. డైరెక్టర్ ప్రశంకర్ మంచి రైటర్. నాకు 15 ఏళ్లుగా తెలుసు. ఈ సినిమాతో దర్శకుడిగా ఆయన టాలెంట్ చూడబోతున్నాం. రాకేష్ నేను తరుచూ మాట్లాడుకుంటూ ఉంటాం. ట్రైలర్ ఇంట్రెస్టింగ్ గా ఉంది. ఆయనకు ఈ సినిమా సక్సెస్ ఇవ్వాలని కోరుకుంటున్నా. అన్నారు. డైరెక్టర్ శశికిరణ్ తిక్క మాట్లాడుతూ - రాకేష్, డైరెక్టర్ ప్రశంకర్ ఇద్దరూ నాకు మంచి మిత్రులు. రాకేష్ ను నా కుటుంబ సభ్యుడిలా భావిస్తా. నా గూఢచారి సినిమాలో రాకేష్ నటించాడు. సినిమా పట్ల చాలా ప్యాషన్ తో ఉంటాడు. అలాగే ప్రశంకర్ నేను కలిసి కొన్ని స్క్రిప్ట్స్ కు వర్క్ చేశాం. రైటర్ గా ఆయన సెన్సబిలిటీస్ నాకు తెలుసు. వీళ్లిద్దరు కలిసి చేస్తున్న సినిమా కాబట్టి ఈ మూవీ పెద్ద సక్సెస్ కావాలని కోరుకుంటున్నా. ఈ నెల 13న మీతో పాటు నేనూ థియేటర్ లో సినిమా చూస్తాను. అన్నారు. హీరో, ప్రొడ్యూసర్ రాకేష్ వర్రే మాట్లాడుతూ - పేకమేడలు, ఎవరికి చెప్పొద్దు తర్వాత ఎలాంటి సినిమా చేయాలి అని ఆలోచనలో ఉన్నప్పుడు మాయలేడి స్క్రిప్ట్ విన్నాను. నేను ఈ సినిమా చేసేందుకు రెండు ప్రధాన కారణాల్లో ఒకటి స్క్రిప్ట్, రెండోది డైరెక్టర్ గా ప్రశంకర్ కు ఉన్న ప్యాషన్. మేము ఈ సినిమా అనుకున్నప్పుడు పెద్ద బడ్జెట్స్ ఏవీ లేవు. మధుమిత హీరోయిన్ గా, విశాల్ చంద్రశేఖర్ మ్యూజిక్ డైరెక్టర్ గా మా టీమ్ లో జాయిన్ అయ్యాక..ప్రాజెక్ట్ స్పీడప్ అయ్యింది. సురేష్, సత్య, మధురిమ, లావణ్య..ఇలా టీమ్ ఫామ్ అయ్యింది. మేమంతా ఒక ఫ్యామిలీ మెంబర్స్ లా మూవీ చేశాం. కాస్టింగ్ ఇంట్రెస్టింగ్ గా ఉండాలని ప్రయత్నించాం. టెక్నీషియన్స్ ను తీసుకోవడం లో కూడా మా విజన్ ఉంది. అది స్క్రీన్ మీద మీరే చూస్తారు. మీ అంచనాలు అందుకునేలా సినిమా ఉంటుంది. మీ అందరికీ మా సినిమా నచ్చుతుందని నమ్ముతున్నాం. ఈ నెల 13 రిలీజ్ టఫ్ డేట్ అని తెలుసు. చాలా సినిమాలు ఆ తేదీన వస్తున్నాయి. నాపై అభిమానంతో మా డిస్ట్రిబ్యూటర్స్ ఈ డేట్ ఎందుకు అని కూడా చెప్పారు. స్ట్రాంగ్ కంటెంట్ ఉంటే ఎన్ని సినిమాల మధ్యనైనా మా సినిమా ఆదరణ పొందుతుందని మేము నమ్మాం. ఆ కంటెంట్ నే నమ్ముకుని ఈ నెల 13న రిలీజ్ చేస్తున్నాం. ఈ సినిమా సక్సెస్ అయితే మరికొందరు కొత్త వాళ్లతో నేను సినిమాలు చేయగలుగుతాను. మీ ఫ్యామిలీ, ఫ్రెండ్స్ తో థియేటర్స్ కు వస్తే హ్యాపీగా బయటకు వెళ్తారు. అది ప్రేక్షకులకు ఇచ్చే నా ప్రామిస్. అన్నారు. నటీనటులు -రాకేష్ వర్రే, మధుమిత సర్కార్, తదితరులు

టార్టాయిస్" సినిమా నుంచి 'రంగు రంగు రంగు పిల్లరో..' లిరికల్ సాంగ్



రాజ్ తరుణ్ హీరోగా నటిస్తున్న కొత్త సినిమా "టార్టాయిస్". ఈ చిత్రంలో అమృత చౌదరి, అవసరాల శ్రీనివాస్, ధన్య బాలకృష్ణ ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. "టార్టాయిస్" సినిమాను ఎస్ కే గోల్డెన్ ఆర్ట్స్, ప్రశ్వీత ఎంటర్టైన్మెంట్, ఎన్ వీ ఎల్ క్రియేషన్స్ బ్యానర్స్ పై విజయ్ చౌదరి, శశిధర్ నల్ల, రామిశెట్టి రాంబాబు నిర్మిస్తున్నారు. ఈ సినిమాను సస్పెన్స్, డ్రామా కలిసిన ఇంటెన్స్ యాక్షన్ థ్రిల్లర్ కథతో దర్శకుడు రిత్విక్ కుమార్ రూపొందిస్తున్నారు. మానస కుమార్ కో ప్రొడ్యూసర్ గా వ్యవహరిస్తున్నారు. అనూప్ రూబెన్స్ సంగీతాన్ని అందిస్తున్న "టార్టాయిస్" సినిమా బ్లాక్ బస్టర్ మ్యూజికల్ జర్నీ స్టార్ట్ చేసింది. ఈ సినిమా నుంచి ఇప్పటికే రిలీజ్ చేసిన 'నీ పరిచయం..' సాంగ్ మ్యూజిక్ లవర్స్ నుంచి హ్యూజ్ రెస్పాన్స్ తెచ్చుకుంది. ఈ రోజు "టార్టాయిస్" సినిమా నుంచి 'రంగు రంగు పిల్లరో..' లిరికల్ సాంగ్ ను మేకర్స్ రిలీజ్ చేశారు. 'రంగు రంగు రంగు పిల్లరో..' పాటను మ్యూజిక్ డైరెక్టర్ అనూప్ రూబెన్స్ ఎనర్జిటిక్ ట్యూన్ తో కంపోజ్ చేయగా, ప్రముఖ జానపద గాయకుడు, కవి పెంచల్ దాస్ లిరిక్స్ రాసి పాడారు. 'రంగు రంగు రంగు పిల్లరో..' పాట ఎలా ఉందో చూస్తే - 'మేడలోన పిల్లవో హో హో, మేడివారి పల్లెలో హో హో, మేడలోన పిల్లవో హో హో మనసు కరగాదెందుకో, చేతికి కెంపుల గాజులు అరువు తెమ్మన్నాది, ముక్కులోకి ముక్కెరొకటి అడిగి తీసుకున్నాది, చెవుల్లోకి జోడు కమ్మలు అవుసులు నాకన్నాది, ఘల్లుఘల్లు కాలి గజ్జెలు గమనించమన్నాది, మాపటికి రమ్మంటే మాయమాటలు చెప్పుతాది, మాపటికి రమ్మంటే మాయమాటలు చెప్పుతాది, రంగు రంగు రంగు పిల్లరో ఈ వగలాడి, చెంగునెగిరే జింకపిల్లరో..' అంటూ ఆకట్టుకునేలా సాగుతుందీ పాట. ఈ పాటలో మ్యూజిక్ డైరెక్టర్ అనూప్ రూబెన్స్, సింగర్, లిరిసిస్ట్ పెంచల్ దాస్ పర్ ఫార్మ్ చేయడం విశేషం. నటీనటులు - రాజ్ తరుణ్, అమృత చౌదరి, అవసరాల శ్రీనివాస్, ధన్య బాలకృష్ణ, షిజు ఏఆర్, రవి కాలె, మొయిన్, తదితరులు

జయంత్ అండ్ ది జింగో పెన్' సినిమా ప్రీ రిలీజ్



నమో జయం ప్రొడక్షన్స్ బ్యానర్ మీద దివ్య ప్రవీణ్ బొలిశెట్టి నిర్మాణంలో జాతీయ అవార్డు గ్రహీత నవీన్ దేశబోయిన తెరకెక్కించిన చిత్రం 'జయంత్ అండ్ ది జింగో పెన్'. ఈ సినిమాలో మాస్టర్ జయంత్ బొలిశెట్టి, మన శంకర వర ప్రసాద్ ఫేమ్ ఊహా రెడ్డి, సత్యం రాజేష్, ఆశిష్ గాంధీ, మానస రాధాకృష్ణన్, తనికెళ్ల భరణి, కాశీ విశ్వనాథ్, మానిక్ రెడ్డి, అశోక్ కుమార్, శ్రీకాంత్ రెడ్డి, తెలుగు ఎక్స్‌పరిమెంట్స్ సాయి కృష్ణ తదితరులు ముఖ్య పాత్రలను పోషించారు. బాలల దినోత్సవం సందర్భంగా ఈ మూవీని నవంబర్ 14న విడుదల చేయనున్నారు. ఈ క్రమంలో మంగళవారం నాడు ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ శ్రీపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ ఈవెంట్‌లో.. తణికెళ్ల భరణి మాట్లాడుతూ* .. 'పిల్లలందరూ కలిసి చూసే ఓ మంచి సినిమా ఈ మధ్య కాలంలో రాలేదు. పిల్లల కోసం మంచి సందేశం ఇచ్చేలా 'జయంత్ అండ్ ది జింగో పెన్' మూవీని తెరకెక్కించారు. దివ్య గారు, ప్రవీణ్ గారు ఈ మూవీని గొప్పగా నిర్మించారు. జయంత్ అద్భుతమైన కుర్రాడు. పిల్లాడికి బంగారు భవిష్యత్తు ఉంది. రానున్న కాలంలో మంచి నటుడు అవుతాడని కచ్చితంగా చెప్పగలను. మంచి సందేశంతో నవీన్ ఈ మూవీని తెరకెక్కించారు. ఇలాంటి మంచి చిత్రం కచ్చితంగా విజయం అవ్వాలి.. కచ్చితంగా సక్సెస్ అవుతుంది' అని అన్నారు. కేఎల్ దామోదర్ ప్రసాద్ మాట్లాడుతూ* .. 'పిల్లలతో చేసే మంచి చిత్రాలు ఎప్పుడూ సక్సెస్ అవుతాయి. ఈ సినిమాలో జయంత్ గొప్పగా నటించాడని అర్థం అవుతోంది. ప్రవీణ్ గారు మల్టీటాలెంటెడ్‌గా కనిపిస్తున్నారు. నవీన్ గారు ఈ మూవీని గొప్పగా తెరకెక్కించినట్టు అనిపిస్తోంది. ఒకప్పుడు మన దగ్గర ఏడాదికి యాభైకి పైగా పిల్లల చిత్రాలు వస్తుండేవి. ఇలాంటి మంచి సినిమాల్ని అందరూ ఆదరించాలి' అని అన్నారు. ఎమ్మెల్సీ శ్రీపాల్ రెడ్డి మాట్లాడుతూ* .. ''జయంత్ అండ్ ది జింగో పెన్' లాంటి చిత్రాన్ని నిర్మించడం గొప్ప విషయం. పిల్లల కోసం మంచి సందేశంతో సినిమాని నిర్మించిన ప్రవీణ్ గారికి ధన్యవాదాలు. నేను లెక్కల మాస్టారుగా పని చేశాను. ఇలాంటి మంచి సినిమాలు చాలా అరుదుగా వస్తుంటాయి. ఇలాంటి మంచి మూవీని పిల్లలు, పేరెంట్స్, టీచర్స్ ఇలా అందరూ చూడాలి. పిల్లల్లో ఉండే ప్రత్యేకమైన ప్రతిభను గుర్తించి వాటికి తగ్గట్టుగా మార్గదర్శకం చేయాలి. ఈ సినిమా గొప్ప విజయం సాధించాలని కోరుకుంటున్నాను' అని అన్నారు. నిర్మాత దివ్య ప్రవీణ్ బొలిశెట్టి మాట్లాడుతూ* .. ''జయంత్ అండ్ ది జింగో పెన్' ఎమోషనల్ స్టోరీ. ఇలాంటి మంచి చిత్రాన్ని అందరూ చూసి సపోర్ట్ చేయాలి. చిల్డ్రెన్స్ డే స్పెషల్‌గా నవంబర్ 14న మా సినిమా రాబోతోంది' అని అన్నారు. ప్రవీణ్ బొలిశెట్టి మాట్లాడుతూ* .. ''జయంత్ అండ్ ది జింగో పెన్' చిత్రంలో ట్యూన్స్, డైలాగ్స్, పాటలు రాసే అవకాశం రావడం నా అదృష్టం. మాకు మంచి సంగీతాన్ని అందించిన మోహిత్ గారికి, మంచి విజువల్స్ ఇచ్చిన కెమెరామెన్ ఆండ్రూ గారికి థాంక్స్. మలయాళం నుంచి రీమేక్ రైట్స్ తీసుకుని.. ఈ సినిమాని ఇక్కడకు వరకు తీసుకు వచ్చే క్రమంలో సపోర్ట్ చేసిన ప్రతీ ఒక్కరికీ థాంక్స్. ఇదొక మంచి మ్యూజికల్, మెసేజ్ ఓరియెంటెడ్ బ్లాక్ బస్టర్ చిత్రంగా నిలుస్తుందని ఆశిస్తున్నాను. మా సినిమాని రిలీజ్ చేస్తున్న ఏషియన్ సురేష్ గారికి థాంక్స్. బాలల దినోత్సవం సందర్భంగా మా మూవీ నవంబర్ 14న రాబోతోంది. అందరూ తప్పకుండా చూడండి' అని అన్నారు. ఆశిష్ గాంధీ మాట్లాడుతూ* .. ''జయంత్ అండ్ ది జింగో పెన్' చిత్రంలో నేను ఒక డిఫరెంట్ పాత్రను పోషించాను. జయంత్‌కి మంచి భవిష్యత్ ఉంది. ఇందులో సాంగ్స్ ఎంతో ఫ్రెష్‌గా ఉంటాయి. బాలల దినోత్సవం సందర్భంగా నవంబర్ 14న ఈ చిత్రం రాబోతోంది. హిందీలో 'తారే జమీన్ పర్' ఉంది.. తెలుగులో ఇకపై 'జయంత్ అండ్ ది జింగో పెన్' ఉంటుంది. ఇలాంటి చిత్రాలు చాలా అరుదుగా వస్తుంటాయి. పిల్లలు, పేరెంట్స్ అందరూ కలిసి ఈ సినిమాని చూడండి' అని అన్నారు. ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ విజయేందర్ రెడ్డి మాట్లాడుతూ* .. ''జయంత్ అండ్ ది జింగో పెన్' సినిమాలోని కొన్ని సీన్స్ చూశాను. ఆగస్ట్ 15కి 'ఖడ్గం' మూవీ ఎలా రిపీట్ అవుతుందో.. ఇకపై నవంబర్ 14కి 'జయంత్ అండ్ ది జింగో పెన్' ఈ చిత్రం రిపీట్ అవుతుంది. జయంత్ అద్భుతంగా నటించాడు. కచ్చితంగా జయంత్ స్టార్ అవుతాడు. పిల్లలు, టీచర్స్, పేరెంట్స్ అందరూ ఈ మూవీని చూడండి' అని అన్నారు. దర్శకుడు నవీన్ దేశబోయిన మాట్లాడుతూ* .. ''జయంత్ అండ్ ది జింగో పెన్' చిత్రానికి సంబంధించిన స్క్రిప్ట్‌లో దివ్య గారు, ప్రవీణ్ గారు ఎంతో సహకరించారు. ఈ మధ్య పిల్లలకు సంబంధించిన చిత్రాలు రావడం లేదు. జయంత్ గొప్ప ఆర్టిస్ట్. ఎంత పెద్ద డైలాగ్ అయినా సరే సింగిల్ టేక్‌లో చెప్పేస్తుంటాడు. డైలాగ్ డెలివరీ, డిక్షన్‌లోనూ వేరియేషన్స్ చూపిస్తుంటాడు. మోహిత్ మంచి మ్యూజిక్ అందించాడు. ఈ చిత్రంలో ప్రవీణ్ గారి సాహిత్యం, బాణీ, మాటలు గొప్పగా ఉంటాయి. సినిమాకి యాభై శాతం క్రెడిట్ నాది, మిగతా యాభై శాతం ప్రవీణ్ గారిదే. ఇలాంటి మంచి సినిమాల్ని ప్రోత్సహించడం మన అందరి సామాజిక బాధ్యత' అని అన్నారు. మాస్టర్ జయంత్ మాట్లాడుతూ* .. ''జయంత్ అండ్ ది జింగో పెన్' చిత్రంతో నన్ను తెరపైకి తీసుకు వస్తున్న మా తల్లిదండ్రులకు థాంక్స్. ఇంత మంచి అవకాశం ఇచ్చిన నవీన్ అన్నకి థాంక్స్. ఈ సినిమా కోసం పని చేసిన ప్రతీ ఒక్కరికీ థాంక్స్. ఈ మూవీలో అన్ని రకాల ఎమోషన్స్ ఉంటాయి. పిల్లలు, టీచర్స్, పేరెంట్స్ అందరూ తప్పకుండా ఈ సినిమాని చూడాలి. చిల్డ్రెన్స్ డే స్పెషల్‌గా నవంబర్ 14న మా మూవీని రిలీజ్ చేస్తున్నాం. అందరూ మాక